ఎరలోకము.

పంక్తిలో పదము, సంక్షిప్తలిపి, సంక్షిప్తలిపిలో పంక్తి, పదము, అక్షరము

ప్రతిపాదనలు కొన్ని.

MEMORIAL LIBRARY
V.R. NARLA
V.R.NARLA
D.P.R.I.
Acc. No.
11854

4.823
EN

రచయిత,
గిడుగు వెంకట రామమూర్తి.

894.8273
VGN
A01A104B126.

ప్రస్తావన వము

భారతదేశ పతనావస్థ ప్రారంభమైనప్పటినుండి ఆర్యజాతి యొక్క సమస్త సద్గుణ సంపద దినదినము క్షీణింపసాగినది; ఇందిపుడు పూర్వపు వీరత్వము లేదు, బుద్ధిబలము లేదు, సాహసము లేదు మరియు నిర్భీకతకూడ లేకుండపోయినది. ఏదేశమందలి ఋషిపుంగవులు "ఏకోహం ద్వితీయోనాస్తి" (అహం అను ఈశ్వరపదార్థము ఒక్కటియే స్థిరమైయున్నది; బాహ్యమున రెండవ కల్పితఈశ్వరుడెవ్వడును లేడనిభావము.) అను అఖండ మగు అంతిమశంఖధ్వని ప్రతిధ్వనింపచేసియుండెనో, ఆత్మస్వరూప నిర్ణయ విషయమున అద్వితీయోపదేశములనిచ్చియుండిరో అట్టి భారతదేశ ప్రజాసమూహమునకు నేడు అడుగడుగున మృత్యువు యొక్క భయంకరాకారము ప్రత్యక్షమగుచున్నది; తమ నీడను తాముచూచి భూతమని భయపడు పిరికిపందలు అధికముకాజొ చ్చిరి. ఇందుమూలమున వారు తమ కర్తవ్యనిర్వహణయందు విముఖులు [illegible] వారినావ రించియున్న [illegible] ప్రతి విజ్ఞా నియు వ్యా [illegible] అన [illegible] నమనగా ఏమి? సిజమ [illegible] మునుగాని గ్రహించుట [illegible] గ్రహిం

DR. B.R. AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N11884

చుటగాని, బుద్ధితో గ్రహింపలేకయుండుటగాని జరిగినప్రుడు దీనిని అజ్ఞానమందురు.

రాత్రిభాగము చీకటికమ్మియున్నది; మార్గమధ్యమున ఒక త్రాడు పడియున్నది. దానిని మనము సర్పమని భావించి చాలభయపడితిమి. ఒక దీపసహాయమునచూచినప్రుడది త్రాడుగ కనుపించెను. భయమునశించెను. చీకటిలో త్రాడు ఒకసర్పముగ గోచరించెను; ఇది మిథ్యాజ్ఞానము. దీపకాంతిలో అది ఒక త్రాడుగ కనుపించెను. ఇది నిజజ్ఞానము. దీనినే వేదాంతపరి భాషలో "రజ్జు సర్పభావము" అని అందురు. మిథ్యాజ్ఞాన మప్రుడు భయభ్రాంతియు, నిజజ్ఞానమప్రుడు సంతోష సంరంభ మును కలిగినది.

కావున ప్రతి విషయగ్రహణమునందు, ప్రతి కార్యనిర్వ హణమందు నిష్పక్షపాతయుతమగు నిజజ్ఞానము నుపయోగింప వలసియున్నది. అప్రుడు ప్రతి మానవహృదయము సుఖశాంతు లకు నిలయము కాగలదు. ఈ నిష్పక్షనిజజ్ఞానసంపాదనార్థము మానవుడు ప్రతినిత్యము స్వాధ్యాయము చేయుచుండవలయును. "స్వస్య అధ్యాయః స్వాధ్యాయః" తన్ను తాను అధ్యయనము చేసికొనుటయే స్వాధ్యాయమగుచున్నది. "తాను" అనగ "ఆత్మ"; బ్రహ్మము, ఈశ్వరుడు "ఆత్మ"కు మారుపేర్లు. కనుక స్వాధ్యాయమనగ ఆత్మపూజయని భావము. ఇంతియేగాకుండ మంచి ఆధ్యాత్మికగ్రంథములను నిజభావముతో అధ్యయనము చేయుటకూడ స్వాధ్యాయమే!

ACC.NO:1884

అట్లు స్వాధ్యాయమును చేయుచున్నపుడు నిజజ్ఞానముద యింపగలదు. అట్టి జ్ఞానదీపముతో మానవుడు నిర్భయుడై గంభీరమగు ఆధ్యాత్మిక సమస్యలను సునాయాసముగ పరిష్కరింపగలుగుచుండును.

"పరలోకము" అను ఈ గ్రంథమందు సూక్ష్మదేహ సూక్ష్మలోక స్వర్గనరక పునర్జన్మాది విషయములగురించి సమీక్షాపూర్వకముగ రచనావ్యాసంగముచేయబడినది. పై విషయములు అతిగహనములై, గంభీరములై మరియు అగోచరములుకూడనైయున్నవి. పై విషయములన్నియు పరలోకమునకు సంబంధించి, అతిసూక్ష్మములై స్థూలనేత్ర స్థూలమస్తిష్కములకు అగోచరములగుచున్నవి. కాని ఆధ్యాత్మికవేత్తలగు యోగులు మునిపుంగవులు తురీయస్థితియగు సమాధ్యవస్థను పొందినపుడు అతీంద్రియదృష్టితో పరలోకరహస్యములను తెలిసికొనగలుగుచుందురని శాస్త్రాధారములు కనుపించుచున్నవి. అయినప్పటికి పై నుదహరింపబడిన సూక్ష్మవిషయముల గ్రహించుటకై పక్షపాతరహితమగు నిజజ్ఞానమెంతయో అవసరమైయున్నది. కావున ఈ గ్రంథరచనకు అట్టి మహాత్ముల గ్రంథముల సహకారము వీలైనంతగ స్వీకరింపబడినది.

మతగ్రంథములపై, మతసిద్ధాంతములపై ఆధారపడి పరలోక రహస్యములను గ్రహింప ప్రయత్నించుట అసంభవమే కాగలదు. ఎందువలన ?—

ఇపుడు వ్యాప్తియందున్న మతములలో ముఖ్యమైనవి. (1) హిందూమతము, (2) మహమ్మదీయమతము, (3) క్రైస్తవ మతము. ఈ త్రిమతములుకూడ పరలోకమును, అందుగల ఈశ్వరుని అంగీకరించుచున్నవి. ఒక మతమందలి సూక్ష్మలోక మునకు, స్వర్గనరకములకు మరియు ఈశ్వరస్వరూపమునకు, మరియొక మతమందలి స్వర్గనరక ఈశ్వరస్వరూపాదులకు ఏమియు పొంతనము కుదురుటలేదు. మూడుమతములయందు మువ్విధములగు స్వర్గనరకములు మరియు భిన్నవిభిన్నములగు ఈశ్వరస్వరూపాదులు వర్ణింపబడియున్నవి. ప్రతి మతవాది స్వీయమతప్రోక్తమగు విషయములనే యదార్థములని భావించి, అన్యమతవిషయము లసత్యములని మతమౌఢ్యముతో పరమత ములు దూషించుచున్నాడు. ఏ మతవిషయము యదార్థమో ఎవరును నిర్ధారింపజాలరు! మతవాదులు పరస్పరము దూషణ తిరస్కారములతో కలహించుచుందురు. ఇందువలన ఎన్నియో మహాయుద్ధములు, రక్తపాతములు జరిగియున్నట్లు చరిత్ర పుట లను తిరుగవేసిన తెలియగలదు. ఏ ఒక్క మతఈశ్వరుడుకూడ ప్రత్యక్షమై యదార్థమును తెలియపర్చి సంశయనివృత్తిచేసి యుండలేదు. అట్టి ఈశ్వరుడే లేనపుడు ఎట్లు ప్రత్యక్షము కాగలడు ?

ఇందుమూలమున విషయగ్రహణకు ఆధ్యాత్మికశాస్త్రీయ గ్రంథముల సహకారము వీలైనంతగను కొంతవరకు స్వీకరింప బడినది.

ఈ గ్రంధమునకు "పరలోకము" అను నామకరణముం చుట సమంజసమగుచున్నది. ఇందు సూక్ష్మదేహ సూక్ష్మలోక పునర్జన్మాదులగురించియు, స్వర్గనరకములగురించియు యథా శక్తి సమీక్షించబడినది; స్వానుభవమునకు అనేక శాస్త్రాధార ముల మేళవించి, నిష్పక్షపాతజ్ఞానముతో ఈ గ్రంధరచన చేయబడి నది. "గ్రధ్యతే విరచ్యతే ఇతి గ్రంధః" అనేక శాస్త్రప్రమా ణాదులతో కూర్చి రచింపబడుదానికి గ్రంధమనిపేరు.

"పరలోక"అను సమాసపదమందు-"పర" "లోక"అను రెండు శబ్దములుకూడియున్నవి. రెండుశబ్దములను కలుపుటవలన "పరలోకము" అయినది. "పరః" అను శబ్దమునకు అనేక పర్యాయపదములుండియున్నను - "అన్యము" "శ్రేష్ఠము" అను అర్థములను తరుచుగ ప్రయోగింపబడుచుండుట మనకు తెలిసియేయున్నది; ఇందులకు శాస్త్రాధారములుకూడ కలవు-

అన్యార్థప్రమాణము-

(1) శ్లో॥ పరాన్నం చ పరస్వం చ పరశయ్యా పరస్త్రియః।
పరవేశ్మని వాసశ్చ శక్రాదపి హరేత్ శ్రియమ్॥

శ్రేష్ఠార్థప్రమాణము-

(2) శ్లో॥ అన్నదాతుః శతగుణోఽభీష్టదేవః పరః స్మృతః।
గురుస్తస్మాచ్చత గుణోవిద్యామంత్రప్రదాయకః॥

(1) నిత్యము పరాన్నమును భుజించుచు ఇతరులద్రవ్యము ననుభవించువాడు, సదా పరశయ్యాశాయియగుచు పరస్త్రీల

ననుభవించువాడు ఇంద్రుడంతటివానికైనను ఐశ్వర్యము నశించి పోగలదని భావము.

(2) అన్నదాతకన్న నూరురెట్లు ఇష్టదైవము శ్రేష్ఠుడని చెప్పబడుచున్నది. అట్టి ఇష్టదైవముకన్న విద్యను, మంత్రమును ఉపదేశించినట్టి గురువు నూరురెట్లధికులని భావము.

ఇచట పై రెండుశ్లోకములు పరశబ్దప్రయోగవివరణార్థమే ఉదహరింపబడినవి. కాని వానియందలి భావములు సందర్భాను సారములు కాజాలవు. లోకశబ్దవివరణము- "లోకృ" అనుశబ్ద మునకు - జగత్తు, ప్రపంచము, ప్రదేశము, ప్రజ, జీవధారి ఇత్యాద్యనేకపర్యాయపదములు కలవు. సాధారణముగ లోక మనిన జగత్తని, ప్రపంచమని గ్రహించుచుందురు. ఇట్టిలోకము లెన్నికలవు ? అను విషయమున అనేక మతభేదములు కలవు.

(1) ఉపనిషత్ సాహిత్యమందు- (1) ఇహలోకము (2) పరలోకము అను రెండేలోకములు పేర్కొనబడినవి.

(2) వేదసాంకేతిక ప్రాచీనపదకోశమగు "నిరుక్త" మందు- (1) భూలోకము, (2) అంతరిక్షలోకము, (3) స్వర్గ లోకము లేక సూక్ష్మలోకము;అనిమూడులోకములుచెప్పబడినవి.

(3) పురాణ సాహిత్య పరిభాషయందు- భూ లో క భువర్లోక స్వర్లోక మహర్లోక జనోలోక తపోలోక సత్యలోకము లను ఊర్ధ్వలోకము లేడున్నా, అతల వితల సుతల మహాతల

రసాతల తలాతల పాతాళములను ఏడు అధోలోకములనిన్ని పదునాలుగు లోకములుగ విభజింపబడియున్నవి.

ఈ త్రివిధ ప్రమాణములలోను దేనిని మనము విశ్వసింప వలసియున్నది? అను సమస్య ఉదయింపగలదు. అష్టాదశపురాణములను, భారతభాగవతములను వేదవ్యాసుడే రచించియున్నట్లు ఆధారములు కనుపించుచున్నవి. భారతయుద్ధానంతరము పురాణములన్నియు స్వార్థపరులగు మతవాదులమూలమున ప్రక్షిప్తములై పోయినవి; అనగా- చేర్పులు, కూర్పులు జరుపబడినవని భావము. హిందూమతమందుకూడ ద్వైతాద్వైతవిశిష్టాద్వైతములను మూడు శాఖలు కలవు వారు గీతయందే యథేచ్ఛగ తమతమ సిద్ధాంతములకనుగుణముగ చాలశ్లోకములనే ప్రక్షిప్తముచేసియున్నట్లు తగుఆధారములు కనుపించుచున్నవి. పై నుదహరింపబడిన త్రిమత మూలప్రవక్తలు అట్లుచేసి యుండకపోవచ్చును. తదనంతరము మతపండితులీ సంకరమును సృష్టించియుందురు. తదాది సమస్తము వ్యాసప్రోక్తమనియే ప్రజలంగీకరించుచున్నారు. ఆర్యమతస్థాపకుడగు శ్రీ దయానందులు గీతయందు ఏ అధ్యాయములలో, ఏయే శ్లోకములు ప్రక్షిప్తములలో సవివరముగ నిర్ధారించియున్నారు. అట్టి గీతయే ప్రక్షిప్తమునకు గురియైనపుడు, పురాణప్రక్షిప్తములగురించి సంశయింపవలసిన పనియుండదు. విజ్ఞానవంతులగు ప్రభువులు, ప్రజలు భారతయుద్ధమున నశించిపోగా, మిడిమిడిజ్ఞానముగల రాజులు, ప్రజలు

మిగిలియున్న కారణమున పురాణములందలి ప్రక్షిప్తములను, అసందర్భములను గ్రహింపజాలక లేదా గ్రహించినను మత వాదుల ప్రతిఘటింపజాలక వారిననుసరించుచునే పోవుచుండిరి. కావున ప్రస్తుతము మనకు లభ్యమగు పురాణసారస్వతమంతయు అసందర్భ అభూత విషయములతో సంకరమైపోయి అగ్రాహ్యమగుచున్నది.

గీతను, బ్రహ్మసూత్రమును, ఉత్తరమీమాంసను రచయించినట్టి, ప్రథమమున ఏకైకమూలరచనగ ప్రాదుర్భవించిన వేదమును నాలుగు విభాగములుగ, శాఖోపశాఖలుగ విభజించి ప్రజోపకరముగ రచించినట్టి శ్రీ వ్యాసమహర్షి అసందర్భవిషయసంకులమైయున్న నేటిపురాణసాహిత్యమును రచించియుండెననిన మనము విశ్వసించుటెట్లు? మరియొక వ్యాస నామధేయుడు వీనిని రచించియుండవలయును; లేదా వ్యాసప్రోక్తములగు పురాణములను మతవాదపండితులు యథేచ్ఛగ ప్రక్షిప్తము చేసియుండవలయును. మహాత్ముడగు వ్యాసునిగురించి కొంత ఇందుదహరించుట సమంజసమగుచున్నది.

వ్యాసపర్యాయపదములు- (1) వ్యాసుడు, (2) వేదవ్యాసుడు, (3) ద్వైపాయనుడు, (4) కృష్ణద్వైపాయనుడు, (5) కానీనుడు, (6) పారాశరుడు, (7) సత్యవతేయుడు, (8) సత్యవ్రతుడు, (9) కృష్ణుడు, (10) బాదరాయణుడు ఇత్యాదిసార్థక నామములతో వ్యాసుడు ప్రసిద్ధిగాంచియుండెను.

"వ్యస్యతి పృథక్కరోతీతి వ్యాసః" వేర్వేరుగ చక్కగ విపులీకరించువాడు కావున వ్యాసుడని పేరుకలిగినది.

"వేదం వ్యస్యతి పృథక్కరోతీతి వేద వ్యాసః" అనగా- మూలవేదమును చక్కగ విభజించి విపులీకరించినందున వేద వ్యాసుడను పేరుకలిగినది.

ప్రమాణము-

శ్లో॥ యో వ్యస్యతే వేదాంశ్చతు స్తపసా భగవాన్మృషిః।
లోకే వ్యాసత్వమాపాదే కార్ష్ణ్యాత్ కృష్ణత్వమేవచ॥

(ఇతి మహాభారతే)

తపోమహిమవలన చతుర్వేదములుగ మూలవేదమును విపులీకరించి విభజించిన మహాత్ముడగు ఋషిపుంగవుడైనందున వ్యాసుడనియు, నల్లనివాడగుటవలన కృష్ణుడనియు వ్యాసుడు లోకమున ప్రసిద్ధిగాంచెనని భావము.

(1) శ్లో॥ వేదమేకం చతుర్భేదం కృత్వా శాఖాశతైర్విభుః।
కరోతి బహులం భూయో వేదవ్యాస స్వరూపధృక్॥

(2) శ్లో॥ ద్వాపరేతు యుగే విష్ణుర్వ్యాసరూపే మహామునే।
వేద మేకం స బహుధా కురుతే జగతో హితః॥

(ఇతి విష్ణుపురాణే)

(1) వేదవ్యాసరూపధారియగు ఋషిపుంగవుడు ఒకే రూపమందున్న మూలవేదమును నాలుగు విభాగములుగ విభ

జించియుండెను. తిరిగి వీనిని నూరుశాఖలుగ విభజించి విస్తరింప చేసియుండెను.

(3) ఓ మహామునే! ద్వాపరయుగమందు శ్రీమహావిష్ణువు వ్యాసరూపధారిగ అవతరించెను. ఒకే మూలవేదమును జగత్కల్యాణార్థము నానావిధరూపమున విభజించియుండెను. ఇందుమూలమున వ్యాసునకు వేదవ్యాసుడను పేరుకలిగెను.

ద్వైపాయనః
కృష్ణద్వైపాయనః

"ద్వీపః అయనం ఉత్పత్తిస్థానం యస్య ద్వైపాయనః।"
"కృష్ణశ్చాసౌ ద్వైపాయనః కృష్ణద్వైపాయనః॥"

యమునానదీ ద్వీపమందు సత్యవతికి పరాశరునివలన జన్మించి నల్లనిదేహముకలవాడగుటవలన కృష్ణద్వైపాయనుడని వ్యాసునకు పేరుకలిగినది.

"కానీనః"—

శ్లో॥ కానీనః కన్యకాజాతో మాతామహసుతో మతః॥

(ఇతి యాజ్ఞవల్క్యః)

కన్యవలన పుట్టినవాడు "కానీనుడు" అని పిలువబడును. అట్టి సంతానమందు మాతామహునికి అధికారముండునని భావము. కన్యకయగు సత్యవతికి జన్మించినందున వ్యాసునకు "కానీనుడు" అని పేరుకలిగినది.

పరాశరమహర్షి యమునానదిని దాటుచు కన్యకగా

నున్న సత్యవతినిచూచి మోహించి, ఆమెతో యమునానదీ ద్వీపమందు రమింపగ సద్యోగర్భమున జన్మించినవాడుగాన వ్యాసునకు "కానీనుడు" అను పేరుకలిగినది. పరాశరుని కుమారుడుగాన పారాశరుడని, సత్యవతి సంతానమైనందున "సాత్యవతేయుడని", సదా సత్యవాక్య సత్యకర్మలయందు అభిరుచికలిగియున్నందున "సత్యరతుడని", నల్లనివాడుగాన "కృష్ణుడని" ఇత్యాద్యనేక సార్థకనామములతో శ్రీ వ్యాసుడు విరాజిల్లుచు ధర్మనిష్ఠాగరిష్ఠుడై యుండెను.

ప్రాచీనకాలమున ఋషులు ధర్మపరిపాలనా సౌకర్యార్థము అప్పటి ప్రభువులకు స్మృతులను రచించి ఇచ్చి, అందలి ధర్మములను ప్రభువులచే • పరిపాలనయందు ప్రవేశింపచేసి, అమలుజరుగు ఏర్పాట్లుచేసియున్నట్లు గోచరించుచున్నది. స్మృతులనగా - లా బుక్సు (Law Books) అని గ్రహింపవలసియున్నది. ఇపుడట్టి స్మృతులలో (1) మనుస్మృతి, (2) నారదీయ మనుస్మృతి, (3) పరాశరస్మృతి, (4) వేదవ్యాసస్మృతి, (5)లఘు వ్యాసస్మృతి, (6) గౌతమస్మృతి, (7) వసిష్ఠస్మృతి, (8) శంఖ స్మృతి, (9) బృహస్పతిస్మృతి, (10) యమస్మృతి, (11) బుధస్మృతి ఆదిగాగలపి 44 స్మృతులుమాత్రము ఇప్పుడు లభ్యమగుచున్నవి. గ్రంథవిస్తరభీతిచే వానిపేర్ల నిచట పూర్తిగా లిఖింపజాలకున్నాను.

శ్లో॥ కృతేతు మానవాధర్మాస్త్రేతాయాం గౌతమాస్స్మృతాః।
ద్వాపరేశంఖ లిఖితాః కలా పారాశరా స్స్మృతాః॥
(ఇతి పారాశరస్మృతి)

కృతయుగమందు మనుప్రోక్తధర్మములు, త్రేతాయుగమందు గౌతమధర్మశాస్త్రములు, ద్వాపరమంచు శంఖమునిధర్మములు, కలి యుగమున వ్యాసధర్మములు శ్రేష్ఠములని భావము.

శ్రీ వ్యాసమహర్షి వేదవ్యాసస్మృతి, లఘువ్యాసస్మృతి అను రెండు స్మృతులను రచించియుండెను. వ్యాసప్రోక్తధర్మ ములు కలియుగమందు ప్రాముఖ్యతపొందియున్నందున, పురాణ సాహిత్యమందు ప్రక్షిప్తరూపమున మతవాదపండితులు తమ తమ కల్పితవిషయములతో నింపియుందురు. వ్యాసుని నామము లలో "సత్యవ్రతుడు" అను సార్థకనామముకూడకలదు. అట్టి సత్యసంధుడగు వ్యాసమహాత్ముడు, స్మృతినిర్మాతయగు వేద వ్యాసుడు ఇట్టి అసంగత పురాణసాహిత్యమును రచింపగలడా? ఇది అసంభవము!

కావున మన పురాణసాహిత్యము సొంతముకాకపోయి నను, కొంతవరకైన సంకరమైయున్నట్లు భావింపవలసియున్నం దున - "లోకములు పదునాలుగు" అను పురాణ ప్రమాణ మును అంతగ పాటింపవలసిన పనియుండదు. ప్రాచీన వేదపద కోశమగు నిరుక్తమందు– భూమిఉపరిభాగమునుండి స్వర్గలోక పర్యంతముగల అంతరిక్షభాగమునుకూడ ఒకలోకముగ భావించి

"మూడు లోకములు" అని నిర్ణయింపబడినది. స్వర్గలోకము కూడ అంతరిక్షమందే ఉండియున్నందున - వస్తునిర్దేశార్థము అంతరిక్ష స్వర్గలోకములని రెండుగ విభజించి, భూలోకముతో సహా మూడని వివరించి యుండవచ్చును. కావున దీనినంత వ్యాఖ్యాసముగ భావింపనవసరముండదు.

ఉపనిషత్ సారస్వతమందు– ఇహమని, పరమని రెండే లోకములు నిర్వచింపబడినవి. ఇహమనగ భూలోకము, పరమనగ స్వర్గలోకము లేక సూక్ష్మలోకము అని భావింపవలసియున్నది. ఇది చాల సమంజసముగ, యుక్తియుక్తముగ మరియు శాస్త్ర సమ్మతముగకూడ ఉండియున్నది. పై ప్రమాణముల ననుసరించి వేదవిస్తృతాది విభాజక కార్యక్రమమందు వ్యాసుడు నాలుగు వేదములతోసహా బ్రాహ్మణములను, అరణ్యకములను మరియు ఉపనిషత్తులనుకూడ రచించియుండవలయును. ఇందువలన వేద సాహిత్యమందుగాని, బ్రాహ్మణారణ్యకోపనిషత్ సాహిత్యమందు గాని, పురాణసాహిత్యమందువలె అసంగత రచనాసంఘటనలు గోచరించుట లేదు.

చతుర్వేదములతోసహా బ్రాహ్మణ ఆరణ్యకాది వేద భాగములయొక్క అంతమున ఉపనిషత్తులు రచింపడియున్నందున ఉపనిషత్తునకు "వేదాంతము" అను మారుపేరుకూడ కలిగినది. వేదములందు, బ్రాహ్మణములందు చాలవరకు గృహాశ్రమానుకూల కర్మకాండ వర్ణింపబడియున్నదని, ఆరణ్యకములు

వానప్రస్థునకు యోగ్యములని, ఉపనిషత్తులు సన్యాస్యాశ్రమ వాసులకు శ్రేయోదాయకములని విద్వాంసుల అభిమతమై యున్నది.

వేదాః- "విదంతి విచారయంతి సర్వే మనుష్యాః సత్య విద్యాం యైఃతే వేదాః" (వ్యుత్పత్తి) సమస్త మానవులు వేని మూలమున సత్యవిద్యను తెలిసికొనుచున్నారో వానిని వేదము లందురని భావము.

బ్రాహ్మణములు- బ్రహ్మమును తెలుపు గ్రంథములు. కావున బ్రాహ్మణగ్రంథములని వీనికి పేరుకలిగినది. ఈ ధార్మిక గ్రంథములయందు యజ్ఞానుష్ఠానవిధానములు విపులముగ వర్ణింప బడియున్నందున ఇవి గృహస్థులకు అనుకూలములు.

అరణ్యకములు- "అరణ్యే భవం ఇతి ఆరణ్యకమ్" వీనియొక్కరచన, అధ్యయనము అరణ్యములందు జరిగియున్నం దున ఆరణ్యకములని చెప్పబడుచున్నవి. ఇవి వానప్రస్థానుకూల ధర్మములను బోధించుచున్నవి.

ఉపనిషత్తులు- ఉప-సమీప మందు, ని-రహస్యముగ సద్—కూర్చుండి అభ్యసించు ఆత్మవిద్యాగ్రంథములకు ఉపని షత్తులనిపేరు.

రహస్యమయ పరావిద్యను గురుసన్నిధికి కూర్చుండి యోగ్యతగల శిష్యులకు ఈగ్రంథములతో అధ్యయనము జరిగి యున్నందున వీనికి ఉపనిషత్తులు అను పేరుకలిగినది. ఇవి జ్ఞాన

కాండకు సంబంధించి చతుర్థాశ్రమమగు సన్యాసమున కనుకూల
ముగ నుండగలవు. వీనియందు సర్వోత్కృష్టమానవధర్మములు,
దర్శనతత్వములు వర్ణింపబడియున్నవి. ఇందు లేని మానవధర్మ
సూక్ష్మములు ఏ మతమందును లేవు! వీనితోసహా ఉపర్యుక్తవై
దిక గ్రంథములన్నియు ఉపర్యుక్తప్రమాణములననుసరించి వేద
వ్యాసప్రోక్తములనియేభావించుట సమంజసము కాగలదు. ఇట్టి
ఉత్తమగ్రంథరచనాదురంధరుడగు వేదవ్యాసుడు క్రమవిరుద్ధ
పురాణసాహిత్య రచనకు వారసుడు కాజాలడు!

"పర" "లోక"అను రెండుశబ్దములతోకూడిన సమాస
మగు "పరలోక" అను పదమునకు- (1) స్వర్గము (2) వైకుం
ఠము (3) రెండవలోకము (4) రెండవజన్మ (5) రెండవ శరీ
రము అను అర్థములు కలవు.

కావున ఈ గ్రంథమందు- సూక్ష్మదేహ సూక్ష్మలోక
స్వర్గనరక పునర్జన్మాదులగురించియు, తత్సంబంధిత విషయముల
గురించియు వర్ణింపబడియున్నందున దీనికి "పరలోకము" అను
పేరు నిర్ణయించుట నాకు యుక్తియుక్తముగ తోచినది.

ఈశ్వరుడు- సాంప్రదాయకులు మతఈశ్వరుని సర్వాంత
ర్యామి అని చెప్పుచున్నారు. అది నిజమైన శవముయొక్క ప్రతి
అంగమున, ప్రతికణమున ఈశ్వరుడుండియుండవలయును. ఈశ్వ
రునకు, చేతనతకు అవినాభావసంబంధము కలిగియున్నది. కాని
శవమందు చేతనత ఉండదు; జడతుల్యమైయుండును. అట్టి శవ

మందు ప్రాణమున్న, ప్రాణధారణకర్తయగు ఆత్మయుకూడ లేనందున దానికి చేతనత సమకూరుటలేదు. "అయమాత్మా బ్రహ్మ" అను మహావాక్యము ననుసరించి ఆత్మయే ఈశ్వరుడనియు, ఇతనికి ఇతరమగు మతఈశ్వరుడు సర్వాంతర్యామియై యుండుట అసంభవమనియు ధృవపడుచున్నది.

శ్రీకణాదిమహర్షి తన "వైదేశికదర్శనశాస్త్రము"నందు ఆత్మయొక్క లేదా బ్రహ్మముయొక్క చిహ్నములను ఈక్రింది విధముగ నిర్ధారించియుండెను. ఈశ్వరనివాసయోగ్యమగు స్థానము మానవదేహమనికూడ అందలిభావమైయున్నది.

సూత్రము- "ప్రాణాపాన నిమేషోన్మేష జీవన్మనో
గతీంద్రియాంతర్వికారాః।
సుఖదుఃఖేచ్ఛాద్వేష ప్రయత్నాశ్చాత్మనోలింగాని"

ప్రాణాపానవాయు సంచారము, నేత్రములయొక్క నిమీలనోన్మీలనము, మనోప్రాణ సంబంధితములగు ఇంద్రియగమన వికారములు, సుఖదుఃఖ ఇచ్ఛాద్వేషభావములు కలిగియుండుట ఆత్మకు చిహ్నములై యున్నవని భావము.

కావున పై సూత్రానుసారముగ ప్రాణముగల వస్తువే "ఆత్మ"యైయున్నది. ఆత్మకు మారుపేరే ఈశ్వరుడు. అనగ జీవాత్మతోకూడిన మానవుడే మాధవుడగుచున్నాడు. మాధవుడనిన "పరమాత్మ" యని తెలియునది.

ప్రమాణము- శ్లో॥ "మానాత్ ధ్యానాచ్చ యోగాచ్చ విద్ధి భారత మాధవమ్॥" ఓ అర్జునా! మానముగ ధ్యానావస్థితు డవై యోగసాధనవలన ఆత్మరూపియగు మాధవుని తెలిసి కొనుము అని భావము. వ్యుత్పత్తి- "మాయా విద్యాయాః బుద్ధివిద్యాయాః ధవః అధిపతిః మాధవః" బుద్ధివిద్య (ఆధ్యాత్మిక విద్య)కు ప్రభువు లేక అధిపతి కావున మాధవుడగుచున్నాడు. అనగ- ఆత్మయని భావము. అధ్యాత్మికవేత్తనుకూడ మాధవుడని పిలువవచ్చును. కనుకనే గొప్ప ఆత్మతత్వవేత్తయగు శ్రీకృష్ణునికూడ మాధవుడని పిలువసాగిరి.

ఆత్మికవాదాద్వైతసిద్ధాంతమే వేదములయందుకూడ గోచరించుచున్నది. వేదములయందు- ఈ మానవశరీరమునే ఈశ్వర మందిరముగ, శివాలయముగ, అయోధ్యాపురముగ మరియు వైకుంఠముగ భావించి అందు ఆత్మారాముడు నివసించియున్నట్లు అందలి మంత్రములమూలమున వ్యక్తమగుచున్నది. అట్టిఆత్మనే వేదములు బ్రహ్మ లేక ఈశ్వరునిగ అంగీకరించుచున్నవి. ఈదిగువ నుదహరింపబడిన అధర్వవేదమంత్రమును గమనింపుడు-

మం॥ అష్టా చక్రా నవద్వారా దేవానాం పూరయోధ్యా।
తస్యాం హిరణ్మయః కోశః స్వర్గో జ్యోతిషావృతః॥
(అధర్వ-కాండ 10-సూక్త 2-మంత్ర-31)

మంత్రార్థము- నేత్రనాసికలతోసహా ఎనిమిది చక్రములున్న, తొమ్మిది ద్వారములుగల ఇంద్రియగణమునకు

"అయోధ్య"అను పురముగలదు; అందు తేజోమయము మరియు సుఖదాయకమునగు ఒక కోశముకలదు; అది తేజఃపుంజముతో ఆవరించియుండును అని భావము.

యోగశాస్త్రమందు- మూలాధారస్వాధిష్ఠానమణిపూరక అనాహత విశుద్ధ ఆజ్ఞాచక్రములు ఆరు మాత్రమే వర్ణింపబడి యున్నవి. కాని వైదిక సాహిత్యమందు పై నుదహరింపబడిన షట్చక్రములుగాక నేత్రనాసికలతో అష్టచక్రములు వర్ణింప బడినవి. ఇట్టి ముక్తిదాయకమగు అయోధ్యాపురములోపలనే కలదు; వెలుపల లేదు అని వేదముచెప్పుచున్నది. నేత్రనాసికలతో కలిపి అష్టచక్రములతోను, నవద్వారములతోను కూడియున్నది. అట్టి మానవశరీరమున త్రికుటీ అంతర్భాగమున ఒక కోశము కలదు. అది మాంసకండరములతోకూడిన ఒక సూక్ష్మబిలమై యున్నది. ఈ కోశము తేజఃపుంజావృతమైయుండును. నిజమగు అయోధ్యాపురమిదియే! యోగసాధనతో మానవుడే అయో ధ్యాపురమునకుచేరి హిరణ్మయకోశమున ప్రవేశించి ఆనంద మయుడై జీవన్ముక్తుడు కావలసియున్నది. యుద్ధముతోజయింప వీలుకానిదగుటవలన 'అయోధ్య'పురమైనది.

ఈ వేదమంత్రమువలన ఈ అయోధ్యాపురమందున్నవాడే నిజమగు రాముడనియు, ఈ శరీరమే అయోధ్యాపురమనియు వ్యక్తమగుచున్నది. క్రయిస్తమత గ్రంథమందుకూడ- "Body is the temple of God". ఈశరీరమే దేవునకు ఒకఆలయమై యున్నదని చెప్పబడినది.

పై మంత్రమందు "దేవానాం" అను శబ్దము ప్రయోగింపబడినది. దేవశబ్దమునకు దేవతలు, ఇంద్రియములు అని రెండు అర్థములు కలవు. ఈ మంత్రమందలి దేవశబ్దమునకు ఇంద్రియములని కొందరు, దేవతలని కొందరు వ్యాఖ్యానించి యున్నారు. ఉభయ వ్యాఖ్యానములు సమంజసములే అగుచున్నవి. మానవదేహమందు ఇంద్రియములుండుట సహజమే! దేవతలుండుట ఎట్లు? అని ప్రశ్నింపవచ్చును. అథర్వవేదమందే ఒక మంత్రమున ఈ విధముగ విభజింపబడియున్నది.

మం॥ సూర్యశ్చక్షుర్వాతః ప్రాణాం పురుషస్య విభేజిరే।
అథాస్యేతర మాత్మానం దేవాః ప్రాయచ్ఛన్నగ్నయే॥
(అథ-కాం 11-సూ 8-మం 31)

సూర్యుడు పురుషునకు చక్షురూపమై అతని అవయవముగ మారిపోయెను. వాయువు ప్రాణమై అతని అంగమాయెను. ఈ విధముగ సమస్త దేవగణము పురుషదేహమును విభజించుకొని అందుండిపోయిరి. తదనంతరము శేషించిన దేహమును దేవగణము అగ్నిదేవునకు (జఠరాగ్నికి) విడిచిపెట్టిరి.

ఈ విధముగ ఈ మానవదేహమందు- అగ్నిదేవత, జలదేవత, వాయుదేవత, పృథివీదేవి, ప్రాణదేవత మరియు సూర్యదేవతాదులు చాలమంది కలరు.

మం॥ నవైతం చక్షుర్దహతి న ప్రాణో జరసఃపురా।
పురం యో బ్రహ్మణోవేద యస్యాఃపురుష ఉచ్యతే॥
(అథ-కాం-10-సూ-2-మం-30)

ఎవడు నిశ్చయముగ ఈ శరీరరూపియగు బ్రహ్మపుర మును తెలిసికొనుచున్నాడో, అనగ- ఈ బ్రహ్మయొక్కనివాస స్థానమును గ్రహించుచున్నాడో, ఏ స్థానమునకు లేదా పురము నకు పురుషుడు అధ్యక్షుడుగ పేర్కొనబడుచున్నాడో అట్టి పురుషుని నయనేంద్రియము జీవించియుండగ విడువజాలదు; అదే విధముగ వృద్ధావస్థ కలుగకముందే అతనిని ప్రాణములుకూడ విడువజాలవు.

ఈ మంత్రార్థము నిరాకారుడైన, అశరీరియైన మత ఈశ్వరునకు వర్తింపగలదా? అట్లెన్నటికి కాజాలదు!

ఎవడు తన ఆత్మను బ్రహ్మమని, తన శరీరము ఈబ్రహ్మకు నివాసస్థానమని తెలిసికొనుచున్నాడో అతడు ఆత్మజ్ఞాని కాగ లుగుచున్నాడు. ఈ శరీరము నీచమని రోతచెందక, దీనినే బ్రహ్మపురమనిభావించి ఎవడు సాధనాదులద్వారా పరిశుద్ధము గను, పవిత్రముగను, ఆరోగ్యవంతముగను మరియు నిర్వికారము గను ఉంచగలుగుచున్నాడో అతని ఇంద్రియములు పటిష్ఠమై సరియగుస్థితియందుండును; అపుడా పురుషుడు వృద్ధుడు కాజా లడు, అంతపరకు ప్రాణము లతనినుండి వేరుకాజాలవు. ఇదియే నిజమగు జ్ఞానము!

వేదాధ్యయనము చేసినపుడు ఇచ్ఛాశక్తియొక్క, భావన యొక్క మహిమ బాగుగవర్ణింపబడినట్లు మనకు తెలియగలదు. "యద్భావం తద్భవతి" అను ప్రమాణానుసారముగ మనమెట్లు

భావింతుమో అవశ్యమట్లే కాగలుగుచుమనిభావము. ఇట్టి శుభ భావన ప్రార్థన కాజాలదు!

మం॥ అగ్నిర్మాగోప్తావరిపాదుపవిశ్వత। ఉద్యన్తూర్యోనుదతాం మృత్యుపాశాన్॥

(అథ-కాం-17-సూ1-మం-30)

ఆత్మ సమస్త శరీరమును రక్షించునదియైయున్నది; అన్ని వైపులనుండి నన్ను కాపాడుగాక! ఉదయించు సూర్యుడు మృత్యుకారకములగు కీటాణువులను దూరముచేయుగాక! అని పై మంత్రభావము.

అగ్ని- ప్రాణమునకు, ఆత్మకు మారుపేరు ఎందువలన?- దీనిని కలిగియున్నపుడే శరీరము వేడిగనుండును. ఇండుండి ఆత్మ వెడలిపోయినపుడు అగ్నిరహితమై శరీరము చల్లబడిపోవును.

మం॥ మా మాంప్రాణో హాసీన్మో। అపానోఽవహాయపరాగాత్

(అథ-కాం-16-సూ-1-మం-3)

నన్ను ప్రాణము విడువకుండుగాక; అపానముకూడ విడువకుండుగాక! అని పై మంత్రభావము.

పై వేదమంత్రములవలన- భావనకాని ప్రార్థన కాదని స్పష్టముగ తెలియుచున్నది. ఈ మంత్రములు ఇతరులతో చెప్పుచున్నట్టివికావు. తనలోతాను మనసునభావించునవియైయున్నవి, "ఆత్మ నన్ను రక్షించుగాక, మృత్యుకారకక్రిములు నశించుగాక. నా శరీరమునుండి ప్రాణాపానములు వెడలకుండుగాక, నేను

చిరంజీవిగ ఉందునుగాక!"అనునది భావనామాత్రమైయున్నది; ప్రార్థనముకాదు.

పై మంత్రములమూలమున ముఖ్యమగు మూడు విషయములు వ్యక్తమగుచున్నవి.

(1) వేదములు శుభభావనామహత్వమునకు అధిక ప్రాధాన్య మిచ్చుచున్నవి; వేదములు ఇట్టి భావనాపరంపరతో నిండియున్నవి.

(2) వేదమంత్రములందు మత ఈశ్వరప్రార్థన మరియు అట్టి ఈశ్వరవర్ణనముకూడ ఎక్కడను ఉదహరింపబడియున్నట్లు కనుపించుటలేదు.

(3) వేదములు ఒకానొక మతసాంప్రదాయిక ఈశ్వరునిచే రచింపబడినవికావనియు, ఏ మతమునకుగాని మతగ్రంథములు కావనియు తెలియవచ్చుచున్నది. మతవాదులు మత ఈశ్వరుని సర్వశక్తిమంతునిగ, సర్వజ్ఞునిగ, అమరునిగ, నిరాకారునిగ మరియు అవినాశిగ అంగీకరించుచున్నారు. అట్టి మత ఈశ్వరుడు- "నా ప్రాణాపానములు విడువకుండుగాక" అని ఎందులకు భావించును? ఒకవేళ ఈ సంబోధన తన భక్తులగు మానవులకు వర్తించునదని భావించినయెడల- "మానవులగు మీ అందరికి ప్రాణాపానములు విడువకుండుగాక" అని స్పష్టముగాచెప్పియుండెడివాడు. ఇంతియేగాకుండ మానవులు అమ

రత్వమును సాధించుటకు మార్గదర్శకములగు అనేక భావనా మంత్రములు వేదములందు కలవు.

మం॥ యా ఆపో యాశ్చ దేవతా యా విరాడ్ బ్రహ్మణాసహా।
శరీరం బ్రహ్మ ప్రావిశేచ్ఛర్ధ్రే ప్రజాపతిః॥
(అథ-కాం-11-సూ-ర-మం-30)

నీవు దేవసముడవు. గొప్పగొప్ప అన్యదేవతలు బ్రహ్మతో సహా, శరీరరూపబ్రహ్మాండమునకు అధినాయకుడున్న, సృష్టి కర్తయున్న అయిన "జీవుడు" నీ శరీరమందు ప్రవేశించెను. కనుక శరీరముకూడబ్రహ్మమగుచున్నది. శరీరపు ప్రత్యంగమందు రోమరోమమున జీవరూపియగు బ్రహ్మము దేవతలతోసహా విరాజిల్లుచున్నాడని భావము.

అయితే శరీరమనగ మృతశరీరముమాత్రము కాదు; దీనిని బ్రహ్మమని చెప్పవీలు లేదు; శరీరధారియగు ఆత్మను బ్రహ్మమని చెప్పియుండిరి.

వేదములు శరీరరహితుడగు, నిరాకారుడగు కాల్పనిక ఈశ్వరు నంగీకరింపకుండ, శరీరయుక్తమగు వైదిక బ్రహ్మను అంగీకరించియున్నవి. ప్రాచీనకాలమందలి వైదిక బ్రహ్మము లేక సనాతనధర్మము సాకారఈశ్వరు నంగీకరించుచున్నది. అనగ- "శరీరం బ్రహ్మ" అను సాకారసిద్ధాంతము నంగీకరించియుండిరి. వైదికధర్మము నేటి భక్తులవలె శరీరమును తుచ్ఛముగ, నీచ ముగ అంగీకరించియుండలేదు. ఆత్మరూపియగు బ్రహ్మము శరీర

మందలి రోమరోమమున వ్యాపించియున్నపుడు, ఈ శరీరము కూడ అట్టి ఆత్మనుండియే జన్మించియున్నపుడు, అట్టి ఆత్మ అశరీరిగ ఎన్నడూ ఉండజాలనపుడు– సజీవమగు, చేతనతాయుత మగు శరీరమే బ్రహ్మమని వేదములు ప్రకటించుట సమంజసము గనేయున్నది.

పై మంత్రమందలి "ఆపః" శబ్దమునకు సృష్టికర్తయని, బ్రహ్మమునికూడ అర్థములుకలవు; సాధారణముగ దీనికి 'జలము' అను అర్థమును గ్రహించుచుందురు. ప్రస్తుత ప్రకరణార్థమున కిది సరిపోదు. యజుర్వేదమందలి ముప్పదిరెండవ అధ్యాయమున ఒకటవమంత్రమందీ విధముగ దీనినిగురించి వివరింపబడియున్నది.

మం॥ "తదేవ శుక్రంతద్ బ్రహ్మతా ఆపః స ప్రజా పతిః" ఈ మంత్రమున "ఆపః" అను శబ్దమునకు శుక్రమని, బ్రహ్మమని, సృష్టికర్తయనికూడ అర్థములు గోచరించుచున్నవి.

శరీరమును పరిశుద్ధముగ, బలయుతముగ ఆరోగ్యవంతముగ నుంచుకొనుట సముచితమే! ఇదియే నిజమగు బ్రహ్మోపాసనమగుచున్నది. నిజమగు యోగసాధనవల్లనే శరీరము స్వస్థమై, నిరోగమై ఆనందదాయకముగనుండును. ఆరోగ్యవంతమగు శరీరమందే నిశ్చలమగు మనసు నివసింపగలదు. ఈ సిద్ధాంతమునే ప్రాచీనకాలమున ఆత్మజ్ఞానులంగీకరించియున్నారు. "శరీరమాద్యంఖలు ధర్మసాధనమ్" శరీర సంరక్షణమే మొదటి ధర్మసాధనమగుచున్నదని భావము. ఈ ప్రమాణము పై సిద్ధాంతముల స్థిరపర్చుచున్నది.

ఆపశ్శబ్దమునకు "వీర్యము" "సృష్టికర్త"అని అర్థములు కూడ కలవు ఈ సందర్భమున ఈ శబ్దమునకు "వీర్యము"అను అర్థముకూడ అనువుగనేయున్నది. సజీవవీర్యమునుండియే సమస్తము ఉత్పన్నమగుచున్నది. ఇందుమూలముగనే ఆపశ్శబ్దమునకు ప్రజాపతి (సృష్టికర్త) అను అర్థముకూడ అనుకూలముగనున్నది. ఈ కారణముగనే వైదిక నిరుక్త నిఘంటువునందు "ఆపః" శబ్దమునకు "వప్రుః" (శరీరము) అనికూడ వివరింపబడియున్నది. కావున సజీవరేతోశుక్రములచేతనే మానవ శరీరమత్పన్నమగుచున్నది. ఈ శుక్రమే ఈ శరీరమునకు పూర్వరూపము,సూక్ష్మరూపముకూడనైయున్నది. ఇందువలన నిరుక్త మందుదహరింపబడిన ఆపశ్శబ్దార్థవివరణము చాల సమంజసము.

ఈ సమస్త సృష్టిని కల్పితమతఈశ్వరుడు సృష్టించియుండలేదు. ఈ సృష్టియందలి ప్రతిపదార్థము తన బీజమువల్లనే ఉత్పన్నమగుచున్నది. గోధుమనుండి గోధుమయే పుట్టగలదు; తనకంటె వేరగు శనగ మరియు మిరియముత్తో గోధుమ పుట్టజాలదు. గోధుమబీజముకూడ తనమొక్కనుండియే ఉత్పన్నమగాగలదు. ఇదేవిధముగ సమస్తమునకు కారణము తనకుతానే అయియున్నది; రెండవది కాజాలదు మరియు ఈసృష్టి, ఈసృష్టిక్రమము ప్రవాహరూపమున అనాది అగుచున్నది.

సూర్యచంద్రులు నశించిపోయిననుకూడ వారి పరమాణువులు బీజరూపమున ఈ విశ్వమందుండియేయుండును. కొన్ని

సూర్యచంద్రమండలములు మరియు బ్రహ్మాండములు నశించి పోయినప్పటికి ఈ విశ్వమంచు అనంతసూర్యచంద్రులు, బ్రహ్మాండములు ఉండియేయుండును; కొందరు మానవులు నశించినను, కొన్ని వృక్షములు మారిపోయిననుకూడ ఈ ప్రపంచమందు అనేక అసంఖ్య మానవులు మరియు వృక్షములు ఉండియేయుండగలవు!

మావిడినుండి మావిడి, గోధుమనుండి గోధుమ మరియు చింతనుండి చింత పుట్టుచున్నట్లే చంద్రసూర్యులు, చంద్రసూర్య బీజములనుండియే సృజింపబడుచున్నారు. ఈశ్వరునిమూలమున కాదు! ఇదియే ఋషిమతము; వేదములయందుకూడ ఇదియే సత్యమని రుజువగుచున్నది; సత్యవిషయగ్రహణమువలన మరియు వానినంగీకరించుటవలన మానవజాతికి కల్యాణము సిద్ధింపగలదు. ఈ దిగువనుదహరింపబడిన వేదమంత్రముల పరికింపుడు. ఉపర్యుక్త విషయములనే వేదములుకూడ అంగీకరించుచున్నవి.

మం॥ కుత ఇంద్రః కుతః సోమః కుతో అగ్నిరజాయత।
కుత స్త్వష్ట్యా సమభవత్ కుతో ధాతా జాయత॥

(అథ-కాం-11-సూ-8-మం-8)

సూర్యుడెవనివలన జన్మించెను? అనగా- ఇతని పూర్వరూపమెద్ది? అని భావము. చంద్రుడెవనిమూలమున పుట్టెను? అగ్ని ఎవనివలనపుట్టెను? విద్యుత్ లేక వాయువు దేనివలన జన్మించినది? ఈ భూమి దేనివలన పుట్టినది? అని ఈ మంత్రము

ప్రశ్నపూర్వకముగ చెప్పబడినది. దీనికి సమాధానము ఈదిగువ మంత్రమందు వివరింపబడినది. గమనింపుడు-

మం॥ ఇన్ద్రాగ్నీ దివ్యాని సోమాత్ సోమో అగ్నేరగ్నీ రజాయత।
త్వష్టాహ జజ్ఞే త్వష్టుర్వాతుర్వాతా జాయత॥
(అధ-కాం-11-సూ-8-మం-9)

సూర్యునిమూలమున సూర్యుడు, చంద్రునిమూలమున చంద్రుడు మరియు అగ్నివలన అగ్నియు ఉత్పన్నమాయెను. వాయువువలన వాయువు, భూమివలన భూమికూడ పుట్టి యుండెను.

ఈ మంత్రమువలన- సూర్యచంద్రులను, అగ్నివాయు పృథివ్యాది పంచభూతములను మతఈశ్వరుడు సృజింపలేడని స్పష్టమగుచున్నది. "తనకుతానే"- గోధుమనుండి గోధుమవలె ధాన్యమునుండి ధాన్యమువలె ఉత్పన్నమైయుండెను; ఇపుడు కూడ ఉత్పన్నమగుచున్నవి. "తనకుతాను" అనునేమియో తెలిసికొనవలసియున్నది; ఇదియే సమస్తమునకు సృష్టికర్త, లయకర్తకూడనైయున్నది. దీనిపేరే "ఆత్మ". ఇదియే తన్నుద్ధరింపగలదు లేదా అధోగతిపాలు చేయగలదు. మతఈశ్వరుడేమియు చేయజాలడు. శ్లో॥ "ఉద్ధరే దాత్మ నాత్మానమ్"
(గీతా అ-6-శ్లో-5)

తన ఆత్మద్వారానే తన్ను ఉద్ధరింపచేసికొనవలసియున్నది. అనగా- తన పురుషార్థముతోనే తన్నుద్ధరించుకొనవలయును.

పరుల విశ్వసించువారు దాసులగుదురు, దరిద్రులగుదురు, కర్తవ్య విహీనులగుదురు. పరుల భరోసాను విడిచి తన శుభకర్మ శుభ భావనలయందు, సాధనములయందు విశ్వాసముంచుకొనవల యును నిన్ననీవు తెలిసికొనుము; ఆత్మశక్తియొక్క ప్రభావ మును గుర్తింపుము.

మం॥ తస్మాద్వై విద్వాꣳ పురుష మిదం బ్రహ్మేతి మన్యంతే।
సర్వాహ్యస్మిన్ దేవతా గావో గోష్ఠ ఇవాసతే॥
(అధ-కాం-11-సూ-8-మం-32)

ఇందుచేతనే ఆధ్యాత్మిక తత్త్వవేత్తలు ఈ మానవునే బ్రహ్మమని అంగీకరించుచున్నారు; ఈ మానవ దేహమందు-గోసమూహము గోశాలయందువలె సమస్త దేవగణము, సమస్త దివ్యశక్తులు, పృథివ్యాది తత్వములు విరాజమానమైయున్నవి.

వేదములు, ఆత్మజ్ఞానులుకూడ ఈ పురుషునే బ్రహ్మముగ భావించుచున్నారు. సమస్త దేవగణము ఈ పురుషునియందే నివసించియున్నది. మతఈశ్వరుడు, మతబ్రహ్మ కల్పితులై యున్నారు. వేదములయందు "బ్రహ్మ" ఈశ్వరాదినామములు మానవులకొరకే వాడబడియున్నవని స్పష్టమగుచున్నవి. మాన వుడు మరియు మానవశరీరముమాత్రమే బ్రహ్మగ స్థిరపడినపుడు సమస్త మతమూలసిద్ధాంతములు ఖండింపబడినట్లేయగుచున్నది. ఈ వేదమంత్రములమూలమున వేదరచయిత మతఈశ్వరుడు కాడని ధృవపడుచున్నది. కొందరు- "మనము ఈశ్వరులము

కాము; ఈశ్వరకుమారులము" అని చెప్పుచున్నారు. ఈశ్వరుని కుమారుడు ఈశ్వరుడుకాక ఇతరుడెట్లగును? గుఱ్ఱపు సంతానము గుఱ్ఱమెనట్లు, సింహపుబిడ్డ సింహమైనట్లు, ఈశ్వరునికుమారుడు ఈశ్వరుడే కాగలడు. కావున ఏవిధముగ చూచినను ఈ పురుషుడే ఈశ్వరుడగుచున్నాడు.

అట్టి పురుషస్వరూపము వేదములయందు చక్కగ వర్ణింపబడినది. ఈ దిగువ మంత్రములను గమనింపుడు.

మం॥ యత్ పురుషం వ్యదధుః కతిధావ్యకల్పయన్।
ముఖం కిమస్య కిం బాహూ కిమూరూపాదా ఉచ్యతే॥
(అథ-కాం-19-సూ-6-మం-5)

విద్వాంసులీ మానవుని విశేషయుక్తముగ వర్ణించుచు, ఈవిధముగ ప్రతిపాదించుచున్నారు. ఇతనిని ఎన్నోవిధముల కల్పించుకొనుచున్నారు. ఇతని కేవిధమగుముఖమున్నది? బాహువులు, ఊరువులు ఏవిధముగనున్నవి? పాదములెట్లున్నవి? అని ప్రశ్నించుకొని సమాధానమిూక్రింది మంత్రమునఇచ్చుచున్నారు.

మం॥ బ్రాహ్మణోఽస్య ముఖమాసీత్ బాహూ రాజన్యోఽభవత్
మధ్యం తదస్య యద్వైశ్యః పద్భ్యాం శూద్రోఅజాయతీ॥
(అథ-కాం-19-సూ-6-మం-6)

ఈ పురుషునియొక్క- ముఖము అనగా- ముఖ్యభాగము లేక సర్వోన్నతభాగము, బ్రహ్మజ్ఞానియగు, సత్యవక్త మరియు సర్వోపదేష్టయగు బ్రాహ్మణుడైయున్నది. అనగ బ్రహ్మమే

సత్యము; సత్యమే బ్రహ్మము. అట్టి బ్రహ్మజ్ఞాని బ్రాహ్మణుడగు చున్నాడు; అట్టి బ్రాహ్మణుడే ఈ పురుషునకు ముఖ్యభాగము.

పురుషుని ముఖాంగమందే జ్ఞానేంద్రియములున్నవి. మరియు మస్తిష్కముకూడ ఇందేకలదు ఇందువలన మానవునియొక్క ఈ అవయవము బ్రాహ్మణమైయున్నది. ఇతని బాహువులు రక్షకులుగ, శాసకులుగ మరియు దుష్టశిక్షకులుగ ఉపయోగ పడుచున్నవి. మానవుడు తన్ను తాను రక్షించుకొనవలసివచ్చి నపుడు తన బాహువులనుపయోగించుకొనును. కనుకనే బాహు వులకు క్షాత్రధర్మమునకు సంబంధించిన ఉదాహరణ మీయబడి నది. ఈ కారణముననే ఈ మంత్రమందు- "బాహూ రాజ న్యోఽభవత్" అని ప్రయోగింపబడెను; ఇతని మధ్యభాగము వైశ్యతుల్యమైయున్నది; అనగా- కోశాధ్యక్షకార్యక్రమాను కూలమగు ప్రదేశమైయున్నది. కాళ్లు రెండు శూద్రతుల్యమగు కార్యముల చేయుచుండుటవలన "శూద్రో అజాయత" అని ప్రయోగింపబడెను. కాళ్ళనుండి శూద్రులుపుట్టిరి అను అర్థము సరిగాదు. బ్రహ్మక్షత్రియవైశ్యులవలనే శూద్రులుకూడ యోని సంభవులే! "ముఖమునుండి బ్రాహ్మణులు పుట్టిరి" అనుఅర్థము ఈమంత్రమందు గోచరింపదు. అందిట్లున్నది-"బ్రాహ్మణోఽస్య ముఖమాసీత్" దీని అర్థము- ఈ పురుషునకు బ్రాహ్మణుడు లేక బ్రహ్మజ్ఞానము ముఖమయ్యెను అని సమన్వయించుకొన వలయును. బాహువులు రక్షకచిహ్నములైయున్నందున వానికి

"రాజన్యోఽభవత్" అని ఉదాహరణమీయబడినది. మధ్య భాగమందు- హృదయము మరియు శ్వాసకోశాదులు అతి పీలువైన, సున్నితమైన అవయవములు అస్థిపంజరమందు భద్ర ముగ అమర్చబడియున్నవి. ధనకనక రత్నాభరణాది కోశము లను వైశ్యులు జాగ్రత్తగ నిరీక్షించుట సహజము. కావున అట్టి శరీర మధ్యభాగము వైశ్యులకు అధికారప్రదేశమైయున్నది. కనుక "మధ్యం తదస్య యద్ వైశ్యః" అనగ- ఈ పురుషుని యొక్క మధ్యభాగము వైశ్యసమానమై యున్నదని భావము. ఉపర్యవయవములన్నిటిని మోయుచుండుటవలన పాదములకు శూద్రులని చెప్పబడినది. ఈ మంత్రమందు జాతిభేదవర్ణనము లేదు. పురుషునికి ముఖ్యభాగము ముఖమైయున్నది. ఇందు జ్ఞానేంద్రియములు, మస్తిష్కముకూడగలదు. జ్ఞానోపార్జన చేయువాడుమాత్రమే బ్రాహ్మణుడైయున్నాడు. కావున పురు షుని ముఖమునకు బ్రాహ్మణశబ్దప్రయోగము చేయబడినది. కావున ఈ పురుషుడే (మానవుడై) ఈశ్వరుడైయున్నాడు.

మతవాదులు ఒక కల్పితఈశ్వరుని భావించుచున్నారు; అట్టి విరాడ్ పురుషుని ముఖమునుండి బ్రహ్మణులు, బాహు వులనుండి క్షత్రియులు, మధ్యభాగమునుండి వైశ్యులు మరియు పాదములనుండి శూద్రులు జన్మించియున్నారని చెప్పుచున్నారు. పై నుదహరింపబడిన అథర్వవేదమంత్రమందు మతవాదోక్త మగు ఉపర్యుక్తార్థమేమియు గోచరించుట లేదు. మానవులు

అయోనిసంభవులుకారు; అట్లు జన్మించుట అసంభవము! పాద హస్తఊరువులనుండి జన్మించియుండిరనిచెప్పుఅర్థము, మత మాధ్యజనితభావోపేతమైయున్నది.

ఎవరైన ఒక విషయమునుగురించి మాట్లాడుచున్నపుడు "మీరు చెప్పినదంతయు ఏదైన ఒక గ్రంథస్థవిషయమా? లేక మీరు ఊరకనే ఒకవాదము చేయుచున్నారా?" అని ఈ కాలమున చాలమంది మతవాదులు ప్రశ్నించుచున్నారు. ఈ విషయము మా గ్రంథమందులేదు. కావున దీనిని మేమంగీకరింపము" అని కొందరు చెప్పుచున్నారు. అనగ వారు పుస్తకజ్ఞానమునంగీకరించుచున్నారు; అనుభవజన్యజ్ఞానము నంగీకరించుట లేదని తెలియుచున్నది. పుస్తకములు, గ్రంథములు, వ్యాసములు చదువుచు, వినుచు ప్రజలు విసిగిపోవుచున్నారు. పుస్తకములు, గ్రంథములు, జడములు; మానవుడు చేతనపదార్థము, గ్రంథములు మానవనిర్మితములు; మానవుడు గ్రంథములచే నిర్మింపబడియుండలేదు. వ్యాస గౌతమ వసిష్టాదులు, క్రీస్తు మహమ్మదు బుద్ధాదులు మానవులేకదా? పుస్తకములుకారు! వీరే పుస్తకముల రచించియున్నారు. ఇపుడాలోచింపుడు– పుస్తకము గొప్పదియా? లేక మానవుడు గొప్పవాడా?

పుస్తకములయందే వస్తువు గౌరవింపతగినది? వాని కాగితమా? వాని అక్షరములా? పుస్తకములందు కాగితములు, అక్షరములుమాత్రమే ఉండవు. వానియందు లిపిబద్ధమగు జ్ఞానము కూడ ఉండియున్నది.

పుస్తకములయందీజ్ఞానమే గౌరవింపతగినది; దీనినిగ్రహించియే మానవుడు జ్ఞానియగుచున్నాడు. పుస్తకములతో నింపబడియున్న బీరువా ఇంతవరకు జ్ఞానికాలేదు; నిత్యము పుస్తకముల చూచుచుండు దీపము, ఇంటికప్పు జ్ఞానులు కాలేదు. పుస్తకములమోయు గుఱ్ఱముగాని, వాహనముగానిజ్ఞానికాలేదు. పుస్తకములు మానవరచితములు, అందలి లిపిబద్ధమగు అక్షరములుకూడ మానవమేధాకల్పితములే!

అయితే- సమస్తగ్రంథములయందు కేవలము జ్ఞానమే మాత్రమేఉండునా? అజ్ఞానముండదా? అన్నిపుస్తకములయందు జ్ఞానముకలదని మనమంగీకరింపగలమా? మీరు ఆత్మసామాజికుడైనప్రుడు- కురాన్, బైబిలు మరియు ధమ్మపద అదిగాగల గ్రంథములందు జ్ఞానమున్నట్లంగీకరింపక అజ్ఞానమువో నిండియున్నట్లు భావించెదరు. "సత్యార్థప్రకాశము" మాత్రమే జ్ఞానగ్రంథమని అంగీకరింపగలరు. అట్లే ప్రతిమతస్థుడు తన మతగ్రంథమే జ్ఞానగ్రంథమనియు, ఇతరములజ్ఞానగ్రంథములనియు భావించుచుండును. ఇట్టి పరిస్థితిలో ఏగ్రంథము జ్ఞానయుక్తమో ఏది అజ్ఞానయుక్తమో ఎవరు నిర్ణయింపగలరు? నేడు మతప్రసక్తి లేని మానవుడు లేడనియే చెప్పవచ్చును.

కావున ఇట్టి న్యాయనిర్ణయము మన ఆత్మ లేదా దీని ప్రతినిధియగు నిష్పక్షపాతబుద్ధిమాత్రమే చేయగలదు. పుస్తకముల పరీక్షించువాడు మానవుడు; మానవుని పుస్తకములు పరీక్షింపజాలవు!

పుస్తకరచయిత మానవుడై నందున గ్రంథస్థవిషయముల యొక్క మంచిచెడ్డలనుకూడ మానవుడే నిర్ణయింపగలడు పుస్తకము జడము, మానవుడు చేతనము, సమస్త గ్రంథములు మానవస్వాధీనములే! మానవుడుమాత్రముకాడు. చాలమంది మానవులు తమతమ అనుభవములతోనే మరణించుచున్నారు; వానిని ఎవరికి తెలియచేయుటకూడలేదు; కొందరుమాత్రమే తమ అనుభవములకు పుస్తకరూపమిచ్చుచున్నారు.

ఒక సనాతన హిందువు వేదములను, పురాణములను తన మతగ్రంథములుగ అంగీకరించుచున్నాడు; అట్లుగాకన్యాయముగ తన మతమును, ఇతర మతములనుకూడ సరకుచేయక పక్షపాతరహితముగ తనఅనుభవమును ప్రకటింపవలసియున్నది.

సాధారణముగ రచయితలు తక్కువ! అందుకూడ స్వీయానుభవోపేత స్వతంత్ర రచయితలు చాలతక్కువ! సాధారణముగ రచయిత పూర్వరచనలనుండి విషయముల సంగ్రహించి నూతన గ్రంథమును రచించుచున్నాడు. ఇందుమూలమున అసంఖ్యాక మానవుల అనుభవజన్యజ్ఞానము వారితోనే నశించిపోవుచున్నది. ఇట్లెందులకు జరుగుచున్నది? ఈ అనుభవజన్యజ్ఞానము ప్రాచీనగ్రంథస్థవిషయములకు విరుద్ధమైయుండును.

ఒకవేళ ఈ అనుభవజన్యజ్ఞానమును పట్టుదలతో ప్రచురపర్చినయెడల అట్టి వక్తకు అసంఖ్యాకులు విరోధులు కాగలరు. ఈకారణమున ప్రజలు తమ అనుభవములను ప్రకటించు

టకు భయపడుచుందురు. ఇందువలన నిజమగు జ్ఞానము బహిర్గత మగుట లేదు.

అట్టి అనుభవజన్యజ్ఞానమును నిర్భయముగ ప్రకటించి నందులకే క్రీస్తును సిలువవేసిరి, శంకరదయానందాదులను విష ప్రయోగముతో చంపిరి; గాంధీమహాత్ముని హత్యచేసిరి. ఇట్టి ఉదాహరణములెన్నియో కలవు.

ప్రతి ప్రవక్తయు ప్రాచీన సిద్ధాంతవిరుద్ధముగ నూతనానుభవములను ప్రచురపర్చియుండెను. అప్పటిసంఘమతనిని అనేక విధముల బాధించినది. అట్టి ప్రవక్త మరణానంతరమే అతని సిద్ధాంతములు ప్రాచుర్యమును పొందినవి. కాలమానపరిస్థితుల ననుసరించి మానవస్వభావానుసారముగ ప్రతిమతసిద్ధాంతములు మార్పును పొందుచునేయున్నవి; పొందవలయునుకూడ!

నేటి సమయమును శాస్త్రయుగము లేదా విజ్ఞానయుగ మని చెప్పవచ్చును. నేటి సంఘము నిష్పక్షపాత సత్యసిద్ధాంతాన్వేషణమందు అభిరుచిని పెంచుకొనగోరుచున్నది. తదనుసారముగనే ఈ రచనావ్యాసంగముచేయ ప్రయత్నించితిని.

ఈ గ్రంథమందు- మరణమనగేమి? మరణానంతరమేమి జరుగును? సూక్ష్మశరీర సూక్ష్మలోకములయొక్క, స్వర్గనరకములయొక్క రహస్యమేమి? ఈశ్వరస్వరూపమెట్టిది? అతనిఉనికి ఎక్కడ? మతవాదప్రోక్తమగు ఈశ్వరనిర్వచనము యదార్థమా ఇత్యాది ప్రశ్నలకు సహాయక గ్రంథప్రమాణములతో అనుభవ

జన్యజ్ఞానాధారముగ సమాధానమిచ్చియుంటిని. ఈ ప్రయత్న మందు నేనెంతవరకు కృతకృత్యుడనైతిని అను విషయనిర్ణయాధికారము నిష్పక్షపాతయుతులగు రసజ్ఞులైన పాఠకులదే!

ఈ పుస్తకముద్రణకార్యక్రమ నిర్వహణమందు మరియు పరిశోధనకార్యకలాపమునందు శ్రమకోర్చి నాకు సహకరించిన మిత్రులు శ్రీ డాక్టర్ N. V. S. రామారావుగారికి నాహృదయ పూర్వక కృతజ్ఞతలు. నా ఈ ప్రయత్నమునకు హార్దికమగు ప్రోత్సాహమందించిన మిత్రులు తెలుగు సాహితీసమూఖ్య అధ్యక్షులు శ్రీ చామర్తి సుందరకామేశ్వరరావు, బి. ఏ. బి. యల్; గారికి, స్నేహపాత్రులు శ్రీ యస్. వి. నరసింహరాజు, బి ఎస్.సి. గారికి మరియు విమర్శకాగ్రేసర శ్రీ గూడవల్లి నరసింహారావు గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

ఈ పుస్తకవిషయమున తమ అమూల్యాభిప్రాయములనిచ్చి నన్ను ప్రోత్సహించిన సహృదయులగు మిత్రులుకూడ ప్రశంసార్హులు.

సకాలమున సుందరముగ పుస్తకముద్రణమును నిర్వహించి ఇచ్చిన శ్రీ వైష్ణవ ప్రెస్ వారికిన్ని నా అభినందనలు.

—0—

అలంపురం
27-6-82

ఇట్లు,
గోరింట వెంకట శివరామరాజు.

ఓం

పరలోకవిచారము

(సూక్ష్మదేహము, సూక్ష్మలోకము, స్వర్గము, నరకము, ఈశ్వరుడు)

శ్లో॥ "జాతస్యధ్రువో మృత్యుః ధ్రువం జన్మమృతస్యచ"
జన్మించినవానికి మరణము తప్పదు; మృతిచెందినవానికి పునర్జన్మ తప్పదని భావము. ఇదియొక గీతాప్రవచనము. జననమరణములు ప్రాణికోటికి సహజప్రక్రియలు, చేతనసృష్టియందు మానవసృష్టి ఉత్కృష్టమైనది. జ్ఞానవిజ్ఞానయుతమైన వికసిత మస్తిష్కము మానవునకుమాత్రమే గలదు. గనుక జ్ఞానియగు మానవుడు మరణమునుగురించి, సూక్ష్మశరీర సూక్ష్మలోకముల గురించి యదార్థస్థితిని తెలిసికొనుటకొరకు ఉత్సహించుచు ప్రయత్నించుట సహజము.

మరణానంతరము జీవునియొక్క పరిస్థితిని, సూక్ష్మశరీర సూక్ష్మలోకములయొక్క పరిస్థితిని గ్రహించి తిరిగివచ్చి అక్కడి రహస్యములను వివరించిచెప్పినప్రాణి ఒక్కడునులేడు! ఇందును గురించి ఎవరిబుద్ధికితోచినట్లువారు చెప్పుచున్నారు. తమ తర్క బుద్ధిని. హేతువాదబుద్ధిని ఉపయోగించి ప్రజలకు నచ్చజెప్ప ప్రయత్నించుచున్నారు. మన భారతావనియందు మతములనేకములు. సూక్ష్మశరీర సూక్ష్మలోకములగురించి, మరణానంతర పరిస్థితినిగురించి ఒకొక్కమతము ఒకొక్కవిధముగ పరస్పర

విరుద్ధ విషయములతో ప్రజలకు నచ్చజెప్ప ప్రయత్నించుచున్నది. ప్రతి మతవాది తన మతోదితవిషయమునే సత్యమని. యదార్థమని విశ్వసించుచున్నాడు. పరమతవాదము అసత్యమని, అసంగతమని అవమానించుచున్నాడు; అంతియేకాదు, అబద్ధమని అంగీకరించుచున్నాడు. మతవాదులందరు తమతమ మత గ్రంథములు, తమతమ దేవుళ్ళచేతనే లిఖింపబడినవని ప్రగాఢముగ నమ్ముచున్నారు. మేధావులు, విజ్ఞానవంతులుకూడ ఇందలి సత్యాసత్యములగురించి దైవభీతిచే విమర్శింపజాలకున్నారు. మతమాధ్యమే దీనికి ముఖ్యకారణము! ఒక్క మతఈశ్వరుడు కూడా ప్రత్యక్షమై "ఇది సత్యము, ఇది అసత్యము" అని ప్రజలకు నచ్చజెప్పి మతకల్లోలముల పరిహరించుటగాని, పరలోక రహస్యముల బహిర్గతముచేయుటగాని జరిపియుండలేదు.

మృతాత్మకు పునర్జన్మ యున్నట్లంగీకరించినపుడు, మరణమునకు పునర్జన్మకు మధ్యగల కాలమందు మృతాత్మలు నివసించుటకు ఒక సూక్ష్మలోకముకూడ కలదనియే అంగీకరించవలసియుండును. ప్రాణి స్థూలశరీరముతో స్థూలప్రపంచమందుండుట ఎంత సహజమో, సూక్ష్మశరీరముతో సూక్ష్మలోకమందుండుట కూడ అంత సహజమే!

మరణము లేదా మృత్యువు అనగానేమియో ఇపుడు మనము తెలిసికొనవలసియున్నది. "మ్రియతేఽనేనేతి మరణం" చంపబడును గనుక మరణమను పేరుగలిగినది. మరణమనగ ప్రాణ

వియోగమని అర్థము. ప్రాణము ప్రతిచేతనమందు అంతర్హితమై వ్యాప్తినొందియుండును. చేతనత ప్రాణముయొక్క ముఖ్య లక్షణము.

మరణము అనేకవిధములగు సంగతులతో అనేక సంప్రదాయభేదములతో ప్రచారమందున్నది. వీనినిగురించి నా అభిప్రాయమును వెల్లడింపవలసియున్నది. అనేకములగు నాడుల తోను, నరములతోను, రక్తమాంసాదులతోను తయారైన శరీరము, అంతర్హితమైన ఆత్మలయొక్క సంయోగమునకే "జీవనము" అని పేరు; దానియొక్క వియోగమునకే "మరణము" అనిపేరు. జీవన్మరణములు ఒకవిధమగు సహజప్రక్రియలే! కాని దాని పరిణామమందు ధ్యానముంచబడుచున్నందున దుఃఖమని, సుఖమని చెప్పబడుచున్నది.

పరిణామదృష్టితో చూచినయెడల 'మృత్యువు' అంత దుఃఖప్రదముకానట్లు తోచగలదు. జీవన్మరణములను రాత్రిం బవళ్లుగ పోల్చవచ్చును, పగలు పనిచేయుటకు, రాత్రులు విశ్రమించుటకొరకు అనువగు కాలమని అందరికి తెలియును. మానవుడు పగటియందు పనిచేయుచుండును. ఇందువలన అతని అంతఃకరణములు (మనో బుద్ధ్యాదులు) బాహ్యకరణములు (నాసానేత్రహస్తపాదాదులు) అన్నియు అలసిపోయి పనిచేయుటకు అయోగ్యములైయుండును. రాత్రి వచ్చుటతోనే మానవుడు గాఢనిద్రను పొందును. అపుడంతఃకరణ బాహ్యకరణము

లన్నియు శాంతియుతముగ పురుషార్థరహితములై పోవును. పగటిపూట కార్యనిర్వహణయందు వ్యయమైన శక్తియంతయు పనిలేక విశ్రాంతిగ నుండుటవలన తిరిగి శక్తిగ్రహింపబడి ఏకీకృతమగును. ఈ విధముగ మానవుడు పురుషార్థమయుడై కేంద్రీకృతమైన ఆశక్తినితిరిగి వ్యయపర్చుటకు అర్హుడుకాగలడు. ఈక్రమము అనాదికాలమునుండి వచ్చుచున్నది; అనంతకాలము వఱకు నడచుచునేయుండును!

రాత్రింబవళ్ళు ఏవిధముగ విశ్రాంతికి, పనిపాటలకు అనువుగనుండునో అదేవిధముగ జీవన్మరణరూపములగు దివారాత్రులు కార్యనిర్వహణ విశ్రాంతులకొరకే నియమింపబడియున్నవి. మానవుడు జీవనరూపియగు పగటియందు పనిచేయుచుండును; ఈ కార్యక్రమము బాల్యావస్థనుండి ప్రారంభమై యవ్వనదశలో ప్రవేశించునాటికి సంపూర్ణమగు ఉచ్ఛస్థితికి చేరుకొనగలుగును. వృద్ధావస్థ జీవనరూపియగు పగటికి అంతిమ ఘడియ కాగలదు. మానవుడు పనిచేయుచు అలసిపోయినట్లే వృద్ధావస్థ (జీవనరూప దినసాయంకాలము) వచ్చినతరువాత కూడ పనిచేయుటకు అనర్హుడుగ మారిపోవును; ముసలితనపు అంతిమ అవస్థయందు మానవుడు పనిచేయుటకు అయోగ్యుడై మంచముపై పడియుండవలసిన పరిస్థితి ఏర్పడగలదు; బుర్ర పనిచేయదు, జ్ఞాపకశక్తి ఉండదు, కాళ్లుచేతులు స్వాధీనముతప్పును.

రాత్రి నిద్రలో విశ్రాంతినిపొంది ప్రాతఃకాలమందు మానవుడు నూతనోత్సాహముతో, నూతన సామర్థ్యముతో, నూత

నొత్తేజముతో మేల్కొనుచున్నాడు; అదేవిధముగ మృత్యు రూపియగు రాత్రియందు విశ్రాంతినిపొంది, మానవుడు జీవన రూపియగు దినప్రాతఃకాలమందు అనగా - బాల్యావస్థయందు నూతనోత్సాహముతో, నూతన స్ఫూర్తితో ఉద్భవించుచున్నాడు. మృత్యురూపియగురాత్రి, విశ్రాంతినికలుగజేసి ముసలితనపు అకర్మణ్యతను బాల్యావస్థయొక్క అపూర్వ కర్మణ్యతగ మార్పుచేయగలిగినది. ఈ విధముగ నాలోచించినయెడల మరణము దుఃఖదాయకము కాదనియు, ఒకవిధముగ సుఖదాయకమే అనియు గ్రహింపవలసియున్నదని నాభావము! గీతాకారుడగు శ్రీకృష్ణుడు ఈశరీరములను మనముధరించు వస్త్రసదృశముగ వర్ణించియున్నాడు.

శ్లో॥ వాసాంసిజీర్ణాని యథావిహాయ నవానిగృహ్ణాతి
నరోఽపరాణి ।తథా శరీరాణి విహాయజీర్ణాన్యన్యాని
సంయాతి నవానిదేహీ॥ (గీతా 2-22)

మానవుడెట్లు చినిగిన వస్త్రముల వదలి, క్రొత్తవస్త్రములు ధరించుచున్నాడో అట్లే ఈ ఆత్మ శిథిలములైన దేహములను వదలి క్రొత్త దేహములను గ్రహించుచున్నదిఅని భావము. సాధారణముగ నూతనవస్త్రముల ధరించువారు సంతోషమును పొందుదురు. అయితే ఆత్మ పనికిమాలిన శిథిల శరీరముల విడచి పుష్టిగల నూతన శరీరముల గ్రహించుటయందు మానవుడు దుఃఖింపవలసిన పనియేమున్నది? కావున పై సిద్ధాంతానుసార

ముగ మరణము దుఃఖప్రదముకాదని శ్రేయస్కరమైనదని గ్రహించుట మంచిది. అయితే సాధారణముగ అత్యధికులగు మానవులకు మరణమెందులకు దుఃఖభాజనమగుచున్నదో విమర్శింపవలసియున్నది.

ప్రపంచమందలి ప్రతివస్తువు ఆత్మరూపియగు ఈశ్వరుని చేతనే సృష్టింపబడియున్నది. కాని ప్రతిమానవుడు ప్రతివస్తువు నందు ప్రయోగాధికారమును కలిగియున్నాడు. ఈ అవకాశమును తీసికొని మానవుడు మమకారమునకు వశీభూతుడై వానిని తనవిగ భావింపమొదలిడుచున్నాడు; తదాది అతనికి దుఃఖములు, కష్టములు అనుభవింపవలసివచ్చుచున్నది. మానవార్జితమగు సమస్త వస్తువులతోను మానవుని సంబంధమును మరణము త్రెంచివేయుచున్నది. మృత్యువునకు ఇదియొక క్రియాత్మకరూపము! ఒక గృహస్థునకు భూధాన్యాది సమస్త సంపదలు గలవు. పుత్రపౌత్రాది పరిపూర్ణపరివారముకూడ గలదు. మానవునకు మరణమాసన్నమైనపుడు సమస్త వస్తు సముదాయమును సపరివారముగ ఇక్కడవిడిచియే పరలోకమునకు పోవలసియుండును. ఇదియే ముఖ్యమగు దుఃఖహేతువు! మరణముమాత్రము కాదు.

ప్రాపంచక వస్తువులందు ప్రయోగార్హతమాత్రమే కలదని మానవుడు భావించినయెడల వానియందు మమకారమే కలుగదు. దుఃఖహేతువు తొలగిపోవును. పై నుదహరించిన

సత్ప్రవర్తనాభ్యాసమగు హృదయపరివర్తనభావము మహాత్ముల కు సుసాధ్యమగుచుండును. అట్లని సామాన్య మానవులు ఇట్టి ఉత్తమ ప్రవర్తనాభ్యాసమును త్యజింపరాదు!

ఒక స్కూలుమాష్టరు స్కూలునందు తాను అప్పటి వఱకు ఉపయోగించిన పుస్తకములు, బ్లాకుబోర్డులతోసహా సమస్త పరికరములను స్కూలునందే విడిచి సంతోషపూర్వక ముగ తనఇంటికి వెళ్ళిపోవుచున్నాడు అట్లే మానవుడు సమస్త ప్రాప్తవస్తువులను ఈ జీవనరూపియగు పాఠశాల సమాప్తమైన తరువాత స్వయముగ ఇక్కడనే విడచి, ప్రయోగావధికూడ సమాప్తమైనదని భావించి సంతోషముతో ఇహలోకమునుండి పోవలసియున్నది; ఇట్టి పరిస్థితిలో ఆతనికి దుఃఖమేమియు కలు గదు. మృత్యుసమయ దుఃఖరహస్యమిదియే!

ప్రాణవియోగమే మరణముగద! ప్రాణమనగేమియో విచారింతము-"సూక్ష్మశరీరసమిష్ట్యాపహింత చైతన్యం ప్రాణః" సమిష్టిగ సూక్ష్మశరీరమందు గలుగు చైతన్యమునకు ప్రాణమని భావము. (ఇతి వేదాంతసారః)

మఱియొక ప్రాచీన యోగశాస్త్రగ్రంథమందీ విధముగ ప్రాణమును వర్ణించియుండిరి.

శ్లో॥ ఇంద్రనీల ప్రతీకాశం ప్రాణరూపం ప్రకీర్తితమ్ ।
ఆస్యానాసికయోర్మధ్యే హృన్మధ్యేనాభిమధ్యగే ।
ప్రాణాలయ ఇతిప్రాహుః పాదాంగుష్ఠేపికేచన ॥

(ఇతి యోగారవః)

ప్రాణరూపము ఇంద్రనీలరత్నమువలె ప్రకాశించుచుండు ననియు, అట్టి ప్రాణము మానవునకు ముఖనాసికలయుధ్యను, హృదయమధ్యమందు, నాభిమధ్య ప్రదేశమందు, కొందరి మతానుసారము పాదాంగుష్టములయందును ప్రాణమునకు నిలయమని చెప్పుచున్నారు.

స్థూలశరీరము, సూక్ష్మశరీరము, కారణశరీరము అని శరీరములు మూడువిధములు. పంచభూతాత్మకమైనది స్థూలశరీరము. "జ్ఞానేంద్రియ పంచకం. కర్మేంద్రియ పంచకం, వాయు పంచకం. "బుద్ధిమనసీచేతి సప్తదశావయవాని సూక్ష్మశరీరాణి" జ్ఞానేంద్రియ కర్మేంద్రియ వాయుపంచకములతో మనసు, బుద్ధి కలసి పదిహేడుగలవి సూక్ష్మశరీరములు. (ఇతి వేదాంతసారః) కారణశరీరమునకు, సూక్ష్మశరీరమునకు అంత భేదముండదు. కొందరు వేదాంతులు కారణశరీరమునే అంగీకరించుటలేదు. మానవునికి సుషుప్తియందు పనిచేయడానికి కారణశరీరమని చెప్పుచున్నారు. స్థూలశరీరమునశించుస్వభావముకలది. సూక్ష్మ కారణ శరీరములకు నాశనములేదని చెప్పుచున్నారు!

ఆత్మయొక్క మననశీలభాగమే మనసు. మనోమయ సూక్ష్మశరీరము మరియు ఆత్మ ఒకటియే! ఆత్మ అదృశ్యమై యున్నట్లే సూక్ష్మశరీరముకూడ అదృశ్యమైయుండును. సూక్ష్మ శరీరము ఏస్థూలేంద్రియమునకు ప్రత్యక్షముకాదు. అట్టిసూక్ష్మ శరీరమే మానవుని మరణానంతరముకూడ నుండగలదు. జీవన కాలమందు మానవుడు స్థూల సూక్ష్మశరీరముల రెంటిని కలిగి

యుండును. ఇదిగాక స్వప్నమందు, యోగసాధనలో సమాధ్య వస్థయందుకూడ సూక్ష్మశరీరము పనిచేయుచుండును.

ఏ సచేతనమైనా, ఏ సజీవమైనా, ఏ ఆత్మలయినా ఎన్నడు శరీరరహితముగనుండదు; ఉండబాలదు! ఆత్మ ఏఅవస్థలోనున్నను సశరీరమైయుండును; అశరీరిగనుండదు.

సూక్ష్మశరీరముకూడ ఒక శరీరమే! దానికికూడ ఒక ఆకారప్రకారముండును. సూక్ష్మశరీరము స్థూలప్రపంచమునకు అత్యంత విచిత్రముగను, అద్భుతముగను ఉండగలదు. సూక్ష్మ శరీరము తన స్థూలశరీరపు ఛాయాచిత్రమునే పోలియుండునని, అదేరూపమును, అదేరంగునుకలిగియుండునని కొందరుజ్ఞానులు, యోగులు ప్రమాణయుక్తముగ ధృవపర్చియున్నారు.

ఆత్మ లేదా ప్రాణము స్థూలశరీరమును విడిచినతరువాత లేదా మరణించినతరువాత స్థూలశరీరము కుళ్ళిపోయి, శిధిలమై నశించిపోవును. కాని సూక్ష్మశరీరము మనోమయమైయున్న కారణమున కుళ్ళిపోదు, శిధిలముకాదు, నశించిపోదు; సూక్ష్మ శరీరము అవినాశమైనది, అమరమైనది. "ఈ సూక్ష్మశరీరమును స్థూలబుద్ధితో, స్థూలవాణితో సంపూర్ణముగ వర్ణించుట అసంభవమే కాగలదు." అని అనేకులగు యోగులు, జ్ఞానులు, మేధావులు తమ అభిప్రాయములను వెల్లడించియున్నారు.

మన పురాణసాహిత్యమందు ఊర్ధ్వలోకములు ఏడు కలవని వివరింపబడినది.

శ్లో॥ భూర్భువః స్వర్మహశ్చైవ జనశ్చైతపయే
వచ॥ సత్యలోకశ్చ సప్తైతే లోకాస్తు పరికీర్తితాః
(ఇది అగ్నిపురాణం)

భూలోకమని, భువర్లోకమని, స్వర్లోకమని, మహర్లోకమని, జనో లోకమని, సత్యలోకమని, లోకములు ఏడు అని కీర్తింపబడు చున్నవని భావము.

భూలోక లక్షణములు శాస్త్రమందీవిధముగ వర్ణింపబడి యున్నది. శ్లో॥ భూమేఃస్థైర్యం గురుత్వంచ కాఠిన్యం ప్రసవా ర్ధతా।" "స్థైర్యం, అచాపల్యం,గురుత్వం.పతనప్రయోగీగుణం. కాఠిన్యం, ప్రసవార్ధతా ధాన్యాదుత్పత్తి స్తత్ధతా; అని అందే వ్యాఖ్యానింపబడినది. చలనము లేక స్థిరముగనుండుట, ఆకర్షణ శక్తియు కఠినత్వమును కలిగియుండుట ధాన్యాది మానవోప యుక్త పదార్థోత్పత్తి చేయుశక్తి కలిగియుండుట భూమికిగల ఉత్తమలక్షణములు; దీనికీలక్షణములు కలిగియున్నందువల్లనే ఇందు ప్రాణికోటికి సుఖజీవనావకాశము లభ్యమగుచున్నది. సప్తలోక వివరణము ఈదిగువనుదహరించబడుచున్నది.

శ్లో॥ పాదగమ్యంహి యత్కించిద్వస్త్వస్తిధరణీతలే।
తదూభూలోక ఇతి ఖ్యాతంశాకద్వీపాదికాననమ్ ॥
భూర్లోకాశ్చ భువర్లోకః సూర్యావధిరుదీరితః
ఆదిత్యాదాధ్రువంరాజన్ స్వర్లోకధ్యతే బుధైః॥

మహర్లోకః స్త్రితేరూర్ధ్వమేకకోటి ప్రమాణతః ॥
కోటిద్వయే వర్తమానో జనోభూర్లోకతోన్నప ॥
ఉపరిష్టాత్ స్త్రితేరష్టాకోటయః సత్యమీరితం।
సత్యాదుపరి వైకుంఠో యోజనానాం ప్రమాణతః॥

(ఇది పద్మపురాణే)

పాదముతో నడచుటకు అనుకూలమగు వస్తువై యున్నందువల్లను, గ్వోపారణ్యాదులతో కూడుకొనియున్నందున భూలోక మని చెప్పబడుచున్నది. భూలోకమునకు సూర్యమండలమునకు మధ్యనుండు ఆకాశమండలమే భువర్లోకము. సూర్యమండలము నకు ఊర్ధ్వమందుండు భాగము స్వర్లోకమని చెప్పబడుచున్నది. మహర్లోకము భూలోకమునకు ఊర్ధ్వమున కోటియోజనములు (ఎనిమిదికోట్ల మైళ్లు) దూరమందుండియున్నది; జనోలోకము భూలోకమునకు రెండుకోట్ల యోజనములు (పదహారుకోట్ల మైళ్లు) దూరమందున్నది. భూమినుండి ఎనిమిదికోట్ల యోజన ములు (అరువదినాలుగుకోట్ల మైళ్ళు) దూరమున సత్యలోక మున్నది. దీనికి ఉపరిభాగమున వైకుంఠమండియున్నదని భావ ము. ఈ ప్రమాణము పద్మపురాణాంతర్గతమైనదై యున్నది, ఈ శ్లోకమునందు తపోలోకముయొక్క నరలోకముయొక్క ప్రస్తిరాలేదు.

పైనుదహరింపబడిన పద్మపురాణమందలి ఊర్ధ్వలోక వివరణ శ్లోకమందు తపోలోకముయొక్క ప్రసంగమురాలేదు.

తపోలోకమనగ సూర్యమండలమైయుండవచ్చును. ఇది ఎందుకు విడువబడినదో తెలియుట లేదు. సప్తఊర్ధ్వలోక వివరణమందు నరకలోక ప్రస్తికూడలేదు. నరకలోకపు ఉనికియే లేనందున దాని ప్రస్తావన లేకుండుట సహజమే! నరక స్వర్గలోకములు బ్రహ్మపురాణమందు ఏవిధముగ వివరింపబడియున్నవోచూడుడు శ్లో॥ మనః ప్రీతికరఃస్వర్గోనరక స్తద్విపర్యయః। నరకస్వర్గసంజ్ఞౌవై పాపపుణ్యోద్భవోత్తమా॥ అనగ స్వర్గనరకలోకములు రెండును మరియొక చోట ప్రత్యేకముగ ఉండియున్నట్లుగోచరించుట లేదు. ఇహలోకమందే హృదయాహ్లాదకరము కలుగు అవకాశములు కలిగియుండుట స్వర్గమనియు, తద్విరుద్ధముగ దైహిక మాన సికరోగాది కష్టములతోను, దుఃఖములతోను బాధపడుచుండు టయే నరకమసియు భావింపవలసియున్నది. సుఖానుభూతికి ప్రతివ్యక్తియు సిద్ధముగనేయుండును; కాని దుఃఖానుభూతికి మానవుడంగీకరింపడు. అయినప్పటికి వివశుడై అనుభవించు చున్నాడు. ప్రభువు చట్టరీత్యా దోషులను శిక్షించుచున్నట్లు, పాపాత్ముని ఈశ్వరుడు శిక్షించుచున్నాడని మతవాదులవాదము. మానవులను స్థూలసూక్ష్మలోకములయందు పరిపాలించుచు పాపపుణ్యఫలములను అనుభవింపజేయుటకు మతవాదులు ఒక ఈశ్వరుని కల్పించుకొని దీనిని అతని చర్యగ భావించుచున్నారు.

పాపఫలముల ననుభవింపజేయుటకు నిజముగ ఒక ఈశ్వ రుడు ఉండియున్నాడా? అను ప్రశ్న ఉదయించినప్రుడు ఉన్నా

డనియే అంగీకరింపవచ్చును. మతవాదులు భావించు కల్పిత ఈశ్వరుడుమాత్రముకాడు! సాకారుడైగాని, నిరాకారుడైగాని ఒక నిర్దిష్టానిర్దిష్ట ప్రదేశమందు మతవాదప్రోక్తుడగు ఈశ్వరుడుండుట అసంభవము. ఆత్మరూపియగు ఈశ్వరుడున్నాడని సమన్వయించుకొనినయెడల సరిపోవును. ఆత్మరూపియగు ఈశ్వరుడెట్లు పాపులచేత పాపఫలములననుభవింపజేయగలడు? అను సమస్యను చర్చింపవలసియున్నది. "మానవుడు ఏ పనిని ఎంత రహస్యముగ చేసినను భగవంతుడు చూచుచునేయుండును." అను నానుడి యొకటిగలదు. ఇది యదార్థమే! ఆత్మయే భగవంతుడై యున్నపుడు మానవుడుచేయు ప్రతిపనిని భగవంతుడు చూడగలుగుచునేయుండును. అట్లే ఇహలోకమందు మానవుడు చేయు ప్రతి పాపపుణ్యకార్యము ఆత్మరూపియగు భగవంతునకు ఆవగతమగుచునేయుండును. కార్యాకార్యరూపమగు జ్ఞానము మానసిక ఫలకముపై అంకితమైయుండి సంస్కారరూపమున స్థిరపడియుండును. మరణసమయమందు, మరణానంతరమందు ఈ సంస్కారము సంకల్పరూపమునుధరించి, దానికి అనువగు పునర్జన్మనుపొంది, మానవుడు పాపపుణ్యములను తప్పక అనుభవించుటకు బాధ్యుడైయుండును. పాపాత్ముడెంత ధీరుడైనను ఈ సంస్కారజన్య సంకల్పమునుండి తప్పించుకొనజాలడు. మహాత్ములయొక్క మరణసమయమున మరణానంతరకాలమున సద్గతిని పొందుటకుకూడ ఈ సిద్ధాంతమే ముఖ్యహేతువగుచున్నది. "గతజన్మార్జిత పాపపుణ్య ఫలితముల ననుభవించుట అవశ్యంభావ్యము" అను వేదవాక్యపు రహస్యమిదియే!

శ్లో॥ "మనఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః॥" మానవులబంధమోక్షములకు అనగ నరకస్వర్గములకు మనసే కారణము. చేతనముయొక్క చేతనతయందు సదా సంకల్ప వికల్పరూపమున మననము జరుగుచుండును. దీనిపేరే మనస్సు. గంభీరమై ప్రశాంతముగనుండు సముద్రోపరిభాగము సదా చలించుచుండును. వీసినితరంగములందురు. అట్లే ఆత్మయొక్క మననశీలోపరిభాగమే మనస్సు! కాన ఆత్మకు, మనసునకు భేద మేమియులేదు. ఇందువల్లనే స్వర్గనరకములకు, బంధమోక్షము లకు, మనస్సు లేదా ఆత్మ మాత్రమే కారణమైయున్నది. నిశ్చ యాత్మక మానసికదశకే బుద్ధియనిపేరు. ఈ బుద్ధి పూర్వజన్మ కర్మానుసారముగనే ఇహలోకమందు పనిచేయుచుండును. దాని ననుసరించియే కర్మఫలము లభ్యమగుచుండును. "బుద్ధికర్మానుసారిణీ॥" అను శాస్త్రప్రమాణముకూడ ఉరర్యుక్తసిద్ధాంతమును బలపరచుచున్నది.

మరణానంతరము ఆత్మకు స్థూలశరీరముతోగల సంబంధము సడలిపోయి, సూక్ష్మశరీరముతోనే సంబంధముకలిగియుండును. సూక్ష్మశరీరము నెవరును బంధింపజాలరు, కష్టపెట్టజాలరు, నష్టపుచ్చజాలరు, ఏవిధముగు నరకమందు ప్రవేశింపజేసి దుఃఖ పెట్టజాలరు! నరకలోకమే లేనివ్రుడు అది ఎట్లుసాధ్యపడును? సూక్ష్మశరీరమొకవేళ బంధింపబడునెడల సంకల్పముతోనే బంధింపబడగలదు. తన సంకల్పముతోనే కొట్టబడగలదు. తన సంకల్పముతోనే బంధింపబడగలదు; తన సంకల్పముతోనే యమధర్మరాజును చూడగలదు. ఎందువలన? ఈ సూక్ష్మదేహ సూక్ష్మలోకములు కేవలము మనోమయములైయున్నవి.

సూక్ష్మలోక సూక్ష్మదేహములను ఆత్మజ్ఞానులు, యోగులు మరియు మేధావులు అంగీకరించుచునేయున్నారు; వేదములు, ఉపనిషత్తులుకూడ వీని నంగీకరించుచున్నవి. సూక్ష్మదేహ సూక్ష్మలోకములుండియున్నపుడు పునర్జన్మనుకూడ అంగీకరింప వలసియేయుండును. కొందరునాగరికులు పునర్జన్మనంగీకరించుట లేదు. ఇది సత్యము, యుక్తియుక్తముకాజాలదు. సూక్ష్మలోక సూక్ష్మదేహములకు, పునర్జన్మకు అవినాభావసంబంధముండి యున్నది. పునర్జన్మ ఉన్నపుడు మృతాత్మలు నివసించుటకొక లోకము, ఒక దేహము ఉండియుండవలయును. మరణానంతరము మృతాత్మలు పునర్జన్మపర్యంతము సూక్ష్మదేహముతో సూక్ష్మ లోకమున వ్యక్తిగతముగ వీహరించుచుండును.

సూక్ష్మలోకమందరికి వ్యక్తిగతమై ప్రత్యేకముగనుం డును. ఒక వ్యక్తియొక్క సూక్ష్మలోకముతో మరియొకవ్యక్తి యొక్క సూక్ష్మలోకమునకు సంబంధముండియుండదు. అందరి యొక్క సూక్ష్మప్రపంచము వారివారి కల్పనలతోను, భావనల తోను తయారగుచుండును. ప్రతివ్యక్తి తన సూక్ష్మలోకమునకు తానే స్రష్టయగుచున్నాడు. స్వప్నములుకూడ వేర్వేరుగానే కలుగుచుండును. ఇదేవిధముగ అందరియొక్క సూక్ష్మలోక ములు, వారివారి కల్పనానుసారముగ వేర్వేరుగ నుండగలవు. స్వప్నప్రపంచము నిదురించిన తరువాత, సూక్ష్మప్రపంచము మరణించిన తరువాత మానవునకు కలుగుచుండును. ఇవి రెం

డున్న మానవుని వ్యక్తిగత కల్పనయొక్క ఫలితమే! ఒకని స్వప్నమును మరియొకరు చూడజాలడు; అట్లే ఒకని స్వప్న మందు మరియొకరు ప్రవేశింపజాలడు. ఇట్లే మానవునకు మరణానంతరము, ప్రతి మృతాత్మకు తన కల్పనానుసారముగ సూక్ష్మలోకము లభ్యమగుచుండును. ఇట్లు కాకపోయినయెడల స్వర్గముకూడ ఎవరికి సుఖదాయకముగనుండదు. ఇహలోకమందు సత్కర్మలాచరించిన మృతాత్మలు, సూక్ష్మలోకమందు మంచి సంస్కారముకలిగి స్థిరమగు సంకల్పములతో కోరిన వస్తువులను పొంది సుఖములననుభవించుచుందురు; ఇదియే స్వర్గము. పాప కర్మలగు మృతాత్మలకు ఇహలోక పాపకర్మఫలానుసారముగ అస్థిర సంకల్పమూలమున కోరిన వస్తువులు లభ్యముకాకయుం డును; ఇదియే వారికి నరకము.

మరణానంతరము లభించు సూక్ష్మలోకమునకు మరియొక పేరు "స్వర్గము". సిగరెట్టు త్రాగనివానికి దానిపొగ నరక తుల్యముగనుండును; సిగరెట్టుత్రాగువానికి అది దొరకనియెడల కూడ అతనికది నరకతుల్యమే! ఇదేవిధముగ అక్కడ తన కోరిన వస్తువు దొరకనిచో నరకతుల్యముగను, దొరికినయెడల స్వర్గతుల్యముగను తోచుట సహజము. కోరికలులేని ముక్తా త్మలు సూక్ష్మలోకమందు స్వర్గసుఖములననుభవింతురు; ఇదే విధముగ అక్కడ తన కోరిన వస్తువు దొరకనియెడల నరకము గను, దొరికినయెడల స్వర్గమువలె తోచుచుండును. మరణానం తరమున మానవుడు ఏ వస్తువును నిజముగ, హృదయ

పూర్వకముగ కోరుకొనునో సూక్ష్మలోకమందతనికావస్తువు తప్పక లభ్యమగుచుండును. సూక్ష్మలోకము కల్పనామయము, భావనామయము అగుటయే దీనికి కారణము. మృతాత్మలకు ఇట్టి భావము గత జన్మకర్మజన్య సంస్కారానుసారముగ కలుగు చుండును.

స్వప్నమందువలె తన సూక్ష్మలోకమంచుకూడ ఇతరుల సంకల్పము, ఇతరుల ఇచ్ఛ ఉండజాలదు. దీనిని ఇతరులు చూడ జాలరు, ఇందు ప్రవేశింపజాలరు. మానవులలో ప్రతిఒక్కరికి వివిధములగు, విభిన్నములగు కల్పనలు, భావనలు మరియు అభి రుచులు కలిగియుండుట సహజము. ఈకారణమున ప్రతిఒక్క రికి వారివారి కర్మజన్యమగు అభిప్రాయానుసారముగ వారివారి సూక్ష్మలోకము విభిన్నప్రకారముగ కలుగుచుండును.

సూక్ష్మలోకమందు లేదా స్వర్గమందు తనకెపుడు శత్రు వుండడు; తన్నుబాధించువాడు, తనతో పోరువాడు, తన్ను మోసగించువాడు ఎవడూ ఉండడు! ఎందుచేత? - సూక్ష్మలోక మందలి సమస్త వస్తువులు, సమస్త జీవరాశి లేక మృతాత్మలు తమతమ ఆత్మలకు ప్రతిరూపములై యున్నవి; తమ కల్పనా మాత్రములై యున్నవి. ఎవడూ తనకు తాను దుఃఖమును కల్పిం చుకొనజాలడు, మోసగించుకొనలేడు. విశ్వాసఘాతికాజాలడు! రెండవవాడున్నచోటనే తగవు రాగలదు; అక్కడనే నిన్ను బాధించువారుండగలరు. కాని - నీ స్వర్గమందు, నీ సూక్ష్మలోక

మందు రెండవవ్యక్తి ఉండనేఉండడు! అపుడు నిన్ను బాధించున దెవరు? నీవుతప్ప ఇతరులెవరులేని స్వర్గమందు, నీవు సృజించు కున్న నీ కామ్యవస్తువులుతప్ప ఇతరములుండవు. అపుడు నీకు దుఃఖమే కలుగనేరదు.

స్వప్నప్రపంచమునకు, సూక్ష్మప్రపంచమునకు కొంత భేదము లేకపోలేదు. ఇదేవిధముగ స్వప్నశరీరమునకు, సూక్ష్మ శరీరమునకుకూడ కొంతభేదమున్నది. స్వప్నమందలి సూక్ష్మ శరీర సూక్ష్మలోకములు, స్థూలశరీర స్థూలలోకములకు పూర్తిగ వేరై యుండవు ఇందువలన స్వప్నమందలి సూక్ష్మశరీరము, మరణానంతర సూక్ష్మశరీరమొకన్న చాల బలహీనమైనదిగనుం డును. ఇదేవిధముగ స్వప్నమందలి సూక్ష్మశరీరమస్తిష్కము కంటె, మరణానంతర సూక్ష్మశరీరమస్తిష్కము అనేక విధముల జ్ఞానవంతమైయుండును. ఆత్మజ్ఞానులకు మరణానంతరము సూక్ష్మ లోకమందలి సూక్ష్మశరీరములకు లవలేశమైననూ దుఃఖము కలుగబాలదు. అజ్ఞానులు, పాపులు తమ అజ్ఞానజనిత కల్పనల వలన సూక్ష్మలోకమందు యమధర్మరాజు, యమదూతలు, దేవ దూతలు మరియు నరకము - వీని అస్తిత్వమును అంగీకరించి యున్నకారణమున తమ ఊహాప్రపంచమందు వానినే చూచు చుందురు; తమను పరాధీనులుగ భావించి నరకయాతనల ననుభ వింపుచుందురు.

ఆత్మజ్ఞానమును, సద్గురూపదేశమును, స్వాధ్యాయయోగ సాధనలతో నిశ్చితమగు నిజజ్ఞానమును పొందినవారిని యముడు,

యమదూతలు, దేవీదేవతలు బాధింపజాలరు. మతగ్రంథములందు యముడు, యమదూతలు, స్వర్గనరకములగురించి విపరీతముగా వ్రాయబడినవి. ఈ గ్రంథములను ఈశ్వరలిఖితములనికూడ నమ్మించుచున్నారు. మన మస్తిష్కమునుండి - "ఆత్మకన్న వేరగు ఈశ్వరుడు మరియొకడున్నాడు" అను భావన తీసివేసిన యెడల యమ యమదూతాది దేవతలయొక్క ఉనికియే లేకుండ పోవును. నిజమునకు సూక్ష్మలోకమందు తానుతప్ప ఇతరుడెవడు ఉండనేఉండడు! కావున నిజమగు ముక్తిని, నిజమగుస్వతంత్రతను, నిజమగు శాంతిని కోరువానికిదియే మంచి జ్ఞానమార్గము!

"సూక్ష్మలోకపు స్వర్గమందు మృతాత్మలు ఆనందము ననుభవించుచున్నపుడు స్థూలప్రపంచమందలి స్థూలశరీరముల కోసము ఎందులకు రాగోరుచున్నవి?" అను ప్రధానమగు ప్రశ్న ఉదయించుచున్నది. సూక్ష్మలోకమున ఆనందమును పొందుటలో సంశయమేమియులేదు; అక్కడ ఒంటరిగ ఉండుటయే ఒకలోటుగ తోచును; ఎవడైన ఉన్నట్లుతోచిన అది కల్పన మాత్రమే యగుచున్నది. ఇందువలన సాధారణముగ అయోగులు, విషయలంపటులు ఒంటరితనమును సహింపజాలక స్థూల ప్రపంచమందు విహరించుటకొరకు మరల, మరల వచ్చుటకు కోరుచుందురు.

మానవులు చాలకాలమువరకు ఒంటరితనముగ నుండుటకు ఇష్టపడరు. పరోపకారులగు ముక్తజీవులు లేక ఆత్మలు

పరోపకారార్థము ఉత్సహించుచుండును; అవి ఎల్లప్పుడు సూక్ష్మలోకమందేయుండి ఎవరికుపకారము చేయగలవు? ఎవరిని ఉద్ధరింపగలవు? అక్కడ ఇతరులెవరు ఉండరుగదా! ఇదేవిధముగ విషయలంపటులైన దుష్టాత్మలుకూడ – ఎవరిని బంధింపగలవు? ఎవరిని దుఃఖపెట్టగలవు? ఏ విషయభోగముల ననుభవింపగలవు? అక్కడ ఇతరులెవరు ఉండరుగదా!

ఇందువలన ఒంటరితనము ఇద్దరికికూడ దుఃఖదాయకమే యగుచున్నది. విసుగునుకూడ కలిగించుచున్నది. కావున సన్మార్గులు, దుర్మార్గులుకూడ ఇహలోకమునకు రాగోరుచుందురు; ఇద్దరు అవతరించుచుందురు. సూక్ష్మలోకమందు సత్పురుషులకు సత్సంగము, దుష్టులకు దుస్సాంగత్యముకూడ దొరకలేదు. ఇందువలన దేవతలు, రాక్షసులుకూడ తమతమ కార్యక్రమ నిర్వహణార్థము ఇహలోకమునకు రావలసియేయుందురు. ఉప దేశింపగోరిన గద్గురువు, ఉపదేశమును పొందగోరు శిష్యులు కూడ ఇహలోకమునకు రావలసియేయుందును. ఒక్కమాటలో చెప్పవలయుననిన – ఈ స్థూలప్రపంచమే మానవులకు కురు క్షేత్రము, కర్మక్షేత్రము, మర్మక్షేత్రముకూడనైయున్నది. వారు పాండవులు కావచ్చును, కౌరవులు కావచ్చును. ఇద్దరికి ఇదియే యుద్ధరంగము! ఇవ్విధముగ స్వతంత్రబుద్ధితో స్వాధ్యాయము చేసినయెడల సమస్త సంశయములు, భ్రమలు మరియు సందేహములు సమసిపోగలవు.

ఏకాంతమందు సాధనచేయుచు దీని మాహాత్మ్యమును తెలిసికొనిన యోగులయొక్క - విషయవిరక్తిసిపొంది ఆత్మ యందు రమించి ఆనందించు ఆత్మవిదులయొక్క, జీవాత్మలు లక్షలాది సంవత్సరములకుగాని ఇహలోకమునకు వచ్చుటకంగీకరింపవు. ఇవి అవతరించుటయొక్క ముఖ్యోద్దేశము - అజ్ఞానులకు జ్ఞానముపదేశించి వారి నుద్ధరించుటకే యగుచున్నది. ఇట్టి అవతారములు యుగయుగాంతరములు గతించిన తరువాతగాని ఇహలోకమునకురావు. ముక్తాత్మలను ఇక్కడ అజ్ఞానులు బాధించెదరు. నిందించెదరు, బంధించెదరు. హత్యచేయుటకుకూడ సిద్ధపడెదరు. ప్రవక్తయగు "క్రీస్తును" శిలువవేసిరి. "సుకీరుతుకు" మరణదండన విధింపబడెను. "క్రేమరు"ను నిలువున కాల్చివేసిరి. ఆత్మమతస్థాపకుడగు "దయానందు"ని, అద్వైతవాదియగు "శంకరు"ని విషమిచ్చి చంపిరి. వారు మరణించినతరువాత ఈ ప్రపంచము వారిని తలచి, తలచి రోదించినది. వారిపేర క్రొత్త మతములు స్థాపింపబడినవి.

ప్రతి మానవుడు తాను స్వతంత్రముగ నుండవలెనని కోరుకొనుచుండును; ఇతరులపై మాత్రము తన అధికారము శాసనము అమలుజరుగుచుండవలెనని కోరుకొనుచుండును. ఇది మానవునియందుగల యొకమహాదుర్గుణము. ఈ దుర్గుణమే సమస్త కలహములకు, సమస్త విపత్తులకు మరియు సమస్త కష్టములకు మూలహేతువగుచున్నది. ఈ దుర్గుణము కొందరి

యందధికముగను, కొందరియందల్పముగను ఉండియుండును. ఈ దుర్గుణము తక్కువగనున్న మానవులు, స్వతంత్రముగ సుఖులై ఆనందమయమగు ముక్తిని పొందుచుందురు.

సూక్ష్మలోకమందలి పరిస్థితికి, సృష్టికి - స్థూలలోకమందలి సృష్ట్యాది పరిస్థితులకు చాల వ్యత్యాసముండియుండును. మానవుడు సూక్ష్మలోకమందు అత్యధిక సంవత్సరముల పర్యంతము నివసించియుండి, స్థూలప్రపంచమునకు స్థూలదేహముతో దిగివచ్చుచున్నాడు. అక్కడసృష్టి వ్యక్తిగతమైవ్యష్టిగనుండును. ఇహలోకసృష్టి సమిష్టి కల్పనతో కూడియుండును. కావునస్థూల ప్రపంచమున తన మనోనుకూలమగు వ్యక్తిగత శాసనము సరిపడదు; జీవుడసంఖ్యాకములగు సంవత్సరముల పర్యంతము సూక్ష్మలోకమందు స్వేచ్ఛగ, స్వతంత్రముగ శాసనకర్తయై ఉండియున్న కారణమున అక్కడి పాతఅలవాటును ఇహలోకమందు విడువజాలకుండును. ఇందువలన వ్యష్టియొక్క శాసనము సంపూర్ణముగ సమిష్టిపై ప్రసరింపజాలదు. తన శాసనము, ఆజ్ఞ చెల్లనికారణమున దుఃఖితుడగుచుండును. ఉపర్యుక్తదుర్గుణము మానవస్వభావమగుట కిదియొక కారణము.

ఆత్మ అతిసూక్ష్మమైనది; దానితో పోల్చదగిన మరియొక సూక్ష్మపదార్థము లేనేలేదు. మరణించు మానవుని ప్రక్కనే యుండి అతిశక్తివంతమగు దూరదర్శక యంత్రసహాయముతో పరిశీలించినను ఆత్మగోచరింపదు. "అణోరణూయాన్ మహతో

మహీయాన్" అను ప్రమాణము ఆత్మకు అత్యంతము వర్తించును. "పుణ్యాత్మల మృతాత్మలను దేవదూతలాహ్వానించి పైకి తీసుకొని వెళ్ళెదరు" అని కొందరి మతవాదుల కథనము. కేవలము ఇది సత్యదూరము. స్థూలశరీరమును విడిచిన తరువాత ఆత్మసదృశమగు సూక్ష్మవస్తువు క్రిందభూమిపై నుండజాలదు. ఒక కట్టెపుల్ల స్థూలమైనందున భూమిచే ఆకర్షింపబడును. అది కాలి దానినుండి బయలుదేరిన ధూమము సూక్ష్మమైనందున పై ఆకాశమునకు ఆకర్షింపబడును. ఇట్లే స్థూలశరీరమునుండి విడువడిన ఆత్మకు పైకివెళ్లునిమిత్తము పరసహాయమేమియు అవసరముండదు. ఆత్మ పృథివ్యాకర్షణశక్తినుండి లేదా స్థూలదేహమునుండి విముక్తిని పొందిన తరువాత స్వభావసిద్ధముగనే పైకి పోగలదు.

మహాపాపులగు మానవులు స్వయంకృత పాపకర్మఫలాను సారముగ నీచాతినీచమగు శునక గార్ధభ సూకరాది యోనులయందు జన్మించుచుందురని కొందరిమతము. ఇది సత్యముకాదు. కుక్కలను పెంచువాడు, సదా కుక్కలను భావించువాడు అతి పాపాత్ముడైనప్పటికి ఎన్నడూ స్వప్నమందు కుక్కలమధ్య విహరించుచున్నట్లు, కుక్కల నమ్ముచున్నట్లు చూచునుగాని, తాను శునకమైనట్లు చూడజాలడు. స్వప్నావస్థయందు, సమాధ్యవస్థయందు, మరణానంతరమందు - ఈ మూడుదశలయందు జీవునకు సూక్ష్మదేహము సంక్రమించుచుండును. స్వప్నము

సూక్ష్మలోకమునకుసహోదరివంటిది కావున స్వప్నమందు శున కావతారమెత్తిని జీవుడు సూక్ష్మలోకమందెట్లు దాని అవతార మెత్తగలడు? ధాన్యపుగింజయందు ధాన్యపు బీజము. గోధుమ గింజయందు గోధుమబీజము అణురూపమున అణగియున్నట్లే మానవ జీవునియందు మానవజాతిబీజమే సిహితమైయుండును. కావున మానవప్రాణికి మానవజన్మయేకలుగును. ఎంతటిపాపా త్ముడైనా నీచయోనులయందు ఉద్భవించుట సంభవింపదు. ఏ అపరాధియైన మానవశరీరముతో ఏదైన పాపమునుచేసి యుండినయెడల దాని ఫలమును మానవశరీరముతోనే అనుభ వించితీరవలయును. శునకగార్ధభాది జన్మమెత్తవలసినపనియుం డదు. ఎవరు ఏయోనియం దపరాధము చేయుచుందురో వారు దాని ఫలమును వారాయోనియందే అనుభవించుట సహజము. వ్యభిచార స్త్రీసంపర్కరూపమగు పాపమువలన సంక్రమించిన సుఖరోగబాధలను మానవుడు సూకరమైగాని, శునకమైగాని అనుభవించుటలేదు.

ఏది సత్యమో దానికి నాశములేదు. దేనికి అస్తిత్వము అస్తిత్వ జ్ఞానముండునో అదియే సత్యము. అస్తికపదార్థమున్న చోట అస్తిత్వము హాజరైయుండును. "నేనున్నాను. మే మున్నాము" ఇట్టి అస్తికభావమును ఆత్మమాత్రమే కలిగియుం డును ప్రపంచమందున్న మరియేపదార్థమునందు అస్తిత్వ భావము లేనేలేదు! ఎందువలన? - ఆత్మతప్ప "నేనున్నాను"

అనుమాట పరిచేదియు చెప్పజాలదు. కుర్చీ, మేజాబల్ల, కలము, సిరాబుడ్డి మరియు నదీపర్వతాదులు "మేమున్నాము" అని చెప్పజాలవు. ఇది కలము, ఇది బల్ల అను అస్తిత్వజ్ఞానము కూడ ఆత్మయందే నిహితమైయున్నది; జడపదార్థములయందుండదు. ఆత్మ నిజవస్తు పరవస్తు జ్ఞానమునుకూడ కలిగియున్నది. కావున ఆత్మ సత్యమైనది; సత్యమునకు త్రికాలములయందు అస్తిత్వము అఖండముగ నుండగలదు. సత్యమునకు మారుపేరే ఆత్మ; సత్యము, అనాది, అనంతముకూడనైయున్నది. దానికి నాశమెన్నటికి కలుగజాలదు. అవినాశమగు ఆత్మకు పునర్జన్మ తప్పదు. పునర్జన్మ సంగీకరించినపుడు సూక్ష్మలోక సూక్ష్మశరీరములనుకూడ అంగీకరింపవలసియుండును. గతాధ్యాయములందు సూక్ష్మలోక సూక్ష్మశరీరములగురించి వివరింపబడినది; పునర్జన్మ కలదనుటకు సహేతుకప్రమాణములను ఈ దిగువ నుదహరించుచున్నాను.

(1) "ప్రపంచమందలి ఏ వస్తువునకు నాశములేదు" అను ఆత్మజ్ఞాన పదార్థ జ్ఞానమునకు సంబంధించిన ఒక సిద్ధాంతముకలదు. ఒక పాత్రయందు కొంత నీటినిడుంచి, ఆ పాత్రను అగ్నితప్తముచేసినయెడలకొంతసేపటికికాగినీరంతయు అంతర్హితమగును. కాని నిజముగ నీరు నశింపలేదు. పాత్రయందుకల ప్రతి జలకణము ఆవిరిరూపమున ఆకాశమందు వర్తమానమైయున్నది. ముందు - పాత్రయందు తరళరూపమునఉన్న నీరు ఇపుడాకాశ

మున ఆవిరిరూపమున ఉండియున్నది. ఇంతియే భేదము! దేనిని ప్రపంచము మరణమని, నాశమని చెప్పుచున్నదో కేవలమది రూపాంతరమును, స్థానాంతరమును మాత్రమే పొందుచున్నది. ఇంతకన్న మరేమియు లేదు. ఈ ఆవిరియే శీతవాయుసంపర్కము వలన జలరూపముగను, అత్యంత శీతలసంపర్కమునుపొంది మంచుగడ్డరూపముగను మారుచున్నది. ఇక్కడ జరిగినదంతయు రూపాంతరము, స్థానాంతరము మాత్రమే జరిగినదనియు, ఇదే విధముగ దేనికికూడ నాశము లేదని గ్రహింపవలసియున్నది. దేనికికూడ నాశము లేనపుడు ఆత్మకు నాశమెట్లుండగలదు? కావున అవి నాశమగు ఆత్మకు పునర్జన్మ కలదనుటయే యుక్తియుక్తము.

(2) మానవసంఘమందలి వ్యక్తులయొక్క స్వభావము. జ్ఞానము, అభ్యాసము, సంస్కారము, సుఖదుఃఖములు మరియు గుణావగుణములు చాల వ్యత్యాసముతో కూడియుండును. పూర్వజన్మలేకుండ ఈ వ్యత్యాసములుండుట అసంభవము. కొందరు చాల చిరుతప్రాయమునందే సంగీతవిద్వాంసునివలె చక్కగ స్వరతాళయుక్తముగ సంగీతము నాలపించుట మనకు తెలిసియేయున్నది. దీనిని మనము గమనించినయెడల పూర్వజన్మ సంస్కారమునయొక్క ప్రభావమనియే భావింపవలసియుండును. కొందరు గ్రంథస్థవిషయముల నెన్నిసార్లు చదివినను మరచిపోవుచుందురు; కొందరు ఒకసారి చదివినంతమాత్రమునచే చక్కగ జ్ఞాపకముంచుకొనగలిగియుందురు. ఒకే విద్యాలయ

మఁచు ఒకే "డిగ్రీ"ని పొందిన వ్యక్తులు ప్రజ్ఞాప్రాభవముల యంచు చాల భేదమును కలిగియుండుటను మనము గమనించిన యెడల పూర్వజన్మసిద్ధాంతము నంగీకరింపవలసియేయుండును.

(3) జ్ఞానవిషయమెంతటి గహనమైనదైనా దానిని గ్రహించుటకు ఈశ్వరుడు (ఆత్మ) తగిన సౌకర్యావకాశములను కల్పుగజేసియేయున్నాడు. మరణమనగేమియో తెలిసికొనుటకు నిద్ర చాలవరకుపయోగపడగలదు. మనము నిత్యము నిద్రావస్థ ననుభవించుచున్నాము. నిద్రకూడ ఒకవిధముగ చిన్నతరహా మృత్యువేయగుచున్నది; భౌతికజ్ఞానము లేకపోయినప్పటికి నిద్ర మూలమున మానవుడు నశించుటలేదు. నిద్ర ఆత్మకు ఒక అవస్థ మాత్రమే! అదేవిధముగ మరణముకూడ ఆత్మకు ఒకఅవస్థయని చెప్పబడుచున్నది.

(4) మానవ శరీరము మరణానంతరమందు మాత్రమే మారదు; మానవజీవన సమయమందుకూడ అనేకసార్లు మారుచుండును. మానవశరీరము ప్రతి సెకనునందు మారుచునేయుండును. పాత అణువులస్థానమున నూతనాణుసమూహము పుట్టుచుండును. మన శరీరమందు ఏడుసంవత్సరములతరువాత పాత అణువు ఒక్కటికూడ ఉండజాలదని మన శాస్త్రజ్ఞులంగీకరించియేయున్నారు. సప్తవర్షావధిలో శరీరమందలి సమస్తాణువులు మారిపోవుచున్నవి; ఈ సిద్ధాంతానుసారముగ మానవుడు 49 సంవత్సరముల వయసుగలవాడగునప్పటికి 7 సార్లు తన శరీరమును

మార్చుకొనుచున్నాడు. ఇన్నిసార్లు శరీరము మారినప్పటికి మానవుడు మరణించలేదు. కాస్సున ఈ శరీరమును విడిచిన తరువాత కూడ మానవాత్మ మరణింపదని ఇందుమూలమున స్థిరపడుచున్నది. చిన్నశరీరమును, పెద్దశరీరమును, వృద్ధశరీరమునుకూడ మనము కలిగియుంటిమి, మరణానంతరముకూడ మనము సూక్ష్మ శరీరమును కలిగియుండుదుము. "క్లోరోఫారము"తో మత్తు ఇచ్చినపుడు స్థూలదేహము శవసమానముగ పడియున్నను తిరిగి మేల్కొనుచుండును; ఇదేవిధముగ నిద్రానంతరముకూడ తిరిగి మేల్కొనుచుండును. అట్లేమరణము నిద్రాసమానమగుచున్నది. నిద్రనుండి మేల్కొనినట్లే మానవుడు మరణానంతరముకూడ పునర్జన్మను పొందుచున్నాడు.

(5) సూక్ష్మమగు పరమాణువుకన్న అనేకవేలరెట్లు అతి సూక్ష్మమగు ఆత్మను ఎవరు పట్టజాలరు, చంపజాలరు, దహింపజాలరు, ఖండింపజాలరు మరియు శస్త్రాస్త్రములు దానినేమియు చేయజాలవు. ఇందువలన ఆత్మ అమరమని, అజరమని స్థిరపడుచున్నది. అజరామరమగు ఆత్మ పునర్జన్మనుపొందుట సహజమేయగుచున్నది.

శ్లో॥ నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావకః।
న చైనం క్లేదయంత్యాపో న శోషయతి మారుతః॥
(గీత 2-23)

ఆత్మ నిరవయవి యగుటవలన శరీరమువలె ఆయుధము

లచే నరుకబడదు, అగ్నిచే దహింపబడదు, నీటిచే తడుపబడదు, వాయువుచే ఎండింపబడదు; కావున ఎవ్విధమగు నాశకరపదార్థము ఆత్మను నశింపజేయజాలదని భావము. ఈ గీతాప్రమాణముకూడ ఉపర్యుక్త విషయమును ధృవపర్చుచున్నది.

దివ్యజ్ఞాన సమాజకులు పునర్జన్మ కలదనుటకీక్రింది హేతువులను చూపుచున్నారు.

(6) పరిపూర్ణజ్ఞానియగుటకు మానవునికొక జీవితకాలము చాలదు. జీవుడు భూలోకమందు మాతృగర్భజనితమగు స్థూలశరీరమును ధరించుటయే జన్మమనబడును. అట్టి శరీరముండునంతకాలము ఒక జీవితకాలపు ఆయుర్దాయము సర్వజ్ఞత్వమును పొందుటకు అనేకపర్యాయములు ఈ భూమియందు పెక్కుప్రదేశములలో వివిధసందర్భముల జన్మించి, నానావిధానుభవములను మరల, మరల గ్రహించి కర్మఫలానుభవరూపమగు జ్ఞానమును మానవుడు పొందుచుండును. ఒక బాలుడు ప్రతిదినము పాఠశాలకుపోయి ఉపాధ్యాయుడుపదేశించు పాఠమును చేతనైనంతవరకు గ్రహించుచుండును; మరియు మిగిలిన క్రొత్తజ్ఞానము ఉపాధ్యాయునివలన నేర్చుకొనుటమనసటికోజు పాఠశాలకు పోవుచు పునఃపునః పొందదగిన జ్ఞానమును పూర్తిగ పొందువరకు ప్రతిదినము బడికి పోవుచునేయుండును. అట్లే బ్రహ్మాండమును మనమొక పాఠశాలగ భావింపవలసియున్నది. జీవుడొక విద్యార్థి. ఒక్కొక్క జీవితకాలము పాఠశాలలోవిద్య

నభ్యసించు ఒకొక్కపగలుతో సమానము. మరణానంతర కాలము - బాలుడు బడినుండి ఇంటికివెళ్ళి, పాఠములు వల్లించు కొని మననముచేసి నిద్రించి, జ్ఞానమును జీర్ణించుకొను రాత్రి వంటిది. ఈశ్వరాంశమగు జీవుడు పరిపూర్ణ పరిణామమును పొం దుటకు మరల, మరల ఈ భూలోకమున స్థూలశరీరధారియగు టయే పునర్జన్మము! అనేక జన్మార్జితజ్ఞానమునగాని జీవుడు పరి పూర్ణుడు కాజాలడు.

శ్లో॥ అనేకజన్మ సంసిద్ధః తతో యాతి పరాం గతిం।
(గీత 6-45)

జ్ఞాననిష్ఠుడు అనేకజన్మల సంస్కారమువలన పరిశుద్ధుడై సర్వో త్కృష్టస్థితిని పొందునని భావము. "అనేకజన" అను పద ప్రయోగమువలన పునర్జన్మ కలదనియే స్థిరపడుచున్నది.

(7) ఇహలోకమున కార్యములు కలుగుటకు పూర్వ జన్మమే కారణము లోకమున మానవులయందు కానవచ్చుఅనేక వ్యత్యాసములకు కారణముండియుండవలయునుగదా! కొందరు బాల్యమునుండియు అద్భుతశక్తిమంతులై, బుద్ధిమంతులై, నీతి మంతులై యుండుటచూచుచున్నాము. కొందరు బాల్యమునుం డియు కఠినహృదయులై మందమతులుగనుండి ఎన్నినీతులు గరపినను దౌర్జన్యముండే ఆసక్తులగుచుందురు కొందరు రూప వంతులై ఆరోగ్యవంతులుగ నుండగ, మరికొందరు సదా రోగ గ్రస్థులై కురూపులై యున్నారు. కొందరు అతిబుద్ధిశాలులై

నైపుణ్యముగల కార్యశూరులైనప్పటికి వారు చేయబడుకార్య క్రమములన్నియు నిష్ఫలములైనందున విఫలమనోరథులగు చున్నారు. కొందరు అల్పబుద్ధులయ్యును, తక్కువపూనికగల వారయ్యును మన్నుపట్టిన బంగారమగుటయేగాక సఫలమనో రథులగుటకూడ మనము చూచుచున్నాము. కొందరు ఆగర్భ శ్రీమంతులై, సత్కులసంజాతులై పుట్టుచుండగ, మరికొందరు తద్విరుద్ధముగ ఆగర్భదరిద్రులై రోగులై అతికష్టముల ననుభ వింపుచున్నారు. ఇట్టి తారతమ్యములు ఇహలోకమందున్నట్లు మనకు తెలియును. ఆత్మస్వరూపి, ధర్మస్వరూపి అగు ఈశ్వ రుని సామ్రాజ్యమున ఇట్టి కారణములుండుటకు కారణము లుండియుండవలయును. దీనికి "భగవంతుని ఇచ్ఛ" అనిచెప్ప సమాధానము సరిపోదు. కావున ఇన్నిటికి కారణము జన్మల యందుండియుండవలయును; జీవులు తము, తమ స్వభావసంద ర్భములననుసరించి తమవెంట పూర్వమునుండి వాటిని తీసికొని వచ్చియుండవలయును. పూర్వజన్మలయందు స్వబుద్ధినిఅనుసరించి ఎట్టిస్వభావములనుబలపరుచుకొనియుండిరో, ఎట్టిజ్ఞానమునుపొంది ఎట్టిశాస్త్రముల నభ్యసించి వ్యాసంగములచేసియుండిరో, తదను కూలమగు పూర్వజన్మఫలానుసారముగ ఈ తారతమ్యములు కలిగియుండవలయుననుట సహేతుకము, యుక్తియుక్తము కూడనైయున్నది.

మానవులయందు పెచ్చుతక్కువలు, గుణాగుణములు వంశపరంపరగాకూడ వచ్చియుండవచ్చునని కొందరి అభిప్రా

ప్రాయము. ఇదికూడ సరియగు సమాధానముకాదు. ఒకే తల్లి బిడ్డలయందుకూడ విశేష తారతమ్యములు కనుపించుచున్నవి. మిక్కిలి బుద్ధిశాలురగు తల్లిదండ్రులకు కేవలము మూఢులగు తనయులును, అతిసామాన్యులగు తల్లిదండ్రుల గర్భవాసమున మహాధీమంతులు జన్మించుటయు, చూచినయెడల వంశపరంపరాగత న్యాయమునకూడ సరిపడునట్లు గోచరించుటలేదు.

కొన్ని మతములవారు పూర్వజన్మమున్నట్లంగీకరించుట లేదు. ఒకేజన్మయందు మానవుడుచేయు పాపపుణ్యములననుసరించి జీవునకు శాశ్వతనరకముగాని, శాశ్వతస్వర్గముగాని లభ్యమగునని వారి నమ్మకము. ఇది మిక్కిలి యుక్తివిరుద్ధమనుటకు సంశయములేదు.

(8) "జీవునకు పూర్వజన్మలుండియున్నచో అందలి సంగతులు ఇపుడు మనకెందులకు జ్ఞాపకముండదు?" అను ఆక్షేపణను కొందరు చేయుచున్నారు.

జ్ఞాపకములేనిదంతయు జరుగలేదని వాదించుట సమంజసముకాదు. ఈ జన్మమున జరిగిన విషయములెన్నియో మనకిపుడు జ్ఞాపకములేదు. అందువలన అవి జరుగనేలేదని చెప్పగలమా? ఎవరికైనను తాను మాతృగర్భమునుండి జన్మించుట జ్ఞాపకమున్నదా? యుక్తవయసు వచ్చినతరువాత జరిగిన విషయములెన్నియో మనకు జ్ఞాపకములేదు. అంతమాత్రమున అవి జరుగలేదని అనగలమా? చాలకాలము మరచిపోయిన విషయములు ఒకానొక సమయమున తిరిగిస్మరణకువచ్చుటకూడగలదు.

మరచిపోయిన ఒక విషయమును మరియొకడు గుర్తుచేసినప్రుడు అది స్మృతిపథమునకు వచ్చుటకూడకలదు. అట్టి విషయములు జీవుని అంతఃకరణమున లోపలఎచ్చటనో నిలచియుండవలయును గదా! జాగ్రదవస్థయందు స్ఫురణ లేకపోయి ఉండవచ్చును. ఏదో ఒక కారణమున మరుపుకలిగియుండును.

అట్లే పూర్వజన్మలలో జరిగిన విషయములు జ్ఞాపకము లేనంతమాత్రమున జన్మలే లేవనుట సమంజసముకాదు. ఏయే జన్మలయందు ఏయే అనుభవములు కలిగినవియు వేర్వేరుగ జ్ఞాపకము లేకపోయినను వాని సారమగు జ్ఞానము వాసనా రూపముగ లోపల నిలచియేయుండును.

అయినప్పటికి జ్ఞాపకము లేకపోవుటకు సరియగు కారణములు కనుపించుచున్నవి. జ్ఞాపకము లేదనుట అనగా - జాగ్రదవస్థయందు మనకు జ్ఞాపకము లేదన్నమాట. అనగా స్థూలశరీరమునందు వర్తించుకాలములో జ్ఞాపకము లేదనుటయనిభావము స్థూలశరీరమస్తిష్కమునకా జ్ఞానము లేదు. నిత్యుడగు జీవునకు తెలిసియేయున్నది. అనగ - జ్ఞానమంతయును విజ్ఞానమయకోశమున నిలచియున్నది.

మానవుడు - అన్నమయ, మనోమయ, ప్రాణమయ, విజ్ఞానమయకోశములు అను నాలుగింటిని కలిగియున్నాడు. అన్నమయ ప్రాణమయ మనోమయకోశములు ప్రతిజన్మకు మారుచుండును. ఇప్పటి ఈమూడుకోశములు గతజన్మలయందు

ఉండియుండలేదు. ఈ కారణమున పూర్వజన్మానుభవముల జ్ఞాపకము ఈ స్థూలశరీరమందుండుటకు అవకాశము లేదు. జన్మ జన్మమునకు నిత్యమైయుండునది విజ్ఞానమయకోశము. కావున ఆ కోశమున జన్మజన్మల జ్ఞానము నిహితమైయుండును.

అయినప్పటికి ఎవరైన అంతర్ముఖులై ఇంద్రియమనో నిగ్రహముల నభ్యసించి, నిశ్చలులైనచో అట్టివారలకు విజ్ఞాన మయకోశమందు దాగియున్న పూర్వజ్ఞానము జాగ్రదవస్థయందు కూడ స్ఫురింపగలదు. అట్టివారు జాతస్మరులని చెప్పబడుదురు. మనమ కూడ పైవిధముగ సాధనచేసినయెడల మనకుకూడ అట్టి పూర్వజన్మజ్ఞానము సాధ్యపడగలదు. ఎంతవరకు మన మనసు బాహ్యావిషయములందు విహరించుచుండునో అంతవరకు లోపలి విజ్ఞానము మనసునకందుటకు అవకాశముండదు. దీనినే యోగ మందురు. – "యోగశ్చిత్తవృత్తి నిరోధః" చిత్తవృత్తుల నిరో ధించుటయే యోగమని భావము.

పూర్వజన్మములయందు ఏయే విధములగు సంకల్పములు, తలపులు కలిగియుంటిమో అవ్విధములగు సంకల్పములు, కోరి కలు జీవుని నిత్యఉపాధియగు విజ్ఞానమయకోశమందును, సూక్ష్మ భూతములందును అంకురములుగ నిలిచియుండి తరువాతి జన్మల యందుఆయాగుణములుఉపాసనారూపమునకనుపించుచుండును. అనగ బాల్యమునుండి ఆయాసంకల్పములు, కోరికలు నైజముగ కనుపించుచుండును. ఇదియే స్వభావము.

పూర్వజన్మమున ఏదేని ఒకశాస్త్రమందు ఎక్కువ వ్యాసంగముచేసి అభ్యసించినయెడల ముందుజన్మయందు బాల్యమునుండియే ఆ శాస్త్రమందు ఎక్కువ అభిరుచి కలిగియుండుటయేగాక, ఆ శాస్త్రమును సులభముగ గ్రహించుశక్తికలవాడగును.

(9) పూర్వజన్మ స్మృతి లేకపోవుటకుగల కారణమును కొందరీవిధముగ సమాధానము చెప్పుచున్నారు. జ్ఞాపకముంచుకొనుట మెదడుయొక్క పనియైయున్నది; తదనంతర జన్మలయందు ఆత్మ మారనప్పటికి మెదడు మారిపోవుచున్నది. ఇందువలన దానికి పూర్వజన్మ సంఘటనలు జ్ఞాపకముండవు. ఆత్మయందు మాత్రము ఆ ప్రాచీన సంఘటనానుభవములు సంచితమైయుండును. ఇట్లుండుటయే మానవునకు అనుకూలమై సుఖకరముగనుండును.

(10) స్వాప్నావస్థనుండికూడ ఈ క్లిష్టసమస్యను పరిష్కరించుకొనవచ్చును. మానవునకు జాగ్రదవస్థలో స్వప్నమందు జరిగిన అనేకవిషయములు జ్ఞాపకముండును. కాని స్వాప్నావస్థలో మరియొక స్వప్నమందలి సంగతులు గుర్తుండజాలవు. అనగ - సుషుప్తి, స్వప్నము సుఖానుభూతికొరకే సృజింపబడినవి. నిద్రావస్థలో ప్రవేశించుటతోనే సమస్తదుఃఖములు, బాధలు మరియు జాగ్రదవస్థయందలి సమస్తమైన చింతలు మాయమైపోవును. ఇట్లుకానిచో మానవుడు నిద్రాసుఖమునుభవింపజాలడు.

వ్యర్థమగు గత చింతలను మరచిపోవుటకొరకే నిద్ర ఉపయోగ పడుచున్నది. స్వప్నమందు మరియొక స్వప్నయొక్క జ్ఞానము గుర్తుండజాలనట్లే ఈ జన్మమందు పూర్వజన్మలయొక్క జ్ఞాన ముండదు. జాగ్రదవస్థయందు అనేక స్వప్నవృత్తాంతములు జ్ఞాపక మున్నట్లే, మరణాంతరస్థితియందు సూక్ష్మ స్థిష్కమున అనేక జన్మలయందు జరిగిన ముఖ్యసంఘటనలయొక్క స్మృతి కలుగు చుండును. ఆత్మ మానవసౌకర్యార్థమే పూర్వజన్మ సంఘటనల యొక్క అజ్ఞానమును కలుగజేసియున్నది. ఒక జన్మయందలి చింతలతోనే మానవుడు వ్యాకులపడుచుండగా అనేక జన్మకృత ములగు చింతలు మానవుని చుట్టుముట్టినయెడల అతనికీప్రపంచ మందు సుఖము, నవీనత కలుగజాలదు; ఆధ్యాత్మిక సాధనకూడ చేయజాలకుండును. ఈ ఏర్పాటును మన సౌకర్యార్థమే మన ఆత్మ సమకూర్చినట్లు స్పష్టమగుచున్నది. గత సంఘటనలను గుర్తుచేసికొనుటవలన ఇసుమంతయు లాభముండదు. గత అనంత జన్మలయొక్క అనంత సంఘటనలను మరచిపోవుటయందే సుఖముకలదు. ఇదియే సరియగుపద్ధతి. ఇది అంతయు ఆత్మరూపి యగు ఈశ్వరుని యేర్పాటుమాత్రమే!

ఈ ప్రపంచము సుఖములననుభవించుటకు క్రీడామైదా నమైయున్నది. చింతలను విడిచి సుఖముగ క్రీడించుటకు మాన వులు సిద్ధముకావలసియున్నది. దుఃఖములయొక్క, విపత్తుల యొక్క, తుదకు మృత్యువుయొక్క భయమునుకూడ త్యజింప

వలసియున్నది. మీ అనుమతి లేకుండ దుఃఖములు, విపత్తులు, మృత్యువుకూడ మిమ్ము స్పృశింపజాలదు. ఈ సత్యజ్ఞానమును బలపర్చుకొనుటకు నిత్యస్వాధ్యాయము చేయవలసియుండును.

(11) జన్మమనగ ఈశ్వరాంశమగు జీవుడు స్థూలరూపమగు భౌతిక శరీరమును ధరించుటయనిభావము. జీవుడు ఆత్మ రూపియగు ఈశ్వరుని అంశము. కావున ఈశ్వరునివలె నిత్యుడు; నాశరహితుడు! చావుపుట్టుకలు జీవునకన్వయింపవు. అంశమనగ భాగము. ఇక్కడ భాగమనగేమియో వివరింపవలసియున్నది. భాగమనగ ఈశ్వరునిలో ఒకతునకయనుట సరిగాదు. "ఈశ్వర శక్తియంతయు బీజరూపముగ తనయందుగల తత్వము" అని తెలిసికొనవలసియున్నది. వృక్షముయొక్క అంశము బీజమని చెప్పవచ్చును. వృక్షమునుండి ఒక తునక నరికివేయబడినది మాత్రముకాదు. వృక్షమునందుండుశక్తి (జీవము) బీజమునందు దాగి అణగియున్నది. అట్టి బీజమును భూమియందునాటగ కాలక్రమమున మొలకఅయి, చిన్న చెట్టయి, గొప్పవృక్షమై పూర్వపువృక్షమువలె పూర్ణముగ పత్రశాఖపుష్పఫలములతో ప్రకాశించునుగదా! ఇదియంతయు బీజమునందు దాగియుండి, కాలక్రమమున వ్యక్తమగుచున్నట్లు ఈశ్వరశక్తియంతయు జీవునియందు అంతర్గత బీజరూపముగ దాగియుండి ప్రపంచమున అనేకశరీరములు ధరించుచుండును.

ఇట్లు ఈశ్వరాంశమగు జీవునకు నాశములేనపుడు పున ర్జన్మ నంగీకరింపవలసియేయుండును.

(12) స్థూలశరీర మస్తిష్కము ఒక జన్మయొక్క అనుభవమునుమాత్రమే కలిగియుండును. సూక్ష్మశరీరమస్తిష్కమందు అనేక జన్మార్జితానుభవము నిహితమైయుండును. ఇందువలన స్థూలశరీరమస్తిష్కము అల్పజ్ఞానయుతముగనుండును. సూక్ష్మశరీరమస్తిష్కమందు అనేక జన్మార్జితానుభవము నిహితమైయుండును. ఇందుచే స్థూలశరీరమస్తిష్కము అల్పజ్ఞానయుతముగ వుండును, సూక్ష్మశరీరమస్తిష్కము అధికజ్ఞానయుతముగను ఉండియుండును. జీవించియుండగ సూక్ష్మశరీరసంబంధము నేర్పరచుకొని, పరిచయమును పొందగలుగుట యోగసాధకునకు మాత్రమే సాధ్యపడగలదు. ఇతరులకసాధ్యము. సూక్ష్మశరీరమస్తిష్కము అనేక జన్మల అనుభవమును, జ్ఞానమును కలిగియున్న కారణమున అతిశక్తివంతమైయుండును; ఇట్టి మస్తిష్కముతో యోగి సమాధిసమయమందు కొంత సమయమున సంబంధమును స్థాపించుకొనగలిగియుండును. ఇందుమూలమున యోగి తన అతీంద్రియజ్ఞానముతో సామాన్యమానవులకసాధ్యమగు అనేక అద్భుతవిషయములు ప్రదర్శించుచుండును.

గత జన్మార్జిత సంస్కారము ముందుజన్మకు పనికివచ్చు జ్ఞానరూపమున సూక్ష్మమస్తిష్కమందు లేదా విజ్ఞానమయ కోశమందు సంచితమైయుండగలదు. సూక్ష్మమస్తిష్కచ్ఛాయా ప్రభావము జాగ్రదవస్థయందలి స్థూలమస్తిష్కమందుకూడ ప్రసరించుచుండును. అనగ-గతజన్మార్జితసాధనము, సత్సంగము,

స్వాధ్యాయము, విద్యావ్యాసంగాదులయొక్క ప్రభావము ఈ జన్మమందు అట్టి మానవులయందు ప్రస్ఫుటమగుచుండును. అట్టి వారు సామాన్య మానవులుకంటె జ్ఞానవంతులై, అనుభవజ్ఞులై విద్వాంసులై విరాజిల్లుచుందురు. గతజన్మసంస్కారము ననుసరించియే మంచిచెడు స్వభావములు ఇహమందు మానవులకు సంక్రమించుచుండును. లేనిచో పైవ్యత్యాసములుండవలసినపని లేదు. ఉపర్యుక్తమగు హేతువులను మనము గ్రహించినయెడల పునర్జన్మ కలదనియే విశ్వసింపవలసియుండును.

ఆయుర్దాయము — మానవులకు సూక్ష్మలోకము నిజమగు నివాసమని సాధారణముగ చెప్పబడుచున్నది. మానవులు ఈ స్థూలప్రపంచమున తమ ఇండ్లవద్దనుండి యంత్రార్ధమై ఇటు నటు తిరుగుటకు, తమాషా చూచుటకు, మేలా వగైరాలలో పాల్గొనుటకు బయలుదేరి వెళ్ళుచుందురు. నిశ్చయముగ ఇదే విధమున ముక్తపురుషులు సూక్ష్మలోకమునుండి ఇహలోకమునకు ఇతరులనుద్ధరించుటకై వచ్చుచుందురు; సామాన్య మృతాత్మలు విలాసార్థము ఇక్కడకు వచ్చుచుందురు ఇహలోక మానవులు తమ సంతోషార్థము షికారునకు, సినీమాలకు, బజారుకు వెళ్లుచుందురు. ఇదేవిధముగ సూక్ష్మలోకమునుండి మానవులు కొంతకాలముండుటకు, తమాషాలు చూచుటకు ఇహలోకమునకు సంతోషముతోనే వచ్చుచుందురు.

ఇక్కడ మానవుడు బజారుకు వెళ్ళినపుడు, యాత్రా

ధామై వెళ్లునపుడు, ఇతరుల పనులకు వెళ్ళునప్పుడు - "ఇంతసమయమునకు, ఇన్నిగోజులకు ఇంటికి తిరిగివచ్చెదను" అని నిశ్చయించుకొనును. అదేవిధముగ సూక్ష్మలోకమునుండి మానవుడు ఇహలోకమునకు వచ్చునపుడు - "ఇన్నిరోజులలో ఇక్కడకు తిరిగివచ్చెదను" అని నిశ్చయము చేసికొనును. బయలుదేరుటకు, తిరిగివచ్చుటకు మధ్యగల సమయమునే "వయస్సు", "ఆయుర్దాయము" అని యందురు. మానవుడు నిదురించునప్పుడు "నేను ఫలానా సమయమునకు నిదురనుండి మేల్కొనవలసియున్నది" అని సంకల్పించి అదే సమయమునకు నిదురనుండి మేల్కొనును. ఇట్లే సూక్ష్మలోకమునుండి బయలుదేరినప్పుడు నిశ్చయించుకొనిన సమయమునకు మానవుడీ శరీరమును, ఈ లోకమును విడిచి సూక్ష్మలోకమునకు వెళ్ళిపోవును.

మానవుడు చావును, ప్రమాదములను అంగీకరింపడు. అయినప్పటికి అతనికి చావు ప్రమాదములు, దుర్ఘటనలు ఎందుకు కలుగుచున్నవి? మృత్యువురొక్క దుర్ఘటనలరొక్క రహస్యమేమి? అను ప్రశ్నలకు సమాధానమీయవలసియున్నది. సూక్ష్మశరీరపు రహస్యము, స్వప్నావస్థను, సమాధ్యవస్థను చర్చించినయెడల చాలవరకు విడిపోగలదు.

ఒకనికి ప్రతిరాత్రి 4 గంటలకు మేల్కొను అభ్యాసము కలదు. అతడొక రాత్రి 2 గంటలకు లేచి రైలుకి వెళ్ళవలసివచ్చినది. తన అంతరాత్మతో ఆ సమయమునకు మేల్కొలప

వలసినదిగ ఆజ్ఞాపించును. అంతరాత్మ సరియగు సమయమునకే మేల్కొఁలుపును. కాని తన అంతరాత్మ తనను రాత్రి 4 గం॥కు మేల్కొఁలుప అలవాటు. అతనిని అంతరాత్మ రాత్రి 2 గం॥కు మేల్కొఁలిపెను, కాని అతడు మేల్కొఁనలేదు. 4 గం॥లకు లేచు అలవాటువలన అతడు 2 గం॥లకు లేవలేదు.

సూక్ష్మశరీరము, అంతరాత్మ ఎన్నడు నిదురపోవు; మరణింపవు. రెండు గంటలు కావచ్చునప్పటికి అతడొక కలగనెను- అతడు రైలుపై పయనించుచుండెను. రైళ్లు ఒకదానితోనొకటి గుద్దుకొనెను. పెద్దకుదుపు, ధ్వని, కేకలు, బొబ్బలు వినిపించగ తానుకూడ ఒక పెద్దకేకతో నిద్రనుండి మేల్కొని కూర్చుండెను. అప్పుడు సరిగ రాత్రి 2 గంటలు అయ్యెను ఇదియే దుర్ఘటన (ఏక్సిడెంటు) యొక్క రహస్యము. సూక్ష్మశరీరమందలి అంతరాత్మ ఈ నెపమున మేల్కొఁలిపెను.

సూక్ష్మలోకమునుండి మానవాత్మ ఇహలోకమునకు వచ్చునపుడు - "ఇన్నిరోజులకు సూక్ష్మలోకమునకు తిరిగివచ్చెదను" అను నిశ్చయప్రకారము ఆ లోకమునకు నెళ్ళనియెడల అంతరాత్మ దుర్ఘటనను కల్పించి సూక్ష్మలోకమునకు తీసికొనిపోవును; అనగ మరణింపజేయును. ఇదియే దుర్ఘటనయొక్క రహస్యము!

మానవుడు తన ముఖ్యనివాసమగు సూక్ష్మలోకమునుండి బయలుదేరు సమయమున తన అంతరాత్మతో - "ఈ పని

అయిపోయిన తరువాత ఇన్ని సంవత్సరములకు, ఇన్నిరోజులకు ఈ స్థూలశరీరపు, స్థూలప్రపంచపు సుదీర్ఘస్వప్నమునుండి నన్ను మేల్కొలుపవలయును"అని చెప్పియున్నాడు ఈదీర్ఘస్వప్నము నుండి మేల్కొనుకాలము ముందుగనే నిశ్చయింపబడినది. ఈ సమయమునకే "ఆయుర్దాయము"అని పేరు; ఈ దీర్ఘస్వప్నము నుండి మేల్కొనుట అను కాలమే మృత్యువు లేక దుర్ఘటన అయిఉన్నది. సూక్ష్మశరీర అంతరాత్మలయొక్క లీలలు చాల విచిత్రమైనవి. యోగసాధనద్వారా జ్ఞానచక్షువు వికసించినపుడు ఈ లీలలు మనకు అవగతము కాగలవు. కాని ఈ అంతరాత్మ యొక్క లీలలు తత్వతః స్థూలజిహ్వతో వర్ణించుట చాల కష్ట సాధ్యమైయుండును.

మానవుడేవస్తువువలన భయపడుచుండునో దానిని తరచు భావించి, బలాత్కారముగ ఆకర్షించుచుండును. సాధారణముగ కోరినవస్తువు మానవుని ఇంత బలాత్కారముగ ఆకర్షింపజాలదు. ఒక గ్రామమున ప్లేగు, కలరా వ్యాపించియున్నపుడు మానవుడు వీనికి భయపడి ఎల్లపుడు వానినే భావించుచుండును. ఈవిధమగు తీవ్రభయాందోళనవలన రోగముయొక్క తీవ్రమగుభావన ఏర్పడి ఆ రోగమితనికి సంక్రమించును.

కావున మానవుడు రోగమునకు, మృత్యువునకు అధికముగ భయపడుచుండును. కారణము? – జన్మజన్మాంతరముల నుండి ఈ విధముగ మానవుడు భయపడుచు వచ్చుచున్నాడు.

ఇందువలన తనకిష్టమున్నను లేకపోయినను భయముతో వానిని భావించుచున్నాడు.

దుఃఖము, మృత్యువు. పరతంత్రత ఈ విధమగు సమస్త కష్టములు తనవల్లనే కలుగుచుండును. దాని కీలకము తనచేతిలోనే యున్నది. మరణము, కాలము, ఆయువు సమస్త బంధములు, ఇవి అన్నియు తన సంకల్పమువల్లనే, తన అజ్ఞానము వల్లనే ఏదో ఒకరూపమున కలుగుచుండును; ఇదేవిధముగ దీని నుండి విముక్తిని పొందుటకూడ మన స్వాధీనమందేయుండును. తత్ఫలితముగా తెలిసికొనినయెడల ఆయుర్వృద్ధి, భవిష్యత్పరివర్తనల యొక్క కీలకముకూడ మన చేతియందేకలదు. తన ఆయుర్దాయము తనచేతనే నిశ్చయింపబడుచుండును; ఇతరులవలన మాత్రముకాదు!

స్వర్గము, నరకము – మతప్రోక్తమగు స్వర్గము నిజముగ స్వర్గముకాదు; ఎందువలన? – అట్టి స్వర్గమందు మతప్రతిపాదితమగు దేవునియొక్క లేదా ఈశ్వరునియొక్క అధికారము నంగీకరించుచున్నారు. మానవ శరీరము స్థూలమని, సూక్ష్మమని రెండు విధములుగనున్నట్లే ప్రపంచముకూడ స్థూలసూక్ష్మభేదములతో రెండు విధములుగ ఉండియున్నది. స్థూలప్రపంచమును విడిచిన తరువాత జీవుడు సూక్ష్మశరీరముతో అతిసూక్ష్మము, మనోమయమునగు ప్రపంచమునకు చేరుచున్నాడు. ఇందువలన శరీరవిమోచనానంతరము ఆత్మజ్ఞానులకీ లోకము అనువుగను,

ఆనందదాయకముగను ఉండును. ఎందువలన? - ఈ సృష్టి వీరి మూలమునసే జరిగినది. కావున ఈ సృష్టియందు వీరికి అభిరుచి కలుగని,ఆనందదాయకముకాని ఒక్కవస్తువుకూడ ఉండజాలదు.

మహమ్మదీయ మతముయొక్క "బహిస్తు"నందు మద్య ప్రవాహాములు ప్రవహించుచుండునని చెప్పుచున్నారు. ఇందు వలన మద్యపానప్రియులగు మృతాత్మలకు చాల సుఖదాయక ముగ స్వర్గమెయుండును. మద్యగంధము, మద్యపుమత్తు మరియు తజ్జనితమనోభావములను అసహ్యించుకొనువారికి మద్యమయ స్వర్గము లేదా "బహిస్తు" నరకముకన్న, "దోజఖ్" కన్న నీచాతినీచముగతోచును. మతవాదుల 'స్వర్గ'మందు, 'బహిస్తు' నందు ఈశ్వరుడు, ఖుదా, ఇంద్రాదిదేవతలయొక్క రాజ్యాధి కారముండును. అక్కడ రంభ, తిలోత్తమాది అప్సరలు లభ్య మగుదురు. వారినిచూచి ఆత్మజ్ఞానులు, సత్పురుషులు, యోగులు ప్రసన్నచిత్తులెట్లగుదురు. దుఃఖితులేయగుదురు. ఒకవేళ మతవాదుల "స్వర్గము" ప్రాప్తించినను ఎవరికికూడ సంతోషదాయకముగ నుండజాలదు; ఎందువలన? -అట్టిస్వర్గము ఖుదామియా, ఈశ్వరుడు మరియు ఇంద్రుడు - వీరియొక్క అధికార పరిధిలోనేఉండి వారి ఆనందాభిరుచులకే అనుకూలమై యుండును. మన స్వర్గము మనకు రుచించునదై, మన భావనల కనుకూలమై, స్వదేశమై, స్వాధికారయుతమై ఉండవలయును; మనపై అధికారమును చలాయించువారక్కడ నుండరాదు.

ఇట్టి నిజమగు ఆత్మజ్ఞానులయొక్క స్వర్గము ఆత్మలోకమే అయి ఉన్నది.

ఇది మనోమయప్రపంచమైనప్పటికి, స్వర్గమని చెప్పబడు ఈ ప్రపంచము అందరికి అనంతసుఖానందములనిచ్చునదియై యున్నది. ఎందువలన? - అది సర్వథా మనోమయమై మన అభిరుచికి, మన భావనలకు అనుకూలమై మనసునకధీనమై యుండును. కాని మతవాదులకు, ఆత్మజ్ఞానములేని అజ్ఞానులకు ఈ స్థానము నిజముగ సుఖదాయకమైనను మహాదుఃఖదాయకమే కాగలదు. అజ్ఞానజీవులు దీనితో విసుగుచెంది శీఘ్రముగ ఇక్కడనుండి పారిపోవుదురు. ఇక్కడకువచ్చికూడ ఆత్మజ్ఞానము లేనికారణమున స్థూలప్రపంచమందుకూడ తమను గులామములుగ, పరాధీనులుగ భావించి దుఃఖితులై ఇహమందుండికూడ పారిపోవుచున్నారు. ఇహలోకమందు జరుగు ఆత్మహత్యలకు ఈభావనయే ముఖ్యకారణము. నిజమగు ఆత్మజ్ఞాన ప్రబోధకుడగు సద్గురువు దొరకనంతవరకు ఆ జీవులిదేవిధముగ జననమరణరూపియగు చక్రబంధనమందు చిక్కుకొని తిరుగుచునేయుందురు. కాని నిజమగు ఆత్మజ్ఞాని ఈ విధమగు జననమరణబంధమునుండి విముక్తిని పొందగలడు. ఆత్మజ్ఞానికూడ జన్మించుచుండును. పరవశుడై కాదు, దుఃఖముతో విసుపుచెందికాదు, జన్మబంధనమందు చిక్కుకొనికాదు, ఇహలోకమానవోద్ధరణార్థము జన్మించుచున్నాడు.

సివిలుసర్జన్, మేజిస్ట్రేటు మఱియు మినిష్టరుకూడ జైలుకి వెళ్లుచుందురు; నేరస్థులవలె బంధనమందు చిక్కుకొనికాదు, సంతోషముగ జైలుయొక్క మంచిచెడ్డలు నిరీక్షించుటకు, దుఃఖిత ఖైదీలయొక్క దుఃఖముల నివారించుటకొరకు వెళ్లుచుందురు. ఫలానా మినిష్టరు, డాక్టరు, మేజిస్ట్రేటు కొన్నిగంటలు జైలుకి వెళ్ళివచ్చినట్లు పత్రికలుగాని, ప్రజలుగాని భావింపరు; ఏవిధముగ వీరి జైలుయాత్ర జైలులో శిక్షననుభవించుటకాజాలదో అదేవిధముగ ముక్తాత్మలయొక్క రాకపోకలను సామాన్య జననమరణములుగ భావింపరాదు; మానవోద్ధరణార్థము కారణ జన్ములై అవతరించుచున్నట్లు భావింపవలసియున్నది.

ప్రతి మానవుని సూక్ష్మప్రపంచము అతని ఆధీనమందే యుండును, అతని భావనాకల్పనలను అనుసరించియుండును; అతని అభిరుచికి అనుకూలముగనుండును. ఇదియే ఆత్మలోకము, అనంత సుఖములకు ఆకారమైయున్నందున దానినే స్వర్గమందురు. ఎందువలన? - ఇక్కడ సంపూర్ణ స్వతంత్రత కలిగియుండును; ఏ ఇతరుని శాసనముండదు.

తనపై తన అధికారమును కలిగియుండుట స్వారాజ్యము; ఇతరులపై తన అధికారమును చలాయించుట స్వారాజ్యము కాదు. తన శరీరముపై, తన ఇంద్రియములపై, తన మనసుపై, తన బుద్ధిపై, తన ప్రత్యంగముపై తన రాజ్యమును చలాయించుట స్వారాజ్యము. కావున మానవుడు దీనికి వ్యతిరేకముగ

సంచరించుచున్నాడు. మస్తిష్కమందు, మనసునందు అతని అధికారము లేదు; కావున అతని మనసుపై ఒక రాజకీయనాయకునియొక్క, ఒక మతఈశ్వరునియొక్క, ఒక మతగ్రంథముయొక్క రాజ్యమున్నది; ఒక డాక్టరుయొక్క లేదా ఒకవిషయవాసనయొక్క మాత్రము రాజ్యముండియున్నది. ఇతనిపై ఇతరుల అధికారము అమలునందున్నను, ఇతరులపై తన అధికారమునుపయోగించుటకు చూచుచుండును. ఈ స్వభావమే సమస్త దుఃఖములకు మూలకారణమైయున్నది.

సూక్ష్మలోక బ్రహ్మాండమందు నీ శాసనముండియుండెను; అది నీ సృష్టియగుటయే దీనికి కారణము. అది నీ వశమందే ఉండియుండెను. కావున దానిని నీవు ఈశ్వరవశమని, దేవతావశమని భ్రమించి దుఃఖము ననుభవించితివి; ఇక్కడ ఈ స్థూలప్రపంచమును నీ వశమందుంచుకొనుటకు ప్రయత్నించి దుఃఖముననుభవించుచున్నావు. ఈ స్థూలప్రపంచము నీ ఒక్కనిది మాత్రముకాదు, నీ వ్యక్తిగతకల్పనకాదు; ఇది సృష్టియొక్క కల్పన! ఈ సమిష్టి కల్పనయందు నా కల్పనకూడ మిళితమైయున్నది. ఇందుమూలమున ఇందు నీ కల్పనకూడ పనిచేయగలదు. ఇందు ఇతరుల భావనాపటిమకూడ పనిచేయగలదని మరువరాదు.

ఒకవేళ నీవు ఇతరులను చంపుటకు లేదా రోగగ్రస్తులను చేయుటకు ప్రయత్నించినయెడల అది నెరవేరజాలదు. ఎందు

వలన? – అతని ఆత్మ మరణించుటకు, రోగగ్రస్థమగుటకు అంగీకరింపక ప్రతిఘటింపగలుగును. నీ ఆత్మవంటిదే అతని ఆత్మకూడ! రెండుకూడ సమాన శక్తిమంతములైయుండును. ఒకవేళ నీవు ఇతరుల ఆయురారోగ్యాభివృద్ధిని కోరుచుండినయెడల ఈ కోరిక పూర్తియగుటకు కష్టపడవలసిన పనియుండదు; ప్రతి వ్యక్తి తన ఆయురారోగ్యములఅభివృద్ధిని స్వయముగ కోరుకొనుచుండును. ఇట్టి భావనవలన ప్రయోక్తకు ఆత్మశక్తి అభివృద్ధియగుచుండును. ఇతరులచెడ్డను కాంక్షించినయెడల శక్తి దుర్వ్యయమై క్షీణించిపోవును.

విపరీత జ్ఞానమువలన లేదా అజ్ఞానమువల్లనే ప్రపంచమందు అశాంతి ప్రబలియున్నది. ఇపుడు మానవ మస్తిష్కమందు అస్నవిధములగు విపరీతజ్ఞానధార ప్రవహించుచున్నది. ఆత్మజ్ఞానాభివృద్ధి కావలసియున్నది, కావున జడవిజ్ఞానాభివృద్ధి జరుగుచున్నది. జీవుని పూజింపవలయును. కాని నిర్జీవపదార్థముల పూజించుచున్నారు. చేతనమును పూజింపవలయును కాని జడపదార్థముల పూజించుచున్నారు; తనను అదుపులోనుంచుకొనపలయును. కానిఇతరులను అదుపులోనుంచుటకు ప్రయత్నించుచున్నారు అందరిని స్వావలంబులనుచేయపలసియున్నది, కాని వారిని పరావలంబులనుగతయారుచేయుచున్నారు;స్వతంత్రతపై ఉపన్యాసముల నిచ్చి వారే ప్రజలను పరతంత్రులుగచేయు ఉపాయముల సృష్టించుచున్నారు.

వ్యష్ట్యాత్మను జీవుడని చెప్పవచ్చును; సమిష్ట్యాత్మను పరమాత్మయని లేదా ఈశ్వరుడని చెప్పవచ్చును. ఏ స్థూలప్రపంచమునయొక్క శాసనము, సమిష్ట్యాత్మయొక్క రాజ్యము ఉండియున్నదో దానిని ప్రత్యేకముగ మానవులు తమ పాలనకు తీసికొనుటకు ప్రయత్నించుచున్నారు; ప్రత్యేకముగ తమ శాసనాధికారముగల సూక్ష్మప్రపంచ సూక్ష్మదేహములను ఈశ్వరాధీనములని, యమరాజాధీనములని భ్రమించుచున్నారు. సూక్ష్మలోకమందలి సమస్త సృష్టి మీయొక్క రచనయే! అక్కడ మీ అభిప్రాయానుసారముగనే సృష్టిస్థితి లయములు జరుగుచుండును. అక్కడ దేవీదేవతలు, ఈశ్వరపరమేశ్వరులు మరియు యమరాజ యమదూతలు సమస్తము మీకు స్వాధీనములే! ఇవి అన్నియు మీ సంకల్పసంజనితములే! వారితోనే మీరు భయపడుచున్నారు. తమను వారి స్వాధీనులనుగ అంగీకరించి నరకబాధల ననుభవించుటకుకూడ సిద్ధమగుచున్నారు. ఇది అంతయు విపరీతజ్ఞానజన్యములగు దుఃఖములవలన, శోకవిపత్తుల వలన కష్టబలహీనతలమూలమున కలుగుచున్నది.

• నిజమగు జ్ఞానముకొరకు నీవై పునకువంగి, నీలోనికి తిరిగివచ్చి, అంతరాత్మయందు మునిగి సద్గురువుద్వారా, సత్సంగముద్వారా మరియు స్వాధ్యాయముద్వారా నిజజ్ఞానప్రాప్తిని పొందుటలో సమాధ్యవస్థ కలిగినపుడు నీవు ప్రత్యక్షానుభూతిని పొందగలవు అపుడు నీకు నీ అంతరాత్మయొక్క శక్తి మరియు అనిర్వచనీయమగు ఆనందము అవగాహన కాగలదు.

స్వప్నసమాధులు రెంటియందు ఒకేవిధమగు శరీరము పనిచేయుచుండును. ఈ రెండు అవస్థలయొక్క శరీరము, ప్రపంచము, సూక్ష్మమైయున్నది; మనోమయమైకూడనుండును. కాని రెండు అవస్థలయొక్క శరీరము, ప్రపంచమునందు, చాల భేదముండియున్నది. స్వప్నావస్థయందలి సూక్ష్మశరీరము, జాగ్రదవస్థాస్థూలదేహమునకన్న శక్తిహీనమైయుండును; కాని సమాధ్యవస్థయందలి అదే సూక్ష్మశరీరము జాగ్రదవస్థాస్థూలశరీరమునకన్న లక్షలాది రెట్లధికముగ శక్తివంతమైయుండును. దీని శక్తి సామర్థ్యములను నిజమగు యోగులే ప్రత్యక్షానుభవమును పొందగలిగియుందురు.

స్వప్నసూక్ష్మశరీరము అజ్ఞానయుక్తతమోగుణాచ్ఛాదితమై ఉన్నకారణమున అత్యంతశక్తిహీనమైయుండును. స్వప్నమందు మానవుడు స్థూలశరీరముతో పరుగిడినంత పరుగిడజాలడు; ఒకనిని తీవ్రముగ కొట్టప్రయత్నించునుగాని అట్లు చేయజాలడు. ఉచ్చైస్వరముతో కేకలిడజూచును కాని అట్లు చేయజాలకుండును. దీనికి కారణము? - స్వప్నావస్థ అజ్ఞానాచ్ఛాదితమై స్పృహలేని అచేతనదశ అగుచున్నది, స్వప్నమందు మానవుడు ఇది స్వప్నమనియు, నేనిపుడు నిదురించి ఈ అవస్థయందు ప్రవేశించి యుందుననియు, ఈ స్వప్నసృష్టి నాయొక్క కల్పనయే అనియు, ఇదిసూక్ష్మశరీరమనియు తెలిసికొనజాలడు. ఈజ్ఞానము లేనికారణమున స్వప్నమందు మానవుడు తన కల్పితవ్యాఘ్రము

నకు భయపడి పరుగిడుచున్నాడు. కేకలిడుచున్నాడు. అజ్ఞానులు, మతవిశ్వాసులు మరణించినతరువాత వారి సూక్ష్మశరీరము, స్వప్నావస్థా శరీరముపలె నిరుపయోగమై, అత్యంతశక్తి హీనమగుచున్నది; కల్పితయమదూతలు వానినిపట్టి తీసికొని పోవుదురు, కల్పితఈశ్వరుడు మరియు "ఖుదా" "దోజఖ్" లేదా "నరక"మందు త్రోసివేయుదురు. తమ కల్పితలోకమందు తమచే రచింపబడిన సృష్టియందు వారెందులకు దుఃఖముల ననుభవించుచున్నారు? ఇవి అన్నియు స్వీయకల్పనలని తెలియక పోవుటయే దీనికి కారణము. మతగురువుల ఉపదేశములవలన, మతగ్రంథముల అధ్యయనమువలన ఇట్టి అజ్ఞానాంధకారములో పడి వారు నరకబాధల ననుభవించుచున్నారు.

ఇందువలన సత్యజ్ఞానరహితులై లేదా విపరీతజ్ఞానయుక్తులై మానవులు సూక్ష్మశరీరమును పొందినప్పటికి, తమ ఆత్మలోకమును ప్రవేశించినప్పటికి నరకదుఃఖముల ననుభవించుచున్నారు. మానవులు మతోపదేశకారణమున తన సృష్టియగు ఆత్మలోకమును - పరలోకమని, వైకుంఠమని, విష్ణులోకమని, "ఖుదా" యొక్క "బాదశాహత్" అని భావించి తాముపరాధీనులై దుఃఖితులగుచున్నారు.

పాశ్చాత్యదేశములందు మృతాత్మావాద సంఘములు, సమాజములు ఇపుడు ప్రబలియున్నవి. వీనికి సంబంధించిన వ్యాసములు, సమాచారములు అప్పుడప్పుడు పత్రికలలోకూడ ప్రచు

రింపబడుచున్నవి. అవి ఆ సమాజములయొక్క భాపనలు మాత్రమే అయిఉన్నవి. యదార్థములుకావు! దీనిపై నిష్పక్ష పాతబుద్ధితో ఆలోచించినయెడల చాలమంది విద్యాధికులుకూడ సత్యదూరమగు, భ్రమపూర్ణమగు, సిద్ధాంతములను ప్రచారము చేయుచున్నట్లు మనకు తెలియగలదు. ఈ భ్రమ మానవమస్తిష్కమునుండి బహిష్కరింపబడుటయే మఖ్యావసరమగు చున్నది.

యూరపునందు ఇట్టి పరలోకవిద్యాసంఘము లున్నట్లు చెప్పుచున్నారు. ఇందలి సభ్యులుకొందరు తాము మరణించుటకు ముందు – "మేము మరణించిన తరువాత మీరు మా ఆత్మలను ఆవాహనచేయుడు అపుడు మేము పరలోకరహస్యములను వివ రముగ వర్ణించి చెప్పెదము" అను కోరికలను వెలిబుచ్చుచుం దురు. పారిస్‌నందు పరలోక విద్యాసంఘ సభ్యుడు "మిష్టర్ శామ్‌సన్" మరణమునకుముందు ఆ సంఘాధ్యక్షునకు – "నేను మరణించిన తరువాత ఫీలైనంతత్వరలో నా ఆత్మను ఆవాహన చేసి నాతో సంభాషింపుడు" అని ఒక ఉత్తరమునువ్రాసెను.

"డాక్టర్ ఎలన్‌కార్డెక్" అక్కడమృతాత్మావాదసంఘా ధ్యక్షుడు "మిష్టర్ శామ్‌సన్"కోరిక ననుసరించి కొంతమంది సభ్యులతోకూడి శవసంస్కారమయమునకు అతని (శామ్‌సన్) ఇంటికి వెళ్ళెను. అపుడతడు అతని ఆత్మను ఆవాహనచేసి ఇట్లనెను–"మిష్టర్ శామ్సన్" నీ ఇచ్ఛానుసారముగ నీఆత్మను ఆవాహనచేసి మా కర్తవ్యమును నిర్వహించితిమి"

"ఞామ్సన్"యొక్క ఆత్మ- "భగవంతుడు నాకు తమతో మాట్లాడుటకు అనుమతి నిచ్చినందులకాయనకు ధన్యవాదము లర్పించుచున్నాను. మీరు నాయందు దయచూపినందులకు కృతజ్ఞుడను" అని సమాధానమిచ్చెను.

నిష్పక్షపాతమగు స్వతంత్రబుద్ధితో ఆలోచించినయెడల ఈ సంభాషణ ఎంత అసత్యమైనదో, భ్రమాత్మకమైనదో మీకు చాల తేలికగ అవగతము కాగలదు. ఈవిషయమువలన స్వర్గము లేక పరలోకమందు భగవంతుని ఆజ్ఞ లేకుండ ఎవరి నాలుక కదుపరాదని తెలియవచ్చుచున్నది. ఈ పరతంత్రత నియంత్రృత్వమునకు పరాకాష్ఠ! అతని ఆజ్ఞ లేకుండ సాధారణ విషయములుకూడ మాట్లాడుటకు స్వతంత్రతనీయబాలనపుడు అతనికి భగవంతుడని పిలిపించుకొను అర్హతయుండునా? ఇట్టి దేశము కూడ స్వర్గముకాగలదా?

స్వప్నమందు మన జీవితమిత్రులు, దగ్గరబంధువులు కలియుచున్నారు; మనతో సంభాషించుచున్నారు, కాని నిజముగ వారువచ్చి స్వప్నమందు కలియుటలేదు, మాట్లాడుటలేదు మరియు ఉపదేశించుటలేదు. సమస్తము మన భావనయే! మన ఆత్మయొక్క, సంస్కారములయొక్క ప్రతిరూపములే యగుచున్నవి; ఇదేవిధముగ పై సంఘములకు ఏ మృతాత్మలు లేదా దేవతలువచ్చి సంభాషించుచున్నవో అవి అన్నియు ఈ సంఘ సభ్యుల ఆత్మలయొక్క, భావనలయొక్క సంస్కారప్రతిరూప

ములైయున్నవి; నిజముగ ఆ యాత్మ వచ్చుటలేదు, మాట్లా డుటలేదు. వాస్తవమునకు ఈ సమస్తము పరలోకవిద్యాభి మానుల విశ్వాసముతోకూడిన భావనలయొక్క చమత్కా రము!

కొందరు పరలోకవిద్యాసంఘసభ్యులు - "దేవదూతలు వచ్చి పుణ్యాత్మలను పైకి తీసికొని వెళ్ళిరి" అని చెప్పుచు న్నారు. ఇది మిక్కిలి అసత్యము. ఆత్మవంటి సూక్ష్మవస్తువు ఉదాహరణకు మరియొకటి లేదు. మరణసమయమున ప్రక్కనున్న వారు సూక్ష్మదర్శకయంత్రము నుపయోగించిననుకూడ ఆత్మను చూడజాలరు. ఆత్మ ఊహింపజాలనంతటి సూక్ష్మపదార్థమై యున్నది. ఇట్టి ఆత్మను దేవతలుగాని, యమదూతలుగాని ఎట్లు బంధించి తీసికొనివెళ్ళగలరు?

శరీరమును విడిచినతరువాత ఆత్మవంటి సూక్ష్మవస్తువు క్రింద భూమిపై నిలువజాలదు. ఒక పుల్ల కాలినపుడు దానినుండి బయలుదేరిన పొగ పుల్లనుండి వేరుకాగానే పైకి ఆకాశము వైపునకు ఎగిరిపోగలదు. ఇదేవిధముగ స్థూలశరీరమునుండి విడువడిన ఆత్మను పైకి తీసుకువెళ్ళవలసిన అవసరముండదు. పృథివ్యాకర్షణశక్తినుండివిడువడినచో స్వభావసిద్ధముగనే పైకి లేచిపోగలదు. పొగకన్న ఆత్మ అనేక లక్షలాది కోట్లాదిరెట్లు సూక్ష్మమైయున్నది; అది సూక్ష్మలోకమునకు లేదా సత్యలోక మునకు అత్యంత వేగయుక్తముగ వెళ్ళగలదు; మరణానంతరము

దీనినీ దేవదూతలుపట్టి పైకితీసికొనివెళ్లుదుగని, యమదూతలు పట్టి క్రిందికి తీసికొనివెళ్ళెదరని మతవాదుల కథనమైయున్నది. ఇది అజ్ఞానయుక్తము, కల్పనామాత్రము,అసత్యమునై యున్నది.

మన పురాణసాహిత్యమందు – పైన పిత్రులోకము, దేవ లోకము, విష్ణులోకము మరియు శివలోకాదులున్నట్లు, అచ్చటి కాలమానమునకు, భూలోక కాలమానమునకు చాల భేదమండి యున్నట్లు ఈ దిగువవిధముగ వర్ణింపబడియున్నది.

భూలోకవాసుల 15 రోజులు పితరులకు 12 గం. కాగలదు. మన కృష్ణపక్షమువారికొక రాత్రి; శుక్లపక్షమొక పగలు. మనయొక్క 6 మాసముల కాలము దేవతలకు పండ్రెండుగంటల సమయముతో సమానము. బ్రహ్మయొక్క కాలమానము మరియు విచిత్రముగనుండును. తనకు నాలుగువేల యుగములు గతించినయెడల బ్రహ్మకొకదినము గడిచినట్లుండును. బ్రహ్మ యొక్క వేయి యుగములు విష్ణువుకు ఒక ఘడియకాగలదు. విష్ణువుయొక్క వేయి యుగములు ఈశ్వరునకొక క్షణము. ఇది ఎంతటి ఆశ్చర్యకరమగు విషయము!

ప్రపంచమున "దేశము" "కాలము" అని రెండు విభాగములు కలవు. ఇపుడు కాలమునుగురించి వివరించెదను. జగత్తే సత్యమని నమ్మువారు ద్వైతవాదులు ఈ కాలము నభిమానింతురు; కాని నిజమునకిది ఆత్మయొక్క కల్పనమాత్రమే!

ఒక వ్యక్తి మానసికముగ, దైహికముగ గొప్పసంతో

షమును, ఆనందమును పొందినపుడు ఆ సమయమందలి రాత్రిం బవళ్లు చాల చిన్నవిగతోచును; ఇదేవిధముగ దుఃఖపురాత్రులు చాల పొడవై పెద్దవిగ తోచుచుండును.

ఇహలోకమందే ఉత్తరధ్రువమున ఆరుమాసములు పగలు, ఆరుమాసములు రాత్రిగనుండును. సూర్యమండలమందలి వరుణ లోకమందు ప్రాణులున్నయెడల అక్కడ ఒక సంవత్సరమునకు, భూలోకమందలి 180 సంవత్సరములు సమానమని యూగోపియన్ జ్యోతిష్కులు చెప్పచున్నారు. ఇదేవిధముగ అనేకగ్రహములయొక్క సంవత్సరములు, మన సంవత్సరములకన్న చాల పెద్దవిగ నుండును.

భూలోకమందుకూడ జాగ్రదవస్థాసమయమునకు, నిద్రావస్థాసమయమునకు చాల భేదముండియున్నది. కలకత్తాలో ఒక వ్యక్తి నిద్రారోగ్రస్తుడై ఒక మాసమువరకు నిద్రించుచునే యుండెను. కాని అతడు నిద్ర మేల్కాంచినపుడు కేవలము ఒక గంటమాత్రమే గడచినట్లతనికి తోచెను. వాస్తవమునకు ఒక మాసము గతించియుండెను, అతడు పరుండియున్నందున అతడట్లు భావించియున్నాడని, ఇదియుక్తియుక్తముకాదని మీరెట్లు చెప్పచున్నారో అదేవిధముగ అతడు – "మీరు మేల్కొనియున్నందున అట్లు భావించితిరి; వాస్తవముగ ఒక గంటయే గతించినది" అని చెప్పును. కారణము ఇద్దరియందుకలదు, అతనికి నిద్రకారణమైతే మరియొకనికి జాగ్రదవస్థకారణమైయున్నది.

కావున ఇద్దరిది సరిగాదనిచెప్పవచ్చును. ఇదియొక సంఘటన ఇట్టివి అనేకములుజరుగుచుండును;స్వప్నమందిట్టివిచాలజరుగుచున్నట్లు మనకు తెలియును. స్వప్నమందు - ఒక ప్రదేశమునకు వెళ్ళినట్లు అక్కడ కొన్నిమాసము లుండియున్నట్లు మనకు కనుపించును; ఒక స్నేహితుని కలిసికొనుటకు లేచివెళ్ళినట్లుతోచును. నిద్ర మేల్కొనెను. మంచముపై పరుండియేయుండెను. గడియారము 11 గంటలు కొట్టెను; కేవలము ఒక గంటమాత్రమే అతడు స్వప్నమందుండియుండెను. కాని అక్కడ స్వప్నమందు అనేక మాసములు గతించిపోయెను.

దీనికి కారణము?-జాగ్రదవస్థ స్వప్నావస్థలయందీభేదము గలదు. మనము జాగ్రదవస్థలో పనిచేయించుకొను ఇంద్రియములతో స్వప్నావస్థయందు పనిచేయించుకొనజాలము. జాగ్రదవస్థయందలి స్థూలఇంద్రియములు స్వప్నమందు పనికిరావు. ఈకారణమువలన జాగ్రత్ స్వప్నావస్థలయందు కల్పనలో భేదముదయించుచున్నది. స్వప్నకారణమున ఒక క్షణము అనేక మాసములతో సమానముగ తోచుచున్నది. అదేవిధముగ మేల్కొనిన కారణమున స్వప్నమందలి అనేక మాసములు ఒక క్షణముతో సమానముగ తోచుచుండును. కారణము రెంటియందును గోచరించుచున్నవి. వాస్తవమునకు కాలమొక వస్తువు కాదు. కాలవిభాగము భూతభవిష్యద్వ్యాపముగ విభజింపబడుచున్నది. ఇదికూడ కల్పనామాత్రమే యగుచున్నది; ఇందు వాస్తవికతలేదు.

తన ఇంద్రియములు ఇపుడున్నట్లుకాక మరియొకవిధముగ నున్నను, సూర్యుడు భూమికి దూరమైనను లేదా దగ్గరైనను మన కాలమానపరిస్థితికి సంబంధించిన కల్పన మరియొకవిధముగ ఉండియుండునని విద్వాంసులు, వైజ్ఞానికులు గ్రహించియున్నారు.

కాంతివేగము సెకనుకు 186000 మైళ్ల వేగము కలిగి యున్నదని శాస్త్రజ్ఞులు చెప్పుచున్నారు. కాంతివేగముకన్న శబ్దవేగము తక్కువయగుచున్నది. మనకు దూరమున వేటగాడు తుపాకీని పేల్చియున్నాడు. తుపాకీపొగ ముందు మనకు గోచరించును; తరువాత ధ్వని వినిపించగలదు. తుపాకీధ్వని మనకు నాలుగు సెకనుల తరువాత వినిపించెను. వేటగానికి అదే సంఘటనయొక్క ధ్వని ఒక సెకను తేడాలో మాత్రమే వినిపించెను, మనకది భూతకాలమయ్యెను. వేటగానికి భవిష్యత్కాలమయ్యెను. ఎక్కువ దూరమున్నయెడల ఎక్కువ అంతర మేర్పడును.

అయినప్పటికి కాంతి సెకనుకు 186000 మైళ్ళవేగమును కలిగియున్నది. చాల నక్షత్రలోకములు మన భూమికంటె బహు దూరమందుండియున్నవి. అక్కడనుండి బయలుదేరిన వాని కాంతికిరణము భూలోకమునకు చేరునప్పటికి నాలుగు లేక అయిదువేల సంవత్సరముల కాలము పట్టగలదు. ప్రతినక్షత్రము ఒకొక్కలోకమైయున్నది. అక్కడకూడ మానవులుండియుండి వారు ఏదైన ఒక యంత్రసహాయముతో మన భూలోకమందలి సంఘటనలను చూడగలిగినయెడల ఈ సమయమున వారు ఇక్కడ కురుక్షేత్రమందు కౌరవపాండవ యుద్ధము జరుగు

చున్నట్లు చూడగలిగియుందురు; వారీసమయమున స్వతంత్ర భారతదేశమును చూడజాలకపోవుదురు. ఎందువలన? ఈ సమయమున ఇక్కడ జరుగుచున్న సంఘటనలు నక్షత్రలోకములకు అయిదువేల సంవత్సరముల తరువాత అక్కడకుచేరి వారికి గోచరింపగలవు. ఏ సంఘటన పితృపితామహులకుకూడ అతీతమగు భూతకాలగర్భమందు జరిగియున్నదో అదియే ఇతరలోకవాసులకు వర్తమానమువలె కనుపించగలదని స్పష్టమగుచున్నది. నేటి జ్యోతిష్కులు ఏవైన నూతన నక్షత్రము లుద్భవించినట్లు గుర్తించినచో అవి ఆరువేల సంవత్సరములకుపూర్వమే అక్కడ పుట్టియుండగలవు. ఇందువలన ఈ ప్రపంచపు భూతభవిష్యద్వర్తమానకాలములు మూడున్ను మానవుని కల్పనమాత్రమే అయి ఉన్నది; ఇందేమియు వాస్తవికత గోచరింపదు. ఈ సమస్తము చేతన ఆత్మయొక్క కల్పనయే! ఇహలోకమందు మానవుని యొక్క పండ్రెండు గంటలలో చిన్నచిన్న కీటకములయొక్క పూర్తి ఆయుర్దాయము సమాప్తమైపోవుచున్నది; ఇక్కడ కొన్ని జీవులు ఉదయమున పుట్టి సాయంత్రము మరణించుచున్నవి. వారికి మనయొక్క ఒక రోజు అనేక సంవత్సరములతో సమానము. మన ఇంద్రియములు ఇపుడున్నరూపమున లేకుండినయెడల మనరోజు మనకు ఒక రోజుగ ఉండియుండదు.

దేనిని మనము పగలని భావించుచున్నామో అదియే చాలజీవులకు అంధకారబంధురమై రాత్రితుల్యముగనుండగలదు.

చాలజీవులు రాత్రిసి పగటియందువలె చూచుచున్నవి. సూర్యోదయమగుటతోడనే మనకు ఒక తేజఃపుంజము ప్రత్యక్షమగుచున్నది. గబ్బిలము, గుడ్లగూబకు ఈ తేజఃపుంజము అంధకారమయముగతోచును. ఈ భారతదేశమందే మదరాసు,కలకత్తాల మధ్య కాలము (టయిము) వ్యత్యాసముగనుండును. అమెరికా భారతదేశములమధ్య కాలవ్యత్యాసము 11 గంటలు ఉండియున్నది. కావున కాలము మానవునికల్పనయే యగుచున్నది.

కాలమునుగురించి ఇంత ఎందులకు వ్రాయవలసివచ్చినదనిన:- సూక్ష్మలోక సమయమునకు, భూలోక సమయమునకు చాల వ్యత్యాసముండియున్నదని ఆత్మజ్ఞానులు చెప్పుచున్నారు. భూలోక కాలముకన్న సూక్ష్మలోక కాలమానము చాల పెద్దదిగనుండగలదు. ఇందువలన మృతాత్మలు మరణించిన తరువాత ఎంత త్వరగ పునర్జన్మను పొందగలిగినను వందలాది సంవత్సరములుగతింపగలవు. యోగులు, ఆత్మజ్ఞానులు వేలాది లక్షలాది, సంవత్సరములు సూక్ష్మలోకమందు గడిపెదరు; వారికా సంవత్సరములు దీర్ఘములుగ తోచవు! అట్టివారికి భూలోకవాసులనుద్ధరించుకోరిక కలిగినపుడే ఇహలోకమున కవతరించుచుందురు.

సూక్ష్మశరీర పరిచయము లేకుండుట, ఆత్మకన్న భిన్నడగు మరియొక ఈశ్వరుని అస్తిత్వము నంగీకరించుట చాల అజ్ఞానము. అట్టి ఈశ్వరుని అస్తిత్వము నంగీకరించుటవలన - స్వర్గనరకములను, బహిస్తును, యమధర్మరాజును, యమదూతలనుకూడ అంగీకరింపవలసియుండును. ఇది వ్యర్థము. సూక్ష్మ

శరీరము ఆకాశముకన్న, ఈథరుకన్నకూడ సూక్ష్మతమమై యున్నది. కావున సూక్ష్మశరీరము నెవరు బంధింపజాలరు. తన కల్పనమాత్రమే. కల్పిత యముడు, యమదూతలు, కల్పిత ఈశ్వరుడుమాత్రమే బంధింపగలరు! సూక్ష్మశరీర సూక్ష్మలోక ఆత్మతత్వములయొక్క నిజజ్ఞానము కలిగినంతనే పై నుదహరింప బడిన కల్పితవస్తువులు జ్ఞానియొక్క హృదయమునుండి వెడలి పోవుటవలన అతనికి ఆత్మజ్ఞానము కలుగుటచే నిర్భయుడై మన గలడు.

దయామయుడగు మరియొక ఈశ్వరుడు ఎక్కడనోఉండి సమస్తలోకముల పరిపాలించుచు, మానవులుచేయు పాపపుణ్య కర్మలయొక్క ఫలములను అతడే వారిచే అనుభవింపజేయు చున్నారని మతవాదుల కథనము. మానవులుచేయు పాపపుణ్య కర్మఫలముల జమాఖర్చులను వ్రాసియుంచి, వానిని వారిచే అనుభవింపజేయుట సాధ్యమా? ఇది అసంభవము! ఇట్టి కల్పిత ఈశ్వర అస్తిత్వభావము విగ్రహారాధనకన్న అజ్ఞానమయము, నిరుపయోగమునైయున్నది. సూక్ష్మలోకము మనోమయమై యున్నందున అక్కడ అజ్ఞానయుక్త మృతాత్మలు కల్పితఈశ్వ రునివలన బంధనయుక్తములై బాధలననుభవింపగలవు. ఉపని షత్తులయందు, ప్రధాన ఆధ్యాత్మిక గ్రంథములందు, ఆత్మకన్న వేరగు మరియొక కల్పితఈశ్వరుడు కలడన్న భావమెక్కడను గోచరించుటలేదు; ఇంతియేగాకుండ "ఆత్మయే ఈశ్వరుడు" అను

ప్రమాణములెన్నియో గోచరించుచున్నవి. ఈ కల్పిత ఈశ్వర భావము పురాణ సాహిత్యకాలమున ప్రబలమై ప్రచారమునకు వచ్చియున్నట్లు తోచుచున్నది; ఇట్టి కల్పిత ఈశ్వరునిగురించి కొంతవరకిచట ప్రస్తావించుట సమంజసమని భావించుచున్నాను.

పుణ్యకర్మగాని, పాపకర్మగాని చేయుటకు మానవుడే కర్తయై యున్నందున దాని ఫలము ననుభవించుట కతడు బాధ్యుడై యుండును. "అనుభవింపచేయు వారెవరు?" అను ప్రశ్న ఉదయింపగలదు. పాపపుణ్యకర్మఫలములను మానవులచే అనుభవింపజేయుటకు ఆత్మరూపియగు ఈశ్వరునకే సాధ్యపడ గలదు. పాపపుణ్యకర్మలచేయునపుడు వాని స్వభావ స్వరూప ములు సంస్కారరూపమున మానవుని విజ్ఞానమయకోశమందు అంకితమై స్థిరపడియుండును. సమయమాసన్నమైనపుడు మానవు డట్టి శుభాశుభ ఫలముల ననుభవించుటకు ఆత్మప్రేరితుడై అవశ్యము బాధ్యుడై యుండును. ఆత్మకుమారుపేరే ఈశ్వరుడు.

(1) శ్లో॥ పూర్వజన్మకృతం కర్మ దైవ మిత్యుచ్యతే బుధైః।
తస్మాత్ పురుషకారేణ యత్నం కుర్యాదతంద్రితః॥
(సూక్తిముక్తావళి)

(2) శ్లో॥ స్వమేవకర్మ దైవాఖ్యం విద్ధి దేహాంతరార్జితమ్।
తస్మాత్ పౌరుషమేవాగ్ర్యమాహుర్మనీషిణః॥
(హితోపదేశము)

(1) పూర్వజన్మమందు చేయబడిన కర్మ విద్యాంసు

లచే "దైవము" అని చెప్పబడుచున్నది. ఈ జన్మమున చేయ బడు కర్మయే ముందుజన్మయందు అనుభవయోగ్యమగుటవలన ప్రయత్నపూర్వకముగ ఇపుడు మానవుడు సత్కర్మనాచరింప వలసియున్నదని భావము.

(2) పూర్వజన్మార్జితమగు స్వీయకర్మయే "దైవము" అని తెలిసికొనుము. అందువలన ఇహలోకమందు పురుషకార ముతో చేయబడు సత్కర్మయే శ్రేష్ఠమని బుద్ధిమంతులు చెప్పు చున్నారు.

పూర్వజన్మకృతమగు కర్మకు "దైవము"అను పేరున్నం దున అజ్ఞానులగు మానవులు, మతవాదులు ఇహలోకమందనుభ వించు కర్మఫలములను కల్పితదైవమే అనుభవింపచేయుచున్నా డని తామువిశ్వసించుచు,ఇతరులనునమ్మించుటకు ప్రయత్నించు చున్నారు. కర్మఫలముల ననుభవింపజేయుటకు ఆత్మకన్న వేరగు ఇతర ఈశ్వరుడుండవలసిన అవుసరము లేదు. ఇందునుగురించి ఈ గ్రంధమందే ఇంతకు పూర్వము విపులముగ వివరింపబడినది.

సమిష్ట్యాత్మ (విశ్వాత్మ) యే ఈశ్వరుడు. అతని అంశమే మానవాత్మ లేక జీవుడు. కావున విశ్వాత్మకుగలసమస్తశక్తులు మానవాత్మయందు నిహితమైయున్నట్లు, జలబిందువునందు జల శక్తులన్నియు కూడియున్నట్లు, మానవాత్మయందు విశ్వాత్మ యొక్క శక్తులన్నియు నిహితమైయుండును. విశ్వాత్మయే పరమాత్మ!

శైవులు శివలోకమందు శివుడున్నట్లు, వైష్ణవులు విష్ణు లోకమున విష్ణువున్నట్లు, మహమ్మదీయులు "బహిస్తు" నందు ఖుదా అన్నట్లు భావించి, మరణానంతరమున శివలోక విష్ణులోక బహిస్తులకు వెళ్ళగలమని విశ్వసించుచున్నారు. వారు దీనిని నిజమని భావించినను సమంజసముగనుండదు. అట్టి లోకములు ఆకాశమున, సూక్ష్మలోకమున ఉండగల అవకాశమే లేదు. ఒక వేళ ఉండియున్నను "బహిస్తు"నందు ఖుదాయొక్క రాజ్య ముండును. స్వరాజ్యము మాత్రముకాదు! శివలోక విష్ణులోక వైకుంఠాది మతవాదలోకములన్నియు పరలోకములే! అట్టి లోకములకు శివకేశవులే అధిపతులైయుందురు. పరలోకము నకు, పరదేశమునకు వెళ్ళి ఏ ప్రాణియు సుఖింపజాలదు. సుఖాను భూతిగల ప్రదేశమే స్వదేశమగుచున్నది. దీనినే ఆత్మలోకమం దురు. ఆత్మజ్ఞానులు, యోగులు ఆనందదాయకమగు, ముక్తి ప్రదమగు ఆత్మలోకమును పొందగలుగుచున్నారు.

శ్లో॥ శ్లోకార్ధేన ప్రవక్ష్యామి యదుక్తం గ్రంథకోటిభిః।
బ్రహ్మ సత్యం జగన్మిథ్యా జీవోబ్రహ్మైవనా పరః॥
(సూక్తిముక్తావళి)

కోటిగ్రంథములందు చెప్పబడిన సారవాక్యమును ఒక అర్ధశ్లోకముతో చెప్పుచున్నాను. బ్రహ్మమే సత్యము, జగత్తు మిథ్య, జీవుడే బ్రహ్మము, ఇతరమగు భగవంతుడెవడును లేరు. అని భావము.

అత్యంత సత్యమగు ఈ ఆత్మపేరే బ్రహ్మము; మతఈశ్వరుడు మతవాదులచే కల్పింపబడెను. అట్టి ఈశ్వరుడెక్కడును లేడు. అందరి ఈశ్వరుడు, అందరి పాలనకర్త, అందరి భాగ్యవిధాత - అందరియొక్క హృదయాలయములందే నివసించియున్నాడు; అతనిపేరే జీవుడు, ఆత్మ, బ్రహ్మము మరియు ఈశ్వరుడుకూడనై యున్నాడు. స్మృతి.

మానవుడు రెండు చేతులను కలిగియున్నను, కల్పిత ఈశ్వర గౌరవార్థము అతనికి నాలుగు చేతులున్నట్లు భావించుచున్నాడు; తాను ఒక ముఖమును కలిగియున్నను మూడు, నాలుగు, అయిదు ముఖములు కలవానిగ అతని సంగీకరించుచున్నాడు; ఇట్టి సాకారఈశ్వరవాదఖండనము క్రమక్రమముగ అధికము కాజొచ్చినందున, అతనిని నిరాకారుడని, నిర్వికారుడని, సమస్తశక్తిమయుడని మరియు సర్వజ్ఞుడని మతవాదియగు మానవుడు ప్రచారము చేయసాగెను; అతనిముందు తన్ను తుచ్ఛునిగ భావింపసాగెను. నిరాకార నిర్వికారాది విశేషణములన్నియు ఆత్మరూపియగు ఈశ్వరునకే వర్తింపగలవు. నిజమగు ఈశ్వరాలయముమానవదేహమే! శ్లో॥'ఈశ్వరస్సర్వభూతానాం హృద్దేశేర్జున తిష్ఠతి' (గీత 18-61) సమస్త ప్రాణుల హృదయప్రదేశమందే ఈశ్వరుడుండియున్నాడని భావము. ఈ గీతాప్రవచనముకూడ పైవిషయమునే ధృవపర్చుచున్నది.

మానవునియొక్క, మానవలోకముయొక్క గొప్పతన

మును గుర్తింపుడు - దేవరాజగు ఇంద్రుడు, దిక్పాలురు, విష్ణువు ఆదిగాగలవారందరూ దేవయోని సంభూతులై దేవలోకనివాసులైయున్నట్లు చెప్పచున్నారు. వీరందరు దేవయోనిసంభూతులైయుండగ రావణాది రాక్షసులను సంహరింపజాలకపోయిరి. ఆ విష్ణువే శ్రీరాముసిగ అవతరించి రావణసంహారము చేయగలిగెను. ఇంద్రాదిదేవతలు, శ్రీవిష్ణువు దేవయోని సంభూతులని చెప్పచున్నారు. మానవులకన్న దేవతలు సర్వవిధముల శక్తి సంపన్నులుగదా! వారికి రావణాది రాక్షససంహారము అసాధ్యమనుట అసందర్భముగనుండును. ఇదువలన దేవలోకముగాని, పైనుదహరింపబడు దేవతలుగాని మరి ఎక్కడనో ఉన్నట్లు మతవాదుల భ్రమమాత్రమే యగుచున్నది. దేవదానవులు, మానవులు అందరు భూలోకవాసులే! దేవీదేవతలు, కల్పిత ఈశ్వరుడు పైన మరియొక లోకమున లేనేలేరని ధృవపడుచున్నది.

రావణాది రాక్షసులు భూలోకవాసులే! మానవులైయుండికూడ అతీక్రూరకర్ములైయున్నందున రాక్షసులని పిలువబడియుండిరి. రావణుడు భూలోకమునుండి దేవలోకమునకు దండెత్తి వెళ్ళి, ఇంద్రాదిదేవతలను జయించి బంధించినట్లు పురాణేతిహాసములు చెప్పచున్నవి. ఒకవేళ ఇంద్రలోకము సూక్ష్మలోకమైయుండవచ్చునని భావించినను స్థూలప్రపంచమునుండి, స్థూలశరీరముతో రావణాదులు అక్కడకుపోయి దండెత్తుట

సంభవమా? ఇందువలన దేవీదేవతలు, కల్పితఈశ్వరుడు పైన మరియొకలోకమున లేనేలేరని ధృవపడుచున్నవి; వీరందరు భూలోకవాసులే అయిఉండవచ్చునని తోచుచున్నది.

తమ, తమ విశ్వాసముతో తమ, తమ బుద్ధిననుసరించి, మానవులు తమ, తమ భగవంతుని నిశ్చయించుకొనుచున్నారు. సమస్తము ఆత్మకల్పనయే! భగవంతుడుకూడ ఆత్మతో చేయ బడినవాడే!! ఏ స్వరూపమును, ఏ విగ్రహమును మీరు భగ వంతుడని అంగీకరించియున్నారో దానికి - "నేను భగవంతు డను" అని తెలియదు. మీకేదైన ఫలము లభించేయెడల అది ఆ విగ్రహమువలనమాత్రముకాదు; మీ అంతరాత్మయందలి విశ్వాసముయొక్క ఫలము! జరిగినదంతయు ఆత్మబలమువల్లనే జరిగినది. స్వామి శ్రీ వివేకానందులుకూడ ఈ భావమునే అంగీ కరించియున్నారు విగ్రహముకన్న సద్గురువు మేలు, సద్గురువు చేతనము. విగ్రహరూపియగు ఈశ్వరునివల్లనే కొంతఫలము పొందుచున్నపుడు చేతనమగు సద్గురు ఆశీర్వచనమువలన మానవులెందులకు ఫలమును పొందజాలరు?

ప్రపంచమందలి సమస్త పదార్థములు జడచేతనములని రెండుగ విభజింపబడియున్నవి. ప్రపంచమంతయు జడచేతన మయమే! మూడవపదార్థము లేనేలేదు. కావున ప్రజలు ఆత్మ కన్న వేరగు మరియొకచేతనమును కల్పించుకొనుచున్నారు; దానికి ఈశ్వరుడని పేరుపెట్టుకొనిరి; అట్టి ఈశ్వరుని సర్వజ్ఞుడని,

సర్వశక్తిమంతుడని, సృష్టికర్తయనికూడ భావించుచున్నాను. నిజమగు సృష్టికర్త ఆత్మయే! ఈశ్వరుడుకాడు!! "నేను" అనుదానికి సమస్తమునితరమే! అన్నివిధముల స్వకీయము నీఆత్మయే! కావున తన "స్వ" యొక్క "తంత్రత"యే స్వతంత్రత.

మానవుడు తన భావనాకల్పనలతోను మరియు బుద్ధితోను ఒక అద్భుతమగు ఈశ్వరుని రచించుకొనియున్నాడు; మానవుడు మానవున కే తండ్రికాదు, ఈశ్వరునికికూడ తండ్రియై యున్నాడు. ఈ ప్రపంచమందలి సాకార నిరాకార ఈశ్వరులందరికి మానవుడే సృష్టికర్తయైయున్నాడు; సాకార ఈశ్వర భావము మానవ మస్తిష్కసంజాతమైనదే! కావున సమస్తమునకు మానవుడే తండ్రియైయున్నాడు.

శ్రీరాముని తండ్రి దశరథుడు మానవుడు, శ్రీకృష్ణునితండ్రి వసుదేవుడు మానవుడు, బుద్ధభగవానునితండ్రి మానవుడు, మహమ్మదు, ఏసుయొక్క తండ్రులు మానవులు, వ్యాసవసిష్టాది ఋషులయొక్క తండ్రులుకూడ మానవులే! గుళ్లు, గోపురములు, మసీదులు మరియు చర్చిలు వానియందలి విగ్రహాదులు ఈశ్వర నిర్మితములుకావు, మానవనిర్మితములే! దేవుడు, దేవాలయములు దేవీదేవతలను మానవుడు తన లాభార్జనకు నిర్మించుకొనియున్నాడు; ఈశ్వరునికొరకుకాదు! ఆ మూర్తిని ఈశ్వరుడని మానవుడే భావించుచున్నారు; కాని ఆ విగ్రహము - "నేను ఈశ్వరుడను" అని తెలిసికొనజాలకున్నది.

ఆత్మ అనగ జీవాత్మడని భావింపవలసియున్నది. జీవాత్మకు మారుపేరే ఈశ్వరుడు. సర్వమానవహృదయాంతరములందును - "నేనున్నాను" అను జ్ఞానము నిండియుండును. ఈ అంతర్గతమగు "నేను", చేతనస్వరూపియగు "నేను", నిజజ్ఞానస్వరూపియగు "నేను" అను దానిపేరే బ్రహ్మము లేదా ఈశ్వరుడు. ఈ క్రింది మహావాక్యమును పరికింపుడు - "అహం బ్రహ్మాస్మి" అనగా నేనే బ్రహ్మను; నేనే ఈశ్వరుడను. నేనే గొప్పదానికన్న గొప్పవాడను అని భావము. ఈ ఆత్మయే సమస్త సృష్టికి రచయిత! ఇట్టిస్థితిలో ఆత్మయే లేదని భావించినయెడల - "ఇది ప్రపంచము" అనే అనుభవమును పొందునదెవరు? ఈ ప్రపంచమున్నట్లు ప్రమాణమేమి? ఇది ప్రపంచమని చెప్పినదెవరు? అయితే ఈ జడప్రపంచము ఆత్మలేకుండ తన్ను తాను తెలిసికొనజాలదు. కావున ప్రపంచపు అస్తిత్వము ప్రపంచార్గతమందులేదు; ఆత్మయందే కలదు. ప్రపంచమాత్మయొక్క కల్పనము; తనదిమాత్రముకాదు. కావున సమస్త ప్రపంచరచయిత ఆత్మయే! ఆత్మకు భిన్నుడగు మరియొక కల్పిత ఈశ్వరుడుమరియొక్కడను లేడు అను ఈవిషయమును గీత, ఉపనిషత్తులు మరియు ఇతర ఆధ్యాత్మిక గ్రంధములుకూడ ధృవపర్చుచున్నవి. ఆత్మయే ఏకైక ఈశ్వరుడనుటకు అనేక ప్రమాణములుండియున్నవి. అందొకదాని నీక్రింద నుదహరించుచున్నాను.

ఈ పృధివికి లేక సమస్త ప్రపంచమునకు కేంద్రము

మనము కూర్చున్నచోటనే ఉండియున్నది. మనమున్నచోటు నుండి నలువైపుల కొలిచినయెడల సమానమగు కొలతయే రాగలదు. భూమి గోళాకారము కలిగియున్నందున మనము కూర్చున్నప్రదేశమే కేంద్రము కాగలుగుచున్నది. కొంతదూర దృష్టితో ఆలోచించినయెడల ఈ సమస్య విడిపోగలదు. ఈ భూమియేకాదు; సమస్త ప్రపంచము గోళాకారమే! అంతియేకాదు; ప్రపంచమందలి ప్రతికాన్యము గుండ్రముగనే యుండును. మానవుడొకచోటనుండి సూటిగ బయలుదేరి పయనించినయెడల ఏదో ఒకరోజునకు బయలుదేరినచోటునకే తిరిగి రాగలడు.

ఈ సృష్టిలో సమస్త విషయములకు ఈ విధానమే వర్తింపగలదు. మీరు చెడు ఆలోచనలను ఇతరులపై ప్రసరింప జేసినప్రుడు తుదకవి తిరిగివచ్చి మీపైనే పడగలవు. అట్లే ఈశ్వరాన్వేషణముకొరకు మీరు ఏదో ఒక దిశకు బయలు దేరినయెడల తుదకు మీరున్నచోటునకే మీరు చేరుకొనగలరు ఈశ్వరాన్వేషణము మనసుచేత, భావనలచేత జరుగుచుండును; మానవుని మనసు భావనావాయుయానమందధిరోహించి పయనింపగలదు. తుదకెక్కడనుండి బయలుదేరినదో అక్కడకే చేరగలదు; తాను బయలుదేరినచోటనే, కేంద్రప్రదేశమందే ఈశ్వరుని పొందగలదు. మనోభావనలు ఎక్కడనుండి బయలుదేరినవి? కేంద్రమునుండి, ఈ కేంద్రమే మనోభావనలకు ఉత్పత్తి

స్థానమైయున్నది; ఇదియే నిరాకారబిందువగు ఆత్మ! కావున ఇదియే ఈశ్వరుడు. కేంద్రముయొక్క ఆత్మబిందువు నిరాకారమై నిర్వికారమైయున్నది. ఆత్మ చేతనమైన కారణమున ఒక శక్తి వంతమగు తత్వము! శక్తినుండి చలనముత్పత్తియగుచున్నది. శక్తియందు గమనమున్నది: గమనమందు శక్తియున్నది.

మతవాదుల కథనప్రకారము కర్మఫలముల ననుభవింప జేయుటకు మరియొక ఈశ్వరవ్యక్తి అవుసరమేమియు నుండదు. కర్మఫలము కర్మతోనే అంటియుండును. ప్రతివ్యక్తి తానుచేసిన కర్మఫలమును తానేఅనుభవింపవలసియుండును, "యత్క్రియతే తత్కర్మ" ఏదిచేయబడునో అదియేకర్మయని చెప్పబడుచున్నది. ఎవడు కర్మచేయునో అతడే తత్కర్మఫలము ననుభవించి తీరవలయును.

కాలు జారిపడుట ఒక కర్మ, దెబ్బతగులుట దానిఫలము; ఇది దానినంటియేయుండును. ఇందు ఈశ్వరప్రమేయమేమియు నుండదు నడచుట ఒక కర్మ, అలసిపోవుట దానిఫలము. దీనికి ఈశ్వరుని పనిలేదు. మామిడిఫలము మామిడిచెట్టు నంటియే యుండును. కర్మఫలమును ఈశ్వరుడీయజాలడు. ఏతత్ వ్యతిరిక్త సూక్తులన్నియు మతవాదుల మాయమాటలుగాని, అజ్ఞానప్రవచనములుగాని అయియుండును. ప్రతిమానవునకు తన కర్మఫలానుసారము ధనదారిద్ర్యములు, ఆరోగ్యానారోగ్యములు, జ్ఞానాజ్ఞానములు మరియు ఉన్నతి అవనతులు కలుగుచుండును. ఇందు ఈశ్వరప్రమేయముండదు.

నిత్యము మన శరీరమందు జరుగు శ్వాసప్రక్రియ, రక్త ప్రసారము, నిమీలనోన్మీలనము మరియు హృదయస్పందనము ఇవి అన్నియు ఈశ్వరమూలమునవే జరుగుచున్నట్లు మతవాదులు చెప్పుచున్నారు; ఈశ్వరుని సర్వాంతర్యామి అనికూడ చెప్పుదురు. ఈశ్వరుడు సర్వవ్యాపియగునెడల శవశరీరమందు, నిర్జీవమందుకూడ నుండవలయును. మృతశరీరమందు జీవుడు లేని కారణమున శ్వాస నడుచుట, హృదయగమన రక్తసంచారాది కములుకూడ జరుగవు జీవుడు వెడలిపోయినతరువాత పై సమస్త క్రియలు ఎందులకాగిపోవుచున్నవి? దేహమందప్పుడు పై ప్రక్రియలను నడుపు గతి ప్రదాతయగు జీవుడు లేడు.

కావున దీనియొక్క ఉనికిపలన సమస్త క్రియలు జరుగుచున్నవో, ఏదిలేనప్పుడు అవి అన్నియు లేకుండపోవుచున్నవో అట్టి జీవుడే పై ప్రక్రియలను కలుగజేసి మన దేహరక్షణచేయుచున్నాడు. మన రక్షకుడు జీవుడా? లేక ఈశ్వరుడా? జీవుడనియే చెప్పవలసియుండును కావున ఈ పరిస్థితిలో మన శరీర సంరక్షకుడు ఈశ్వరుడైనప్పుడు ఆ ఈశ్వరుడే ఈజీవుడు; ఇతరుడెవడును కాడు! మతవాదప్రోక్తుడగు ఈశ్వరుడు లేనేలేడు; ఉండజాలడు కూడ! సమస్తైశ్వర్యవంతుడగు పురుషునికూడ ఈశ్వరుడన వచ్చును. కావున ఈశ్వరశబ్దముకూడ మనుష్యవిశేషునియొక్క పేరగుచున్నది; మానవునికన్న వేరగు మతఈశ్వరుడుమరియొకడు లేడు. ఆత్మను - ఐశ్వర్యవంతమగుటవలన ఈశ్వరుడు ప్రతిశరీర

మును నడుపుచున్నందువలన ప్రేరకుడని, యజమానియగుట వలన ప్రభువని, సమస్తశరీరాంగములను రక్షించుచుండుటవలన రక్షకుడని మరియు పాలనకర్తయగుటవలన పరమపితయని విశేషణయుక్తముగ చెప్పవచ్చును. కనుక ఈ ఆత్మయే ఉపాస్య దేవతగా అంగీకరింప తగిన వస్తువెయున్నది; మతఈశ్వరుడు మాత్రముకాడు!

మత

తమ ఈశ్వరు నంగీకరించు మతవాదులు - ఈశ్వరుడు ఆర్తత్రాణపరాయణుడని, దుర్బలసంరక్షకుడని చెప్పుచున్నారు. కావున ప్రపంచమున తద్వ్యతిరేకముగనే జరుగుచున్నది. నిత్యము లక్షలాది, కోట్లాది జలచరముల (చేపల)ను పట్టి బలవన్మరణమునకు పాలుచేయుచున్నారు; గజేంద్రుని మకరమునుండి రక్షించిన మహావిష్ణుడిపుడు లేడా? ప్రపంచమున సమస్తానర్థములకు, రక్తపాతములకు మరియు మహాయుద్ధములకు మతమే ముఖ్యకారణమైయున్నది.

పాకిస్తానమందు హిందువులను, భారతదేశమందు ముహమ్మదీయులను మతవాక్యముతో, మతోన్మాదముతో నానాహింసల పాలుజేసి, లజ్జాకరములగు అకృత్యముల నెన్నిటినో మతవాదులు చేసియున్నారు. పాకిస్తానమందు అనేక వేలమంది భక్తులు చంపబడిరి; స్త్రీలను వివస్త్రలనుచేసి చేతులనుబంధించి పశువులవలె మందలు, మందలుగ తీధులవెంట ఊరేగించి యున్నారు; అపుడాస్త్రీలు భగవంతుని అనేకవిధములప్రార్థించి

యుండిరి. అప్రదు - ద్రౌపదీమానసంరక్షణచేసిన శ్రీకృష్ణుడేమైనాడు? ఎక్కడనున్నాడు? ఖుదా ప్రత్యక్షమై ఇది అన్యాయమని, అక్రమమని చెప్పలేదు! హైందవభగవంతుడు ప్రత్యక్షమై తన భక్తులను రక్షింపలేదు. పురాణగాథలప్రకారము పూర్వము సంభవమైన కార్యము ఇపుడెందులకు సంభవముకాదు? మత వాదభక్తులు పూర్వము ఇప్రుడుకూడ ఉండియున్నారు. ఇప్పటి కన్న పూర్వము అధికశాతముండవచ్చును. కావున ఇపుడసలే లేరని చెప్పగలమా?

కనుక మతప్రోక్తమగు ఈశ్వరుడుగాని, ఖుదాగాని మరి యెక్కడను లేడు. కాన ఆత్మవిశ్వాసముతో ఆత్మగూపియగు ఈశ్వరసహాయమున ఆత్మరక్షణచేసికొనవలసియున్నది. జాతిపిత గాంధి ప్రతిపాదితమగు అహింసాసిద్ధాంత రహస్యమిదియే!

ఈ పరిస్థితుల నాలోచించియే ఋషులు, యోగులు మరియు మునులు కండ్లుమూసికొని బాహ్యవ్యాపకమైన ప్రపంచమునుండి, అందలి ఈశ్వరునుండి తమ మనసును మళ్ళించి, హృదయస్థమగు తమ ఆత్మను మనోనేత్రములతో తెలిసికొనుటకు, గుర్తించుటకు, సాక్షాత్కరించుకొనుటకు ప్రయత్నించుచుండిరి; ఈ కారణమునసే వారు సుఖులై, జ్ఞానవంతులై స్వచ్ఛందజీవులుగ నుండెడివారు.

క్రైస్తవులు కండ్లు తెరచి పైకిచూచుచు, చేతులనుకూడ పైకిచాచి ఈశ్వరోపాసన చేయుచుందురు. ఎందువలన? -

ఆకాశపుతండ్రి అనగ - వారి ఈశ్వరుడు ఆకాశమందున్నట్లు వారు నమ్మచున్నారు. ముసల్మానులు ఈశ్వరోపాసన చేయునపుడు లేదా నమాజు పఠించునపుడు పశ్చిమదిశగ తమ చేతులనుచాచి ప్రార్థించెదరు. ఎందుచేత? - వారి ఈశ్వరుడు బాహ్యమున పశ్చిమదిశయందు మక్కా-మదీనాయందున్నట్లు విశ్వసించెదరు. కావున మతఈశ్వరోపాసకులు తమ ఈశ్వరుని సర్వాంతర్యామియని నమ్మచున్నారు. అంతరంగమునకంటె బాహ్యమందే ఎక్కువగ వ్యాపించియున్నట్లు భావించుచున్నారు. ఇందువలన మతవాదులు అంతరంగమందలి ఆత్మనువిడిచి బాహ్యమున తీర్థములందు, దేవాలయములందు, నదీజలములందు మరియు పర్వతములందు వెదకుచు తిరుగుచుందురు; తుదకు అతనిని పొందజాలక పశ్చాత్తాపముతో పరవశులగుచుందురు. ఎందులకనగ? - అట్టి భక్తుడు భావించు ఈశ్వరుడు - ఒకపదార్థముగాని, వ్యక్తిగాని, మరియు తత్వముగాని కానపుడు ఎట్లు లభింపగలడు? నిజమగు సహాయకుడు, ఆయురారోగ్యానంద సంధాయకుడునగు ఈశ్వరుడు మన హృదయాంతరమందే ఉండియున్నాడు.

జ్ఞానులు, యోగులు మరియు స్వతంత్రులకు ఉపాస్యదైవము తపకుతామే! తమ శరీరముకన్న, తమకన్న వేరగు ఈశ్వరుడు లేడు. యోగి ఏ ఇతరమునుపూజింపడు; ఆత్మపూజనే చేయును. నిష్పక్షజ్ఞానులగు సంతులయొక్క, యోగులయొక్క

ఆత్మజ్ఞానులయొక్క లక్ష్యము - తమ ఆత్మ, తమ మనసు, తమ శరీరమువాత్రమే ఆయిఉన్నది. కావున తన్ను తాను తెలిసి కొనుట మరియు దానికి సంబంధించిన సాధనచేయుట ప్రధమ కర్తవ్యమైయున్నది.

జీవుడు ఈశ్వరుని అంశము; అనగ-ఈశ్వరునినుండి వెలువడినవాడని భావము. ఉదాహరణకు - ఒక గొప్ప మట్టివృక్షమునకును, మట్టివిత్తునకును, ఒక గొప్ప అగ్నిగోళమునకును దానినుండి వెలువడు నిప్పురవ్వకును ఎట్టిసంబంధములదో అట్టి సంబంధమే ఈశ్వరునకు జీవునకు కలదు.

శ్లో॥ యథా సుదీప్తాత్పావకాత్ విస్ఫులింగాః సహస్రశః
ప్రభవంతే సరూపాః।
తదాఽక్షరాత్ వివిధాః సౌమ్యభావాః ప్రజాయన్తేత్ర
చైవాపియంతి॥
(ముండకోపనిషత్తు)

బాగుగ మండుచుండు జ్యోతినుండి వేలాది నిప్పురవ్వలు జ్యోతితో సమానస్వభావశక్తులుగలవి ఎట్లు వెలువడుచున్నవో అట్లే అక్షరస్వరూపుడైన బ్రహ్మమునుండి సమస్వరూపులైన జీవులు వెలువడుచున్నవని భావము.

పై ఉదాహరణమువలన మనము తెలిసికొనవలసిదేమన? మట్టివిత్తనమందు అదృశ్యముగ మట్టిమ్రానగుశక్తియంతయు ఇమిడియుండి తగు క్షేత్రమందుపడి అనుకూల వాతావరణము

Acc NO 11884

కలిగినపుడు ఆ బీజమునుండి మొలకవచ్చి, చిన్న మొక్క అయి శీతాతపములకు తట్టుకొని దృఢమైవిస్తరించి పూర్ణపువృక్షము వలె పరిపూర్ణముగ ఎట్లు వ్యక్తమగుచున్నదో అట్లే ఈశ్వరాంశమగు జీవునియందు, బీజమున వృక్షమువలె ఈశ్వరశక్తులన్నియు అదృశ్యముగ ఇమిడియున్నవి. అయితే ఈశ్వరునియందు సమస్తశక్తులు పరిపూర్ణముగ ప్రకాశించి వ్యక్తమగుచుండగ, జీవునియందు బీజరూపమున అవ్యక్తముగనున్నవి; ఈ సంసారక్షేత్రమందు ప్రవేశించి సుఖదుఃఖకర్మల మూలమున అనేక అనుభవములద్వారా జ్ఞానమునుపొంది, జీవుడు ఈశ్వరునంతవాడు కాదగియున్నాడు.

మానవునకు స్వస్వరూపజ్ఞానమున్న మించిన మరియొక జ్ఞానము లేదు. తక్కిన జ్ఞానమంతయు ఈ స్వస్వరూపజ్ఞానమునకు సహకారియగుచున్నది. కనుక "నేను, నేను" అనుకొనువాడెవరు? సాధారణముగ మనకు వృగ్గోచరమగు శరీరమునే నేనని మనము భావించుచున్నాము. "శరీరము నాది కాని నేను శరీరమునుకాను" అని తెలిసికొనువాడు స్వస్వరూపమును కొంతవరకు తెలిసికొనినవాడగుచున్నాడు. "నేను జీవుడను. శరీరమునుకాను" శరీరములు అనిత్యములై నశించునవి; సృష్టి స్థితిలయములకు లోనైయున్నవి. కావున అధ్వాంతములుగలవి. జీవుడు నిత్యుడు, ఈ శరీరము పుట్టుటకుముందుకూడ నున్నవాడు. ఈ శరీరము నశించిన తరువాతనుకూడ ఉండువాడు" అని భావించుదానికే స్వస్వరూపజ్ఞానమని పేరు.

VENKATARAMANA LIBRARY V.R.K.P.R.I. Acc. No.

పై నుదహరింపబడిన ఉపనిషత్ ప్రమాణమందు "అక్షరాత్" అనుశబ్దముపయోగింపబడినది. "అక్షర" అనగ - నాశరహితుడు, అవ్యయుడు అని భావము. ఈశ్వరపదార్థము (ఆత్మపదార్థము) నుండి అంశరూపమున ఎన్ని జీవాత్మలు బయలు వెడలినను మూలపదార్థమునకు తరుగుండదు. కనుకనే అక్షరశబ్దముపయోగింపబడెను. అగ్నిజ్వాలనుండి అగణితమగు రవ్వలెన్ని బయలు వెడలినను మూలజ్వాల తరిగిపోదు; అట్లే అసంఖ్యాకములగు ఫలములెన్ని ఫలించినను మూలవటవృక్షపు జీవనశక్తి తరిగిపోదు!

గీత, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రములు ఈ మూడింటిని ప్రస్థానత్రయమందురు. వీనియందలి ప్రమాణములు అతివిశ్వాసనీయములు; వీనిచే ఆత్మికవాదరహస్యములు అతి విపులముగ, చక్కగ వర్ణింపబడినవి. కల్పిత ఈశ్వరప్రస్తావన వీనియందెక్కడను కనుపించుటలేదని ఆత్మజ్ఞానులు చెప్పుచున్నారు. ముఖ్యముగ ఆత్మికవాదమునకు ఉపనిషత్తులు ఆధారభూతములై యున్నవి; ఇవి వేదసంబంధితములైయున్నవి.

పై ప్రమాణగ్రంథములయందు ఆత్మనే ఈశ్వరునిగ వర్ణించియున్నారు. ఆత్మయే ఈశ్వరుడైనపుడు కల్పితఈశ్వరుడెక్కడ ఉండగలడు? ఈ విషయమునే మైత్రేయోపనిషత్తునందు ఈ విధముగ వివరింపబడియున్నది-

శ్లో॥ దేహో దేవాలయ ప్రోక్తః సజీవః కేవలః శివః।
త్యజే దజ్ఞాననిర్మాల్యం సోఽహం భావేన పూజయేత్॥
(మైత్రేయ్యుపనిషత్తు)

ఓ మైత్రేయీ! ఈ దేహమే దేవాలయము: ఈ దేహమందున్న జీవుడే శివుడు దీనిని తెలిసికొనకపోవుటయే అజ్ఞానము. దీనిని తత్త్వజ్ఞానముతో పరిహరించి "ఆ పరమాత్మయే నేను" అను భావముతో పూజింపవలయును.

శ్లో॥ పాషాణలోహమణి మృణ్మయ విగ్రహేషు పూజా
పునర్జనన భోగకరీ
ముముక్షోః। తస్మాద్యతిః స్వహృదయార్చనమేవ
కుర్యాదబాహ్యార్చనం
పరిహారే దపునర్భవాయ॥ (మైత్రేయ్యుపనిషత్తు)

శిలలచేతను, లోహముతోను, మణులతోను, మట్టితోను చేయబడు విగ్రహములపూజించువారికి జననమరణములుతప్పవు. కావున జన్మరాహిత్యమోక్షమును కోరు "యతిపుంగవుడు" తన హృదయస్థుడగు పరమాత్మనే పూజింపుచు, బాహ్యార్చనము చేయరాదని భావము ఈ శ్లోకమందు ఆత్మకన్న వేరగు ఈశ్వరుడు లేడని, బాహ్యమందున్నట్లు భావించు కల్పితఈశ్వర పూజను పరిహరింపవలయునని స్పష్టముగ వివరింపబడినది.

శ్లో॥ "అయమాత్మా బ్రహ్మ" విజ్ఞానమయో మనోమయః
ప్రాణమయశ్చక్షుర్మయః శ్రోత్రమయః॥
(బృహదారణ్యకోపనిషత్తు)

ఈ ఆత్మయే బ్రహ్మమని, విజ్ఞానమయ ప్రాణమయకోశ ములు కలిగియున్నట్టి, నేత్రాశ్రోత్రేంద్రియములు కలిగి యున్నట్టి మానవుడే బ్రహ్మము లేదా ఈశ్వరుడైయున్నా డని స్పష్టముగ వివరింపబడినది. "అయమాత్మా బ్రహ్మ" అను వాక్యప్రయోగమువలన ఆత్మకన్న వేరగు ఈశ్వరుడెక్కడను లేడను భావమును ఋషులు స్థిరపర్చియున్నారు.

శ్లో॥ సర్వం హ్యేతద్బ్రహ్మ, అయమాత్మాబ్రహ్మ, సోయమాత్మా చతుష్పాత్" (మాండూక్యోపనిషత్తు)

ఈ ఆత్మయే బ్రహ్మము. ఈ ఆత్మ జాగ్రత్, స్వప్న, సుషుప్తి మరియు సమాధియను నాలుగు పాదములు కలిగి యున్నవి. ఈ నాలుగు అవస్థలను కలిగియున్నవాడు మాన వుడే! మానవాత్మకు మారుపేరే ఈశ్వరుడు. "సర్వం హ్యేత ద్బ్రహ్మ" అనగా - ఈ ప్రపంచమంతటిని ఆత్మరూపియగు బ్రహ్మయే సృజించియున్నాడని భావము.

మానవుడు తన్ను తాను తెలిసికొనుచు, సమస్తమును తెలిసికొనగలుగుచున్నాడు. సూర్యగ్రహము భూమికన్న అనేక లక్షలరెట్లు పెద్దది. అన్నిగ్రహములు మానవునికన్న మిక్కిలి పెద్దవైయున్నప్పటికి ఇవి అన్నియు మానవునిముందు తుచ్ఛ ములే! "నేను సూర్యుడను" అని సూర్యగ్రహమునకు తెలి యదు. సూర్యునివలన సూర్యునకేమిలాభము? సూర్యునివలన మానవులకు లాభము. సూర్యచంద్రులు, నక్షత్రములు, అగ్ని,

వాయువులు మరియు జలమేఘములు సమస్తము మానవ సౌకర్యార్థమే, మానవసేవార్థమే సృజింపబడినవి. మానవుడు గ్రహగమనమును గ్రహింపగలుగుచున్నాడు; ఇందుమూలమున లాభమునుకూడ పొందగలుగుచున్నాడు. "మేము చలించుచున్నాము" అను సంగతి గ్రహములకు తెలియదు. సమస్తమును గమనించువాడు, సమస్తలాభమును పొందువాడు మానవుడే! ఈ ఆత్మయే సమస్తమునకు మూలము; దీని అస్తిత్వమే లేనియెడల సమస్తము లేనట్లే! సమస్తము ఆత్మచేతనే సృజింపబడుచున్నది మరియు దీనియందే లయమగుచున్నది. స్వప్నసృష్టి ఆత్మచే చేయబడి, తనయందే కొంతసమయమునుంచుకొనబడి, తిరిగి తనయందే విలీనము చేయబడుచున్నది. అయితే స్వప్నసృష్టి ఒకే ఆత్మకు సంబంధించినది; జాగ్రదవస్థలోని సృష్టి సమిష్ట్యాత్మకు సంబంధించినది. సమస్తము ఆత్మసృష్టియే! ఇట్టి ఆత్మకు మరియొక పేరే ఈశ్వరుడు.

మన ఆత్మయొక్క అస్తిత్వము నంగీకరించినప్పుడు సమస్తసృష్టి మన కల్పన అని అంగీకరింపవలసియున్నది. అట్లంగీకరింపని వాడు నాస్తికుడే! ఈ జ్ఞానమే గొప్ప జ్ఞానమైయున్నది. వేదాంతర్భాగమగు కైవల్యోపనిషత్తునందు ఈవిధముగ చెప్పబడియున్నది.

శ్లో॥ జాగ్రత్స్వప్న సుషుప్త్యాది ప్రపంచం యత్ప్రకాశతే।
తద్బ్రహ్మాహమితిజ్ఞాత్వా సర్వబంధైః ప్రముచ్యతే॥

జాగ్రత్ స్వప్న సుషుప్త్యాది ప్రపంచము దేనివలన ప్రకాశించుచున్నదో అట్టి బ్రహ్మము (ఈశ్వరుడు) స్వయముగ మనమే! అని గ్రహించిన మానవుడు సమస్త బంధములనుండి విముక్తిని పొందగలుగుచున్నాడని భావము.

ఈశ్వరునకు బంధనవిముక్తియా? ఎన్నటికికాదు! పైఉపదేశమంతయు మానవాత్మకు సంబంధించినదియైయున్నది. ఇందు మూలమున బాహ్యమందొక్కడను కల్పిత ఈశ్వరుడు లేనట్లు ధ్రువపడుచున్నది.

శ్లో॥ శృణుష్వ విద్వాన్ మన ఏవ జీవః మనోహి విశ్వం
మనఏవ చేశః।
మనోహి మాయా మనఏవబంధః మనోలయం
ముక్తిరయం యదార్థః॥

ఓ విద్వాంసుడా! మనసే జీవుడు. మనసే జగత్తు, మనసే ఈశ్వరుడు, మనసువల్లనే మాయ కమ్ముచున్నది; దానివల్లనే బంధమేర్పడుచున్నది. మనసు ఇంద్రియసహాయమున విషయములవెంట పరుగులిడక ఆత్మయందు లయించుటయే నిజమగు ముక్తి. ఇదియేసుమా యదార్థము! ఆత్మయే మనస్సు, మనస్సే ఆత్మ! ఆత్మయే ఈశ్వరుడైనపుడు మనసుకూడ ఈశ్వరుడే!

శ్లో॥ బహిర్భ్రమ్యతి యఃకశ్చిత్ త్యక్త్వా దేహస్థ మీశ్వరమ్।
స్వగృహే పాయసం త్యక్త్వా భిక్షామటతి దుర్మతిః॥
(మహావాక్యదర్పణము. శంకరులు)

మందబుద్ధియగు మానవుడు తన దేహమందున్న ఈశ్వరుని విడిచి, బాహ్యప్రపంచమున ఈశ్వరునికొరకు వెదుకుచున్నాడు. తన ఇంటియందున్న పాయసమును విడిచి పొరుగింట్లకు భిక్షాటనకు పోయినట్లున్నదని భావము.

శ్లో॥ యస్స్వాత్మసుఖ ముత్సృజ్య సుఖం బాహ్యమపేక్షతే।
కరస్థం పాయసం త్యక్త్వా సమాధ్యో వేఢి కూర్పరమ్॥

(మహావాక్యదర్పణం. శంకరులు)

తన దోసిలియందలి పాయసమునువిడిచి మోచేతిమీదుగ స్రవించిన చుక్కలను నాకు మూఢునివలె తన ఆత్మసుఖమును విడిచి మానవుడు బాహ్యసుఖము నపేక్షించుచున్నాడు. అనగ- తనయందున్న ఆత్మసుఖమయగు ఈశ్వరుని విడిచి బాహ్యమందు కల్పిత ఈశ్వరుని మానవు డపేక్షించుచున్నాడని భావము.

శ్లో॥ అద్యాష్టమీతి నవమీతి చతుర్దశీతి జ్యోతిష్కవాచోప
వసంతి భక్త్యా!
శృతేస్త్వాహో! తత్వమసీతి వాక్యం న విశ్వస త్యద్భుత
మేతదేవ॥

(మహావాక్యదర్పణం. శంకరుడు)

"నేడు అష్టమి, నేడు నవమి, రేపు చతుర్దశి" అను జ్యోతిష్కుల వాక్యములను అందరు భక్తితో స్వీకరించి ఆచరించుచుందురు. ఐతే సర్వలోకప్రమాణభూతములైన శ్రుతులు- "తత్వమసి"అని ఘోషించుచున్నను ఒక్కనికి వినిపించుటలేదు.

వినిపించినను విశ్వసించుటలేదు. ఇది లోకమందలి మహాద్భుతములలో ఒకటిగదా! "తత్వమసి" అనగా-తత్ = ఆబ్రహ్మము. త్వం = నీవేఅసి = అయితివి; నీవే ఆ బ్రహ్మ లేదా ఈశ్వరుడవు అయితివి. నీకంటె వేరుగ బాహ్యమందు ఈశ్వరుడెక్కడను లేడని భావము.

శ్లో॥ యేన శబ్దం రసం రూపం గంధం జానాసి రాఘవ।
తమాత్మానం పరబ్రహ్మ జానీహి పరమేశ్వరమ్॥
(వేదాంతసారము)

ఓ రాఘవా! దేనితో శబ్దరసరూపగంధముల గ్రహించి తెలిసికొనుచున్నావో, అట్టి ఆత్మనే పరబ్రహ్మముగ లేదా పరమేశ్వరునిగ తెలిసికొనుము.

శ్లో॥ జీవశ్శివశ్శివో జీవః సజీవః కేవల శ్శివః।
ఆశాపాశస్థితో జీవః పాశముక్త స్సదాశివః॥

జీవుడే శివుడు, శివుడే జీవుడైయున్నాడు. సజీవమానవుడే కేవలము శివుడైయున్నాడు. ఆశాపాశబద్ధుడగు మానవుడు సామాన్య జీవుడనియు, పాశవిముక్తుడగువాడు సదాశివుడనియు చెప్పబడుచున్నాడు. దీనిమూలమున జీవునికన్న వేరగు ఈశ్వరుడు ఎక్కడను లేడని ధృవపడుచున్నది.

జగద్గురు శంకరులు గురుశిష్యసంవాద రూపమున ఒకే శ్లోకమందు చక్కగ సమస్త వేదాంతసారమును వివరించియున్నారు. ఇది "ఏకశ్లోకీ వేదాంతసారము" అని ప్రసిద్ధిగాంచి

యున్నది. దాని నీక్రింద నుదహరించుచున్నాను. ఇది గురువు ప్రశ్నించగా- శిష్యుడిచ్చు సమాధానములతో కూడియున్నది.

శ్లో॥ కిం జ్యోతిస్తవ? భానుమానహని మే రాత్రౌప్రదీపాదికమ్।
స్యాదేవం; రవిదీపదర్శనవిధౌ కిం జ్యోతి రాఖ్యాహి మే।
చక్షుస్తస్య నిమీలనాది సమయే కిం? ధీః ధియోద్దర్శనే।
కిం? తత్రాహమతో భవాన్ పరమకం జ్యోతిస్తదస్మిత్ప్రభో॥

"నీవు సమస్తజగత్తును దేనిసహాయమున తెలిసికొనుచున్నావు? పగలు సూర్యునివలన, రాత్రి చంద్రనక్షత్ర దీపకాంతులచేతను తెలిసికొనుచున్నాను. ఆ సూర్యదీపాదులను దేనిచే తెలిసుకొనుచున్నావు? కన్నులచేత; నేత్రములు మూసుకొన్నపుడో; బుద్ధిచేత; ఆ బుద్ధిని మనకు గోచరింపచేసి అనుభవవేద్యము చేయుచున్న వెలుగుఏది? నాచేతను అనగ ఆత్మచేత; కావున ఆత్మయే సర్వప్రకాశముగదా! అదియే "నీవు" అని ఎరుగుము. అట్లెరుగుటయే మోక్షము; స్వామీ! తమ అనుగ్రహమువలన తెలిసికొన్నాను.

ఆత్మజ్యోతి స్వయంప్రకాశమైనది. లౌకిక, అలౌకిక జ్యోతులన్నిటికి అదియే ఆధారభూతము; సూర్యచంద్రులు, దీపాదులు, నయనేంద్రియము తుదకు బుద్ధి ఇవిఅన్నియు స్వయంప్రకాశములుకావు; ఇవన్నియు ఆత్మజ్యోతివల్లనే వెలుగుచున్నవి. శ్రీ శంకరులు ఒకేఒక శ్లోకమందు ఆత్మకవాదమును, అద్వైతవాదమును అద్భుతముగ వర్ణించియున్నారు. ఇందు

మూలమునకూడ ఆత్మకన్న, బాహ్యమందు మరియొక ఈశ్వరుడు లేనట్లు స్పష్టపఱుచుచున్నది.

నిజమగు జ్ఞానము సఫలతకు మూలమైయున్నది; పరమాత్మయొక్కజ్ఞానమే నిజమగుజ్ఞానము; అదిమానవుని సర్వోచ్చ శిఖరములకు చేర్చగలదు. అట్టి పరమాత్మ మనకు అతి సన్నిహితుడై యున్నాడు; అతనిజ్ఞాన మతిసరళము; ఎందువలన? - ప్రపంచమున పరమాత్మయే అందరికన్న సరళుడు, సరసుడు, సులభుడు మరియు సుఖప్రదాతయునైయున్నాడు. అతడు మనకు చాల సమీపస్థుడైయున్నాడు. అతడు మన ఆత్మకు అభిన్నుడై యున్నాడు; అనగా - మనము స్వయముగ, పరమాత్మయే! మనము మనకంటె అధికముగ మరిఎవ్వరిని ప్రేమింపజాలము! ఎందువలన? ఆ పరమాత్మయే మన ఆత్మగనున్నదిగనుక! ఇందు వలన అది నిజమగు ప్రేమకు కేంద్రమైయున్నది. ఆత్మవిశ్వాసముతో ముందుకుసాగినయెడల కల్పితఈశ్వరవిశ్వాసము కలుగజాలదు! మనకుమించిన, మనఆత్మకుమించిన ఇతర సహాయకుడు మరిఎవ్వడును లేడు. మన మేస్వయముగ పరమాత్మ! కావున మన కత్యంత సహాయకు డితడే!

పురాణ గ్రంథములందు ఈశ్వరునకు ఎన్ని లక్షణములు పర్ణింపబడియున్నవో, అవి అన్నియు మానవునియందున్నట్లు గోచరించుచున్నది. మహాదేవుడగు ఈశ్వరుడు ఈ కలియుగ మందు కనుపించుటలేదని మానవుడు చెప్పుచున్నాడు. కాని

తత్వజ్ఞానులగువారు నేడుకూడ నిత్యము మహాదేవుని చూచు చున్నారు; దర్శనము చేసుకొనుచున్నారు. మహాదేవునియందు గల లక్షణములన్నియు మనయందు అంతర్హితమైయున్నవి; మానవుడే ఈశ్వరుడు మరియు మహాదేవుడుకూడనై యున్నాడు.

త్రినేత్రుడు— మహాదేవునకు భౌతికమగు మూడవకన్ను కలదని ప్రజలు చెప్పుచున్నారు. మూడుకండ్లుగల ఇట్టి దేవుడు ఇంతవరకు ఎక్కడను దృగ్గోచరముకాలేదు. అయితే త్రినేత్ర ధారులగు దేవతలు ఇప్పుడుకూడ ప్రపంచమందుండియున్నారు. కాని మూడవకన్ను లేకుండ ఈ రెండుకన్నులతో వారిని చూడ గలుగుట అసంభవము! అట్టి మూడవకంటిని జ్ఞానచక్షువనిచెప్పు చున్నారు. అది ప్రతిమానవుని మస్తిష్కమందు భృకుటీమధ్య మున ఉండియుండును. మానవుడు ఏదైనా గంభీరవిషయమును ఆలోచింపవలసివచ్చినపుడు తనచేతిని తన లలాటమందుంచుకొని ఆ జ్ఞానచక్షువు ఇక్కడనే యున్నదని ధృవపర్చుచున్నాడు. లలాటమునకు సమీపమందే, శిరోభ్యర్ధాగమందు మస్తిష్క మున, మనస్సున నివసించియున్నది; ఇక్కడకూడ ఒక నేత్రముండి యున్నది. దీనినే ఆలోచనానేత్రమందురు నిజముగ మానవున కిదియే అసలైన, సిసలైన నేత్రము! మంచిచెడ్డలను, సత్యా సత్యములను మానవుడీ నేత్రముతోనేచూచి తెలిసికొనగలుగు చున్నాడు. ఈజ్ఞాననేత్రముతో మానవుడు చాలదూరమువరకు సరీక్షింపగలిగియుండును.

ఈశ్వరుడొకసారి కామమునకు వశీభూతుడు కాజొచ్చెను; ఆ సమయమున ఈ నేత్రము తెరచి తప్పించుకొనగలిగెను అప్పటికి పార్వతీపరమేశ్వరులకు వివాహము జరిగియుండలేదు; పార్వతీదేవి అప్పటికి కన్యగనేయుండెను. ఈశ్వరుడు ధ్యాన నిమగ్నుడై యుండగ పార్వతీదేవివచ్చి మహాదేవుని చూచి మోహించెను. అమె ఆయన సమీపమందేయుండి సేవలు చేయసాగెను. మహాదేవునికికూడ తపోభంగమాయెను. తన ఎదుట ఒక సుందరయువతిని చూచుటతోనే ఈశ్వరునివంటి ఒక మహాయోగికూడ స్త్రీకామమునకు వశీభూతుడై పోయెను. అట్టి స్థితిలో మహాదేవుడు పోరపాటును గ్రహించి తన జ్ఞాన చక్షురూపియగు మానవనేత్రమును తెరచెను; ఈ మూడవ కంటిని లేదా జ్ఞానచక్షువును తెరచుటతోనే కామదేవుడగు మన్మథుడు మండి భస్మమైపోయెను. ఈజీవుడే లేదా మానవుడే మహాదేవుడై యున్నాడు; అతడుకూడ ధ్యాననిమగ్నుడైనపుడు అనేకవిషయములు, సుందరస్త్రీలు అతనిముందు ప్రత్యక్షమై తపోభంగముచేయుటకు ప్రయత్నించుచుందురు; అపుడు జ్ఞానులగు మానవులుకూడ కోపమునకు వశీభూతులగుచున్నారు.

శ్లో॥ విశ్వామిత్ర పరాశర ప్రభృతయో వాతాంబుపర్ణాశనాః।
తేపి స్త్రీముఖపంకజం సులలితం దృష్ట్వైవమోహంగతాః॥

(భర్తృహరి సుభాషితం)

గాలి, నీరు, ఆకు, అలము భక్షించి జపతపాదుల నాచరించు

విశ్వామిత్ర పరాశరాది మునిముఖ్యులుకూడ సుందరమగు స్త్రీల ముఖపద్మమును చూచినంతనే మోహితులైనారని భావము.

శ్లో॥ "బలవా నింద్రియగ్రామో విద్వాంసమపికర్షతి॥" (నీతి శాస్త్రము) ఇంద్రియసమూహము చాల బలవత్తరమైనది. బ్రహ్మవిద్యావిశారదుసికూడ ఆకర్షింపగలదని భావము.

విశ్వామిత్రాదులకన్న గొప్పయోగియగు మహాదేవుడు కూడ కామవశుడై విచలితుడైనాడు; అపుడు తనతప్పుగ్రహించి జ్ఞానచక్షువగు మూడవకంటిని తెరచి, కామప్రవృత్తులకు అధిదేవతయగు మన్మథుని భస్మముచేసినట్లు పూర్వకథనము. ఈశ్వర తృతీయనేత్రమునుండి అగ్నిజ్వాలలు బయలుదేరి మన్మథుని భౌతిక దేహమును భస్మముచేసినట్లుచెప్పు పురాణగాథలు అసత్యములు. తన జ్ఞాననేత్రమును తెరిచి అంతరంగమందలి కామప్రవృత్తులను అధిష్టాతయగు మన్మథుని భస్మముచేసెను. అనగా కామప్రవృత్తులను నశింపజేసి యథాస్థితికి రాగలిగెనని భావము.

జ్ఞానియగు మానవుడు కామమునకు వశీభూతుడైనపుడు జ్ఞానచక్షువగు తన మూడవకన్ను తెరచి పరికించినపుడా కామవాసన నాశనముకాగలదు. మహాదేవుని ఇంద్రియనిగ్రహమునకు సంబంధించిన ఇదియొక మంచికథ! యోగియగు, తపస్వియగు మానవుడే మహాదేవుడు! ఆలోచనాయుతమగు, జ్ఞానమయమగు అతని బుద్ధియే మూడవనేత్రము. యోగియొక్క మనసు ఎపుడైన విషయములవెంట పరుగిడసాగినపుడు అతడే

జ్ఞానచక్షువుతోచూచి, పరికించినయెడల క్షుద్రమగు విషయ వాసనలు నశింపగలవు. నిజమగు మూడవ నేత్రమిదియే! ఈ మూడవకన్ను ఎల్లప్పుడు గుప్తమై మూసుకొనియుండును. నిజముగ ఈ జ్ఞానచక్షువు లలాటాంతర్భాగమున మస్తిష్క మందు మూయబడియున్నందున అప్రత్యక్షముగనున్నది!

ప్రపంచమందలి చాల కార్యములు ఈ జ్ఞాననేత్రమును తెరువకుండినయెడల నెరవేరజాలవు. నేటి మానవుడుకూడ తన ఈ గుప్త నేత్రముతో పరిచయమును పెంచుకొని దీనినుపయోగించుకొనినయెడల జీవుడే శివుడుకాగలడు. మానవుడు ద్వివిధ నేత్రములతో చూడగలుగుచున్నాడు. చర్మచక్షువుతోను మరియు మనోనేత్రముతోను చూచుచున్నాడు. మానసిక నేత్రమునకు గోచరమైనదంతయు చర్మచక్షువులకు కనిపించుట అసంభవము. కావున ఈ మూడవకన్ను చాల ఉపయోగకరమైనది; ఈ నేత్రసహాయము లేకుండ మానవుడు మహాదేవుడు కాజాలడు. జీవుడు శివుడగుటకు, నిజస్వరూపజ్ఞానమును గ్రహించుటకు, ఈ తృతీయనేత్రసహాయమెంతయో అవశ్యకమైయున్నది. ఈ తృతీయనేత్రము లేదా తత్త్వజ్ఞానము, బుద్ధి మరియు విజ్ఞానము ప్రతిమానవునియందును ఉండియున్నది. కావున ప్రతి మానవుడు త్రినేత్రధారియే! అయితే గుప్తమై మరుగుపడియున్న ఆ జ్ఞానచక్షువును చైతన్యవంతము చేయవలసియున్నది.

ఈశ్వరునకు భౌతికమగు తృతీయనేత్రముండుట అసహా

జము; దానితో మన్మథుని భౌతికకాయమును దహింపచేయుట కూడ అసత్యమే! అట్టి పురాణగాథలన్నియు అసంగతములు, అసంభవములు అయిఉన్నవి. జ్ఞానచక్షువే నిజమగు తృతీయ నేత్రము!

యోగము— ఇహలోకమందు లేదా పరలోకమందు ముక్తి లేక మోక్షమును పొందుటకు స్వస్వరూపజ్ఞానము ముఖ్యావసరమగుచున్నది. ఇట్టి జ్ఞానము యోగసాధనవల్లనే లభ్యముకాగలదు. రాగద్వేషరహిత ప్రశాంత వస్థితియే మోక్షము! మతగ్రంథప్రోక్తములగు రంభాసంభోగాది స్వర్గ సుఖములుగల, యమదూతాదులవలనకలుగు నరకబాధలుగల ఊర్ధ్వలోకము లేనేలేదు. మరణానంతరలోకము మనోమయమై యుండును. మోక్షమనగ? - రాగద్వేషరహిత సత్ప్రవర్తనా యుతమగు విశుద్ధ మానసిక పరివర్తనము లేక స్వస్వరూప జ్ఞానము. ఇట్టి జ్ఞానప్రాప్తికి ఇహలోకమేకర్మక్షేత్రమగుచున్నది. ఇట్టి జ్ఞానికి పరలోకవాసముకూడ ఆనందదాయకముగనేయుం డును. ఇటువంటి మోక్షప్రాప్తికి యోగసాధనమే ప్రధాన పరి కరమైయుండగలదు. ఇహపరలోకములయందు దీనిప్రభావము ప్రధానమగుటవలన యోగమునుగురించి ఇచట కొంత వివరం చుట సమయోచితమగుచున్నది. యోగసిద్ధిని పొందినవాడే యోగి! యోగిగానిచే మోక్షగామి కాజాలడు!!

చిత్తవృత్తుల నిరోధించుటయే యోగము. ఆపంచమున

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
No.

ఎవ్విధమగు సఫలతను పొందవలసివచ్చినను, చిత్తమాకర్తవ్యమందు ఏకాగ్రతను పొందనంతవరకు మానవుడా సాఫల్యమును పొందజాలకుండును.

(1) శ్లో॥ మయ్యేకచిత్తతాయోగ ఇతిపూర్వం-నిరూపితమ్।
సాధనాన్యష్టధా తస్య ప్రవక్ష్యామ్యధునాశృణు॥
(ఇతి బ్రహ్మపురాణాంతర్గత సౌరపురాణే)

(2) శ్లో॥ యోగాస్త్రయో మయా ప్రోక్తా నృణాంశ్రేయో
విధిత్సయా।
జ్ఞానం కర్మంచభక్తిశ్చనోపాయోఽన్యోఽస్తి
కుత్రాచిత్॥
(ఇతి శ్రీమద్భాగవతే)

(1) అత్మయందు ఏకాగ్రతను పొందుటయే యోగమని పూర్వము నిరూపింపబడినది. ఈ యోగసిద్ధికి సాధనము అష్ట విధమైయున్నది. దీనిని చెప్పుచున్నాను; వినుము అని ఈశ్వరుడు కుమారస్వామికి ఉపదేశించెనని భావము.

సర్వసామాన్యముగ- "మయ్యేకచిత్తతా" అను వాక్యమునకు - ఈశ్వరునియందు చిత్తమును లగ్నముచేయుట అను అర్థమును మతవాదులు చెప్పుచున్నారు. ఇది సరియగు నిర్వచనముకాదు. "మయి" అను పదము అస్మచ్ఛబ్దమునకు సప్తమీ ఏకవచనప్రయోగమైయున్నది. "అహం" అను ఈ సర్వనామ

శబ్దమునకు "నేను" లేదా "ఆత్మ" అను అర్థమును గ్రహింప వలసియున్నది. దీనికి గీతాప్రమాణముకూడ కలదు.

శ్లో॥ అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయ స్థితః॥
(గీత. అ. 10-20)

ఓ అర్జునా! అహమ్ (నేను) అనునది ఈ ఆత్మయే! ఇది సమస్త ప్రాణికోటియొక్క హృదయాంతర్గతమైయున్నది. ఇందు ప్రయోగింపబడిన "అహమ్" శబ్దార్థము శ్రీకృష్ణుని అంతరాత్మకు గాని, స్థూలదేహమునకుగాని పరిమితమైయుండదు. సర్వులహృదయములనుండి మాట్లాడుచున్నది; కనుకనే (సర్వభూతాశయ స్థితః) సమస్త జీవధారుల హృదయాంతర్గతమైయున్నది. అను వాక్యము ప్రయోగింపబడెను. ఈ "అహమ్" శ్రీకృష్ణునికొరకే కేవలము ప్రయోగింపబడియుండలేదని ధృవపడుచున్నది. కావున "మయ్యేకచిత్తతా" అను ఉపర్యుక్త శ్లోకమందలి "మయి" అను శబ్దమునకు సమస్తహృదయస్థమైయున్న "ఆత్మయందు" అని సమన్వయించుకొనవలసియుండును. ఇట్టి ఉదాహరణములు ప్రమాణములు ఉపనిషత్సాహిత్యమందు, ఇతరశాస్త్రములందు అనేకములు గోచరించుచున్నవి.

(2) నాచేత "జ్ఞానయోగము", "కర్మయోగము" మరియు "భక్తియోగము" అను ముఖ్యమగు మూడు యోగములు చెప్పబడినవి. ఇవి ప్రజాశ్రేయోదాయకములు. వీనికన్న ఉత్తమోపాయములు మరిఏవియు లేవుఅని భావము.

కలియుగమున యోగసాధనము, జపతపాదులు సిద్ధింప జాలవని కొన్ని శాస్త్రప్రమాణములు కనుపించుచున్నవి-

శ్లో॥ నసిధ్యతి కలా యోగో నసిధ్యతి కలా తపః।
చంచలేంద్రియ వృత్తిస్యాత్ కలికల్మష జృంభణాత్ ॥
(ఇతి కాశీఖండే 32 అధ్యాయే)

కలియుగమున ఇంద్రియములు చంచలప్రవృత్తి కలిగి యుండుటవల్లను, కలిపాపప్రకోపమువల్లను తపోయోగములు సిద్ధింపజాలవు. అని భావము.

ఈ ప్రమాణమంత యుక్తియుక్తముగ లేదు. కలియుగమున యోగసిద్ధులు, జీవన్ముక్తులు అవతరింప లేదా? గతయుగములకన్న ఈ యుగమున వారి శాతము గణనీయముగ తగ్గి యుండవచ్చును. బుద్ధుడు, జీసెస్ క్రయిస్తు, శంకరుడు, రామకృష్ణపరమహంస, స్వామివివేకానంద, దయానందాదులు, కర్మయోగియగు గాంధీమహాత్ముడు మరియు యోగీశ్వర శివముని ఇత్యాద్యనేకులు కలియుగమున అవతరించి సిద్ధిని పొందిన మహాత్ములే!

అయితే గతించిన మూడు యుగములందు జ్ఞానయోగ భక్తియోగములకు ప్రాధాన్యమిచ్చి అప్పటివారు ముక్తిని సాధించియున్నారు. అప్పటి ప్రజాభిప్రాయమునకు జ్ఞానభక్తి యోగములు అనుకూలమైయుండెను. కలియుగమున కర్మయోగమునకు ప్రాముఖ్యతకలదు. కలియుగ మానవ మానసిక

ప్రవృత్తికూడ కర్మయోగమునకు అనువుగనున్నది. జ్ఞానభక్తి యోగములు నేడు కఠినసాధ్యములు కావచ్చును.

శ్రీకృష్ణుడు కర్మయోగి. మనము నిశితముగ గీతను అధ్యయనము చేసినపుడు అందు కర్మయోగమునకే అగ్రతాంబూల మీయబడినట్లు గోచరింపగలదు. గీతోపదేశ సమయము, ద్వాపర కలియుగసంధికాలము. కనుకనే శ్రీకృష్ణుడు కలియుగ మానవ స్వభావానుసారముగు భవిష్యదృష్టితో కర్మయోగప్రధానముగ గీతోపదేశమును చేసియుండెను. జీసెస్ క్రయిస్తు, దయానందుడు, గాంధీమహాత్ముడు కర్మయోగులైయుండిరి;బుద్ధశంకర రామకృష్ణపరమహంసాదులు జ్ఞానయోగులైయుండిరి. పై శ్లోకము కలియుగలక్షణవర్ణనకు ప్రాధాన్యమిచ్చు సందర్భమున అట్లు వ్రాసియుండవచ్చును.

శుద్ధయోగము సమస్తయోగములకు రాజైయున్నది. కనుకనే దీనిని రాజయోగమనికూడ అందురు. ఈ రాజయోగ మూలమున – ఆత్మబలము, మనోబలము మరియు ప్రాణబలము కూడ వికసితమై బలపడును. ఈ రాజయోగమువల్లనే మానవునకు నిజమగు ఆత్మజ్ఞానము లభ్యమగును. ఇందువలన మానవుడు జ్ఞానియై ఈ జన్మమునందే జీవన్ముక్తుడు కాగలడు. ఈ ముక్తి ఇహలోకమందేలభ్యమగుటవలన దీనికి "జీవన్ముక్తి" అని సార్థకనామము కలిగినది. ఇట్టి ముక్తి – ఇతర ధార్మిక కార్యాచరణమువలన, తీర్థవ్రతతపోపవాసాదులవలన మరియు

పూజాపఠన యజ్ఞయాగాదులవలన లభ్యముకాజాలదు. ఇహమంచు ఇట్టి ధర్మకార్యములుచేసిన, మరణానంతరమున పరమంచు శతాధికఫలము లభింపగలదని మతవాదుల కథనము. అట్టి ధర్మకర్మలమూలమున ఇహమందు ముక్తి లభ్యముకానపుడు మరణానంతరమున లభ్యమగు ననుమాట విశ్వసించుటెట్లు?

కాని శుద్ధయోగమువలన ప్రత్యక్షమగు ఆత్మజ్ఞానము లభ్యముకాగలదు. ఈ నిజమగు ఆత్మజ్ఞానమువలన మానవుడు ఇహలోకమందే జీవించియుండగనే అనగ సాధకునకు – "నేను స్వతంత్రుడను, ముక్తుడనై సమస్త బంధములనుండి విడువడి యున్నాను" అను ప్రత్యక్ష సాత్వికజ్ఞానము లభ్యముకాగలదు. ఇదియే విజమగు ముక్తి. ఇట్టి జీవన్ముక్తులు ఇహమందు రాగ ద్వేషరహితులై ఆనందముతో జీవించుచుందురు; మరణానంతరమున ఇట్టి ముక్తాత్మలు పరలోకమందుకూడ సిజమగు మోక్షమును పొందుచుండును. ముక్తియుక్క, మోక్షముయొక్క రహస్యమిదియే!

మన ఆలోచనలతో బుద్ధిని ఏకాగ్రపర్చి మన వ్యాపార మందుగాని, పరిశ్రమయందుగాని శ్రద్ధగ సాధనచేయుచున్నపుడు దీనిని "వ్యాపారయోగము" అని అందురు; దీనిమూలమున వ్యాపార వ్యవసాయములు అభివృద్ధికి రాగలవు. కాని దీనిపేరు శుద్ధయోగము కాబాలదు.

గొప్పగొప్ప విజ్ఞానవేత్తలుకూడ అద్భుతమగు నూతనా

విస్కారములను ఆవిష్కరించి, ప్రజలను ఆశ్చర్యచకితులను చేయుచుందురు. ఇది చిత్తైకాగ్రతమూలమునసే జరుగుచున్నది. ఆవిష్కర్తయొక్క చిత్తము ఏకాగ్రత పొందనంతవరకు ఆవిష్కారము సఫలముకాజాలదు; అప్పుడతడు తన కర్మాయందు ఒక విధమగు సమాధిని పొందుచున్నాడు. కావున ఈ సాధనకు "ఆవిష్కారయోగము" అని అనవచ్చును; కాని ఇదికూడ శుద్ధయోగముకాదు.

మీరొక వకీలు; మీరు బుద్ధియుక్తులై వృత్తియందు చిత్తము నేకాగ్రపర్చి కష్టించి విశ్వాసపాత్రముగ మీ కర్తవ్యమును నిర్వహించినయెడల అది "వకాలతుయోగము" కాగలదు, శుద్ధయోగముకాదు.

చిత్తము నేకాగ్రపర్చి విష్ణువును ధ్యానించిన అది "విష్ణుయోగ" మగుచున్నది. శివుని ధ్యానించిన "శివయోగము", శక్తిని ధ్యానించిన "శక్తియోగము", ఖుదా పైగంబరులను ధ్యానించినయెడల "ఇస్లామయోగము", పుణ్యకర్మలధ్యానించిన "పుణ్యయోగము", పాపకర్మల ధ్యానించిన "పాపయోగము" అగుచున్నది. నిరాకార ఈశ్వరుని ధ్యానించిన "శూన్యయోగ" మగుచున్నది. ఈ సమస్తము "శుద్ధయోగము" లేదా "రాజయోగము" మాత్రము కాజాలదు.

ఎవరు ఎక్కడకు చిత్తమును తీసికొనివెళ్ళెదరో, దేనియందు చిత్తమును లగ్నముచేయుచుందురో అపుడు దానితో

మీరు యోగించెదరు. దీనిపేరేయోగము. కాని శుద్ధయోగము కాదు. మీ పుత్రకళత్రాదులయందు, మీ కార్యక్రమమందు చిత్తమును లగ్నముచేయుట మంచిదియే! కాని ఇది రాజయోగముకాదు. దొంగతవమందు, లంచము తీసికొనుటయందు, అవిశ్వాసమందు చిత్తముంచుట "కుకర్మయోగము". ఇట్లే సత్కర్మాచరణమందు బుద్ధినుంచిన "ధర్మయోగము" కాగలదు. ధర్మయోగము మంచికి, అధర్మయోగము చెడ్డకు దారి. తీయగలదు.

చిత్తైకాగ్రతతోకూడిన ప్రతిపనియు యోగమే. గీత పదునెనిమిది అధ్యాయములు కలిగియున్నది. దాని రచయిత వ్యాసమహర్షి. దానియందు ప్రతి అధ్యాయనామముయొక్క అంతమున "యోగము" అను శబ్దమును జోడించి సమాసమును సమకూర్చియుండెను. అర్జున విషాదయోగప్రభృతి పదునెనిమిదవ అధ్యాయమగు మోక్షోపన్యాసయోగపర్యంతము ప్రతి అధ్యాయనామాంతమున "యోగము" అను పదప్రయోగమును చేసియుండెను. పై నుదహరింపబడిన నియమాను సారముగనే అట్లుచేసియుండెను.

ప్రసిద్ధ అద్వైతవేదాంతి యోగీశ్వర శివముని శుద్ధయోగము లేక సమాధియోగమునుగురించి ఈవిధముగ వివరించి యున్నారు.

రాజయోగమున చిత్తము దేనియందును లగ్నము

కాదని శాస్త్రములు చెప్పుచున్నవి. "తదాద్రష్టుః స్వరూపేఽవస్థానమ్" (యోగదర్శనశాస్త్రము) యోగముతో సాధకుడు చిత్తముయొక్క సమస్తవృత్తులను నిరోధింపగలిగినపుడు సాధకుడు లేక ద్రష్ట తన స్వరూపమందు స్థిరుడై యుండునని భావము. కాని నీలోనీవు శుద్ధస్వరూపమును చూడగోరినయెడల మంచి, చెడు ద్వివిధ వృత్తులను విసర్జింపవలసియుండును. శుద్ధయోగ మూలమున సమస్తవృత్తులు బహిష్కృతమైనపుడు విశుద్ధ స్వరూపము ప్రకాశింపగలదు. పరిశుద్ధజలమందు శర్కర కలిపి నచో మధురజలమగును; ఉప్పుకలిపిన లవణజలమగును. శర్కర గాసి, లవణముగాని రెండూ పరిశుద్ధజలమును వికృతపర్చగలవు. సోడా, నిమ్మనీరు ఆదిగాగల మధురపానీయములవలన దాహము తీరదు; నిర్మల జలపానమువల్లనే తీరగలదు. ఇదేవిధముగ మన చిత్తవృత్తులు మరియొక రెండవ పదార్థమందు లగ్నమైయున్న పుడు మనము శుద్ధస్వరూపమునుండి జారిపోగలము. కావున సాధనకాలమున కొద్దిసమయముపరకైన శుద్ధయోగకర్తవ్య కాలమందు సమస్తవృత్తులను నిరోధింపవలసియుండును. మీరిట్లు చేయగలిగినపుడు "తదా ద్రష్టుః స్వరూపేఽవస్థానమ్" అను సూత్రము సార్థకము కాగలదు. ఇదియే "శుద్ధయోగము"! ఈ సాధనయే మానవుని జీవన్ముక్తినిచేయగలదు. కావునమాన వుడు తన శుద్ధస్వరూపమును దర్శించుట అవసరమగుచున్నది; ఇదియే "శుద్ధయోగము", "రాజయోగము" లేదా "సమాధి యోగము" అగుచున్నది.

జ్ఞానము లేని యోగము సిద్ధింపజాలదు; యోగరహిత మగు జ్ఞానముకూడ వ్యర్థమేకాగలదు. జ్ఞానమూలమునసే యోగసిద్ధి కలుగగలదు; యోగసాధనానంతరము వాస్తవిక జ్ఞానము బలపడగలదు. జ్ఞానికి యోగికావలసిన అవసరమున్నది; యోగికి జ్ఞానియగుట అనివార్యమగుచున్నది. కనుక జ్ఞానము గొప్పదియా? లేక యోగము గొప్పదియా? అను ప్రశ్నార్థకము వితండవాదమగుచున్నది; రెండును గొప్పవియే! రెండును అత్యావశ్యకములే!!

నేడు జ్ఞానాభివృద్ధి జరుగుచునేయున్నది; కాని అది నెమ్మదిగ జరుగుచున్నది. మతసాంప్రదాయికాచారములు మరియు తద్భావనలు సత్యసిద్ధాంతములను వెలుగులోసికి రానిచ్చుట లేదు. మతనేతలు - స్వతంత్రఆలోచనాంకురములను వెదకి, వెదకి త్రుంచివేసియుండిరి. స్వతంత్రభావయుక్తసత్యవక్తలనేకులు హత్యచేయబడిరి. ఘాదరీలు, పైగంబరులు మరియు పూజారులు మానవమస్తిష్కమునకు తమ తమ భావములతో తాళమును బిగించియుండిరి. ప్రతిమతము నేడిదోషము పట్టి పీడించుచునేయున్నది.

మానవుడు సుఖియగుటకు ధనధాన్యాధికారములుండ నవసరము లేదు. నిజమగు సుఖము స్వతంత్రమూలమునసే లభ్యముకాగలదు. స్వతంత్రదేశమందు, స్వతంత్రజాతియందు స్వతంత్ర మస్తిష్కమందు నిజమగు జ్ఞానముదయింప

గలదు. మతమతాంతరపక్షపాతావృతమైన మానవమస్తిష్కమందు నిజమైన జ్ఞానోదయము కాజాలదు; మరుభూమియందు మంచి విత్తైనా మొలకెత్తగలదా?

బానిసభావములను, బానిసత్వమును విసర్జింపవలయును. విషయబానిసత్వము, ఇంద్రియబానిసత్వము, వాసనాబానిసత్వము, రాజకీయ బానిసత్వము, దేవతా బానిసత్వము ఈశ్వరబానిసత్వాది సమస్త బానిస భావములను త్యజించి మానవుడు పూర్ణస్వతంత్రుడు కావలసియున్నది. ఈశ్వరబానిసత్వముకూడ బానిసత్వమే! బంగారు సంకెళ్ళతో బంధించినను అది బంధనమే యగుచున్నది. చాలమంది వేదాంతవేత్తలు సమస్తబంధనవిముక్తులైనప్పటికి కల్పితఈశ్వరబంధనభావముల నుండి విముక్తిని పొందజాలకున్నారు.

నేటి మానవుడు సమస్తమునకు బానిసగ మారియున్నాడు; దీనికికూడ స్వామికాజాలకున్నాడు. మతమునకు బానిస, మంత్రులకు బానిస, మందులకు బానిస, వైద్యులకు బానిసయై బ్రతుకుచున్నాడు.

ఉపర్యుక్త బానిసభావములు లేకుండ పశుపక్ష్యాదులు అనందముగ జీవించుచున్నవి. కాకులకు వైద్యుడు లేడు, వైద్యగ్రంథములు లేవు, ఔషధములు లేవు, ఔషధాలయములు లేవు, మతఈశ్వరభావము లేదు, స్వర్గనరక భావన లేదు, రాజకీయాది ప్రతిబంధకములు లేవు, పోలీసుడిపార్టు

మెంటు లేదు మరియు సైనికసిబ్బందికూడ లేదు; అయినప్పటికి అవి పరమస్వతంత్రముగ తమ ఆత్మప్రబోధమునకు అనుకూలముగ తినుచు, తిరుగుచు స్వేచ్ఛాజీవితమును గడుపుచున్నవి. దీనికి కారణము? అవి స్వస్థత కలిగియుండుటయే! "స్వస్థత" అనగ – (మానవపరముగ) ఆత్మస్థులమగుట, ఆత్మవిశ్వాసమును కలిగియుండుట లేదా "అహం బ్రహ్మాస్మి" అను భావమును కలిగియుండుట అని తాత్పర్యము.

కాని మనమట్లుకాదు; ఔషధస్థులము, పుస్తకస్థులము, మతస్థులము అగుచున్నాము. అయినప్పటికి ఆత్మస్థుడే స్వతంత్రుడగుచున్నాడు. "స్వాతంత్ర్యము" అను శబ్దమునకు "స్వరాజ్యము" అని నిర్వచనమిచ్చుచున్నారు. స్వరాజ్యశబ్దమునకు ఆధ్యాత్మికభాషలోను, మతపరిభాషలోను "ముక్తి" అని చెప్పుచున్నారు. స్వభావసిద్ధముగ మానవాత్మ ముక్తిని, స్వతంత్రతను ప్రేమించుచుండును. మానవుడన్నివిధముల పూర్ణస్వతంత్రుడు కానంతవరకు జీవన్ముక్తుడు కాజాలడు; జీవన్ముక్తునకుగాని పరలోకము క్తి లభ్యముకాదు.

మానవుడుకూడ అధికారిగ, శాసకుడుగ, నాయకుడుగ కానంతవరకు సౌమ్యముగనే జీవించుచుండును. పోలిస్, పూజారి మరియు రాజకీయవేత్త అయినపుడు విచిత్రవ్యక్తిగ మారిపోవుచుండును.

అందరిని ప్రేమించుట మానవధర్మము. కాని మతము,

రాజకీయము మానవులను పరస్పరము ప్రాణశత్రువులుగ మార్చి వేయుచున్నది. ఇందుమూలమున మానవజాతి నిజమగుహృదయ శాంతిని, స్వస్థతను కోల్పోవుచున్నది. నేడుకూడ మతరాజకీయ నాయకుల మూలమునసే మానవజాతి దుఃఖములపాలగు చున్నది.

మతపండితుడు తన మతగ్రంథము ఈశ్వరకృతమని, అపౌరుషేయమని నమ్మించి ప్రజల ఏ తర్కబుద్ధికి దూరము చేయుచున్నాడు. నేడు పుస్తకపఠనముద్వారా నిజజ్ఞానమును పొందుట కష్టసాధ్యముగనున్నది. నిజమగుజ్ఞానము తక్కువగనే పుస్తకములకు వచ్చుచున్నది. మంచి పాండిత్యము, అనుభవము గల లేఖకుడుకూడ తనకు తెలిసినదానిలో కొంతభాగమును మాత్రమే మాటలలో చెప్పగలుగుచున్నాడు; మాటలలోచెప్ప గలిగినదానికన్న చాలతక్కువగనే వ్రాయగలుగుచున్నాడు. వ్రాయబడిన పుస్తకములన్నియు ముద్రింపబడవు. ముద్రింపబడిన వానిలో చాల తక్కువపుస్తకములే ప్రచారమునకు వచ్చు చున్నవి. అట్లు వ్యాప్తినిపొందిన పుస్తకములలో మతసాంప్ర దాయిక గ్రంథములే ఎక్కువగనున్నవి.

స్వతంత్రభావయుక్తులగు లేఖకులుకూడ భయపడి తమ స్వతంత్రభావములను లిపిబద్ధము చేయజాలకున్నాడు. ఈదుస్థితి నేడుకూడ కొనసాగుచునేయున్నది. గతమందు గ్రహించియున్న ప్రాచీనవిషయముల నిపుడు తెలిసికొనవలసిన అవసరమంత ఏమున్నది? కొన్ని నూతనవిషయముల తెలిసికొనుటకు, నవీన భావముల సంగ్రహించుటకు, కొన్నిసత్యస్వతంత్ర సిద్ధాంతముల

ధారణచేసికొనుటకొరకు మానవుడు పుస్తకపఠనము చేయువలసిన అవసరము కలుగుచున్నది.

లేఖకుని విషయముల నంగీకరించుట లేక అంగీకరింపక పోవుట అను సందర్భమున పాఠకులకు సర్వాధికారము కలదు; అట్లే లేఖకుడుకూడ తన భావముల లిఖించుటకు సర్వస్వతంత్రుడైయున్నాడు.

మానవుడు సర్వోత్కృష్టప్రాణి; ఇతని బుద్ధిని పుస్తక దాసిగచేయప్రయత్నింపరాదు పుస్తకములు మానవులకొరకే రచింపబడినవి; మానవుడు పుస్తకములకొరకుకాదు. పక్షపాత రహితముగ ఆలోచించినయెడల - బైబిలు, ఖురాను మఱియు వేదపురాణాదులు మానవసౌకర్యార్థము మానవులచేతనే రచింపబడినవని ధృవపడగలదు. మానవుడు పుస్తకదాసుడుకాడు, రచయిత!

వేదవేదోపనిషత్తులయొక్క, అనేక ఇతర ప్రమాణగ్రంథములయొక్క సహకారముతో స్వానుభవము నాధారముచేసికొని అగాధమగు, అవ్యక్తమగు పరలోకరహస్యములతోకూడిన ఈ గ్రంథరచనకు పూనుకొనుట నావంటి సామాన్యవ్యక్తికి కష్టసాధ్యమే కావచ్చును; కాని స్వతంత్రభావప్రకటనోత్సాహ వేగము నన్నీప్రయత్నమునకు ప్రోత్సహించి మార్గదర్శకమైనది. దానిఫలితమే ఈ గ్రంథరచనము; ఈ రచనామూలమున నాకు కొంతవరకు ఆధ్యాత్మిక భావోన్నతి లభ్యముకాగలదని తృప్తి చెందుచున్నాను. ఇది "బాల్యచాపల్యము" కాదు; "వృద్ధచాపల్యము" కావచ్చును !! శుభం భూయాత్.

—0—

AOUA COUB 126

మహమ ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	AOUA104B126
పుస్తకం పేరు	పరలోకము
తారీఖు	31 December 2025
ముందు అట్ట	No
వెనుక అట్ట	
మొత్తం పేజీలు	145
పెద్ద సైజు పేజీలు	No
ఖాళీ పేజీలు	No
లేని పేజీలు	No
తయారు చేసినది	P. Jayalakshmi
పేజీలు విడదీసినది	P. Jayalakshmi
స్కాన్ చేసినది	anusha
పరీక్ష చేసినది	
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
వరిస్థితి	